ఆర్షవిద్యా తరంగిణి

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

DRG DRSYA VIVEKAM

# దృగ్దృశ్య వివేకము

## స్వామి పరమార్థానంద



దృగేవ న తు దృశ్యతే

### స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో

### వారి ఆశీస్సులతో

### తెలుగు సేత – మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ

Second edition - Year 2021 1000 copies

For Copies

ARSHA VIDYA TARANGINI TRUST
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019

Mobile: 9849092368

Email: raghavkasturi@gmail.com
for softcopy www.telugubhakti.com

Sanskrit Support - Sri Desu Chaitanya Krishna

DTP - Smt. Syamala Sripathi, 9966383661

Printed at
Sai Sri Printers
8-3-945 # 21 Pancom Business Centre,
Ameerpet Hyderabad --500073
e-mail : saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222

Price Rs. 100

# బ్రహ్మయజ్ఞం

భూదేవిలాంటి అమృతహస్తం; సముద్రమంత విశాలహృదయం;
అగ్నిలా ఎగసి పడే ఉల్లాసం; చల్లని గాలిలా సేదదీర్చే ఆప్యాయత;
ఆకాశంలా అసంగంగా ఉండి; ఎల్లప్పుడూ ఆధ్యాత్మిక చింతనతో;
కష్టాలకడలిలో కూడా నవ్వుతూ, నలుగురినీ నవ్విస్తూ, జీవన్ముక్తిని పొంది;
ఆ పంచభూతాల ఒడిలోనే విదేహముక్తి పొందారు **భవాని!**

ప్రజ్ఞారణ్యస్వామి వారిని కళ్ళలో పెట్టుకుని చూసుకుని,
గాయత్రీ అమ్మగారి కనుసన్నలలో మెలిగి,
మమ్మల్ని ఎనలేని సేవాభావంతో కంటికి రెప్పలా కాపాడి,
అందరికీ కనుపాపలా, తలలో నాలుకలా మెలిగారు **కొట్టం భవాని!**

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**
**మనోబుద్ధ్యహంకార చిత్తాని నాహమ్**
**న మే ద్వేషరాగౌ న మే లోభ మోహౌ**
**న పుణ్యం న పాపం న సౌఖ్యం న దుఃఖం**
**చిదానందరూపః శివోహం శివోహమ్॥**

ఈ రూపానికి ప్రతీక, **భవానీ** గుర్తుగా – ఈ బ్రహ్మయజ్ఞం చేపట్టారు **శారదక్క.**

దృగ్దృశ్య వివేకము పుస్తకప్రచురణ అనే బ్రహ్మయజ్ఞానికి ఆర్థికసహాయాన్ని అందచేసిన **శ్రీమతి యలవర్తి శారదగారు** సదా బ్రహ్మనిష్ఠలో నిలవాలని ఆ ఈశ్వరుని వేడుకుంటున్నాము. వారి పతిదేవులు **శ్రీయలవర్తి రాజారావుగారికి,** వారి పిల్లలకూ, మనవళ్ళకూ, మనవరాళ్ళకూ ఆయురారోగ్య ఐశ్వర్యాలను, ఆధ్యాత్మిక చింతనను, వైదిక, ధార్మికజీవనాన్ని, మరింత సమృద్ధిగా ఇవ్వమని ఆ భగవంతుని వేడుకుంటున్నాము.

**– రాఘవరావు, రాజ్యశ్రీ**

# విషయసూచిక

1. బ్రహ్మయజ్ఞం 03

2. కరదీపిక 05

3. నమో నమః శ్రీ గురుపాదుకాభ్యామ్ 07

4. వారాణసీపురపతిం భజ విశ్వనాథమ్ 09

5. స్వామిని ఆత్మలీనానందవారికి నమస్సుమాంజలులు 11

6. దయాసత్సంగ్ సభ్యుల స్పందన 13

7. దృగ్దృశ్య వివేకము – శ్లోకాలు 15

8. శ్రీగణపతి ప్రార్థన 20

9. దృగ్దృశ్య వివేకము 21

10. దృగ్దృశ్య వివేకము – సారాంశము 133

# కరదీపిక

భారతదేశంలో అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని స్థిరప్రతిష్ఠ గావించిన మహానుభావుడు ఆదిశంకరులు. వీరు ఉత్తమ, మధ్యమ, అధమ అధికారులైన సాధకులకు మార్గదర్శకాన్ని నిర్దేశించే ఎన్నో ప్రకరణ గ్రంథాలను రచించారు. వాటిలో **'దృగ్దృశ్య వివేకము'** ఒకటి.

శ్రోత్రియ, బ్రహ్మనిష్ఠుల కోవకుచెందిన స్వామి పరమార్థానందగారు నిరంతరము ప్రస్థానత్రయాన్ని సాధకులకు బోధచేస్తున్నారు. ఎటువంటి జటిలమైన వేదాంత విషయాన్నైనా సులభమైన రీతిలో తేటతెల్లంగా వివరించడంలో వీరు సిద్ధహస్తులు. ఎందరో సాధకలోకానికి వీరి ప్రవచనాలు మార్గదర్శకంగా నిలిచాయి. ఈ **దృగ్దృశ్య వివేకము**పై వీరి వివరణ హృదయానికి హత్తుకునేలా, ఆధ్యాత్మికమార్గంలో ప్రయాణించే సాధకులకు కరదీపికలాగా సహకరిస్తుంది.

ఈ **'దృగ్ద ృశ్య వివేక'** గ్రంథములో ఆదిశంకరులు మన నిజస్వరూపాన్ని తెలుసుకునే విధానాన్ని ఒక పద్ధతిలో నిర్దేశిస్తున్నారు.

**'దృక్'** అనగా తాను ఎటువంటి మార్పులకు లోనుకాకుండా ఏకంగా ఉంటూ, తనను తాను గుర్తిస్తూ ఇతరమైన వాటిని కూడా గుర్తిస్తూవుండే జ్ఞానస్వరూపమే.

**'దృశ్యం'** అనగా అనేక మార్పులకు లోనవుతూ తన ఉనికిని తాను గుర్తించలేక ఇతరమైన వాటిని గుర్తించలేక, తాను ఇంకొకరిచే గుర్తింపబడేది.

ప్రపంచం దృశ్యం. ఇది ఇంద్రియాలచే గుర్తింపబడుతూ ఉంటుంది కావున ఇంద్రియాలు దృక్. ఇంకొంచెం లోతుగా ఆలోచిస్తే ఇంద్రియాలను సైతం మనస్సు, ఆ మనస్సును బుద్ధి, బుద్ధిని సర్వసాక్షియైన పరమాత్మ గుర్తిస్తూ ఉంటుంది. ఈ విధంగా చూస్తే అసలు దృక్ పరమాత్మయే. ఆ దృక్ స్వరూప పరమాత్మయే నేను అని గుర్తించడమే మోక్షం.

అలా కాకుండా ఇంద్రియాలతో మనోబుద్ధులతో తాదాత్మ్యం చెందడమే సంసారం.

ఈ ఇంద్రియ మనోబుద్ధులతో తాదాత్మ్యం చెందేది ఎవరు? సంసారం ఎవరికి?

నిజానికి ఆత్మ ఎప్పుడూ దేనితోను తాదాత్మ్యం చెందదు. మనస్సే తాదాత్మ్యం చెందుతుంది. దానికే ఈ సంసారం.

ఈ మనస్సే సాక్షిచైతన్యంతో తాదాత్మ్యం చెంది స్వతహాగా తాను ఉనికి లేనిదైనా నేను 'ఉన్నాను' అని భావిస్తుంది. ఇది భ్రాంతిజన్యం. జ్ఞానప్రబోధం కలుగగానే ఆ భ్రాంతి నశించి, బ్రహ్మమే సత్యం, మిగిలినదంతా అసత్యం అని తెలుస్తుంది.

ఇదంతా చిదాభాస సహిత మనస్సుయొక్క కల్పన. ఇదంతా అసత్యమని, దృశ్యస్వరూపమని తెలుసుకుని దృక్ స్వరూపమైన చైతన్యమే నేను అని గుర్తించడమే జీవితపరమార్థం. దీనికి చేయవలసిన సాధన –

1. కర్మనాశనము, 2. జ్ఞానప్రబోధం. ఇవి కలగాలంటే యమ నియమాది అనుష్ఠానం, సమాధినిష్ఠ అవసరం. ఈ విషయాన్నంతా ఈ గ్రంథం ఎంతో విపులంగా వివరిస్తుంది.

**స్వామి సర్వాత్మానంద,**

**చిన్మయ శారదా తపోవనం, కొత్తపట్నం. ప్రకాశం జిల్లా.**

# నమో నమః శ్రీ గురుపాదుకాభ్యామ్

**ఎవర్ ది ఎక్స్‌పీరియెన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియెన్స్‌డ్**

**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

**పరమార్థానంద స్వామీజీ** ఈ భావాన్ని మనస్సులో హత్తుకుపోయేలా, నిద్రలో లేపి అడిగినా, చెప్పగలిగేలా ప్రతి ఒక్క ఉపనిషత్తులోనూ చెపుతూనే ఉంటారు.

కొన్ని కాన్సెప్టులను మనలో నాటుకునేలా చేయటానికి అలుపెరగకుండా కొన్ని వందలసార్లు, కాదు కొన్ని వేల సార్లు చెబుతారు. అందులో మొట్టమొదటిది చైతన్యంయొక్క ఐదు లక్షణాలు. అంతేకాదు దాన్ని వివరించటానికి కాంతి–చేయి ఉదాహరణ అన్నిసార్లూ ఇస్తారు. (**దృగ్దృశ్య వివేకము**లో కూడా 4వ శ్లోకానికి ఇచ్చిన వివరణలో ఈ విషయం చూడవచ్చు). స్వామీజీయే చెప్పారు, ఒకసారి తన శిష్యులకు చెప్పారుట కూడా, మీలో ఎంతమంది ఈ 5 లక్షణాలనూ చూడకుండా రాయగలరో, ఇంటికి వెళ్ళి ప్రయత్నించి చూడండి అని.

దాని తర్వాత చెప్పే రెండో అంశం పైన చెప్పినది.

**ఎవర్ ది ఎక్స్‌పీరియెన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియెన్స్‌డ్**

ఇందులో దాన్ని ఎలా జీర్ణించుకోవాలో చెబుతారు. వేదాంత శిష్యులు ఎక్కువగా ఒక సమస్యను ఎదుర్కొంటారు. వారు వేదాంతాన్ని అధ్యయనం చేసి బాగానే అర్థం చేసుకుంటారు. వచ్చిన చిక్కేమిటంటే సమస్య, దాని పరిష్కారం బుద్ధికి బాగానే అర్థం అయింది, కాని మనస్సు మాట విననంటోంది. దాన్ని ఆచరణలో పెట్టలేకపోతోంది. అందువల్ల బుద్ధి అర్థం చేసుకున్న జ్ఞానానికి, భావోద్రేకానికి లోనయ్యే మనస్సు ప్రవర్తించే తీరుకూ హస్తిమశకాంతరం అంత తేడా ఉంది. మనస్సులో పేరుకుపోయిన రాగద్వేషాలు, కామక్రోధాలు, చికాకులు, బెంగలు – ఏవీ ఏ మాత్రం తగ్గటం లేదు. ఇది తగ్గటానికి స్వామీజీ చాలా తేలికైన ఉదాహరణ ఇస్తారు. అది ఇది–

పంచె కట్టుకున్న ఒక వ్యక్తికారులో వెళుతున్న వ్యక్తిని సాగనంపటానికి వచ్చాడు. వెళుతున్న కారులో అతని పంచె చిక్కుకుపోయింది. కారు వెంట పరుగెత్తి అందుకోలేక పోతున్నాడు. అయితే ఏం చేయాలి? దానికి ఒకటే మార్గం. పంచెను

వదిలివేయటమే! అలాగే మనస్సు పెట్టే చికాకుల వెంట పరుగెత్తి వాటిని అందుకోలేము. అది కోరే అనంతకోటి కోర్కెలు తీర్చుకోలేము. దానికీ ఒకటే మార్గం. నేను మనస్సు కాదు, నేను సాక్షిచైతన్యం అని తెలుసుకోవటమే! ఎంత బాగా చెప్పారో చూడండి! వ్యక్తిత్వ వికాసం పుస్తకాలలో కూడా ఈ విషయం అంత తేలికగా చెప్పలేరు.

కొందరు బ్రహ్మ అనుభవం పొందకపోవటం వల్లే ఈ సమస్య అనుకుంటారు. బ్రహ్మ అనుభవం పొందే బాహ్యవస్తువు కాదు. బ్రహ్మ నువ్వే. సమస్య ఎక్కడంటే, మనం ఆత్మజ్ఞానాన్ని జీర్ణించుకోవటం లేదు. జీర్ణించుకోవటం అంటే ఆ సత్యంలో జీవించటం.

దీనికి మరో అద్భుతమైన ఉదాహరణ, అదీ మన దైనందిన జీవితంలోంచి. కాఫీలో పంచదార తక్కువయ్యిందని నాలుగైదు చెంచాల పంచదార వేసుకున్నా అది తియ్యగా ఉండదు. ఎందుకు? ఒక్క చెంచా వేసినా దాన్ని బాగా కాఫీలో కలిసిపోయేలా కలిపితేనే పంచదార తీయదనం దానికి వస్తుంది. అలాగే బోధను అంతర్గతం చేసుకోకపోతే, అది కేవలం జ్ఞానం పెంపొందించుకున్నట్టు అవుతుంది తప్ప ఆత్మజ్ఞానం అవదు.

ఒక అల అలలన్నింటిలోనూ నీరు ఉంది, సముద్రంలోనూ నీరు ఉంది అంటే చాలదు, నాలోనూ అదే నీరు ఉంది అని తెలుసుకోవాలి. అలా తెలుసుకోకపోతే, మిగతా అన్నింటిలోనూ నీరు ఉంది కాని నేను చిన్న అలనే అనుకుంటుంది.

అదీ స్వామీజీ ప్రత్యేకత! తన బోధ నుంచి కొంచెం కూడా పక్కకు వెళ్ళరు. విషయం మర్చిపోయి, అప్రస్తుతమైన విషయాల గురించి మాట్లాడరు. కాని కాన్సెప్ట అర్థమవటానికి మర్చిపోలేని, మరపురాని, మహా గొప్ప ఉదాహరణలను ఇస్తారు.

**నమో నమః శ్రీ గురుపాదుకాభ్యామ్**

**మద్దూరి రాజ్యశ్రీ**

# వారాణసీపురపతిం భజ విశ్వనాథమ్

**వాచామగోచర మనేక గుణస్వరూపం**
**వాగీశవిష్ణుసురసేవిత పాదపీఠమ్।**
**వామేన విగ్రహవరేణ కళత్రవంతం**
**వారాణసీపురపతిం భజ విశ్వనాథమ్॥**

సాక్షాత్తూ విష్ణుమూర్తి, దేవతలు కొలిచిన పుణ్యక్షేత్రం కాశీక్షేత్రం. అలాంటి పుణ్యక్షేత్రం మహిమలకు పెట్టింది పేరు. మాకు అక్కడ జరిగిన మహిమలెన్నో చెప్పనలవికాదు.

కాశీలో శృంగేరీపీఠంలో మా **అద్వైత వేదాంత శిబిరం** తొమ్మిదిరోజులు, 41మందితో అంగరంగ వైభవంగా సాగటమే పెద్ద మహిమ. శృంగేరి శంకరమఠం మాకు అనువుగా ఉంటుందని సూర్యకుమారిగారికి లక్ష్మిగారు చెపితే, అలాగే ఆ ఆశ్రమ నిర్వహణ చూస్తున్న శ్రీ అన్నపూర్ణ ప్రసాద్ గారిని అడిగాము. ఇంక ఆయన అభయప్రదాత అయిపోయారు మాకు.

రెండంతస్తులు పూర్తిగా మాకే కేటాయించారు. ఒక్కో అంతస్థులో చుట్టూ గదులు, మధ్యలో పెద్ద హాలు ఉంది. పూర్వం నాలుగిళ్ళ చావిడి అనేవారు కదా, అలా ఉంది అది. తలుపుతీస్తే క్లాస్‌రూము, చాలా బాగుంది అనుకున్నారు అందరూ. అది ఒక మహిమ.

మాకు ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు బోధించిన ఆత్మలీనానంద స్వామిని నిదిధ్యాసనం చేసుకోవటానికి కాశీపట్నానికి వలస వచ్చేశారు. అయినా మా మీద అభిమానం కొద్దీ, అడిగిందే తడవుగా, మా శిబిరాన్ని ప్రారంభించి, అపరోక్షానుభూతిలోని ధ్యానశ్లోక వివరణ చెప్పి, అందరినీ మంత్రముగ్ధులను చేశారు. అది మరో మహిమ.

శ్రీ అన్నపూర్ణ ప్రసాద్‌గారి సూచనమేరకు, సూర్యకుమారిగారిద్వారా వంటకు ఒక అమ్మాయిని తీసుకువెళ్ళాము. ప్రతి రోజూ చక్కగా మాకు కావాల్సినవి అడిగి చేయించుకు తినేవాళ్ళం. ఇది ఇంకో మహిమ.

మాకు ఏం కావాలన్నా అన్నపూర్ణప్రసాద్ గారి చెవిన వేస్తే చాలు, పనులు చకా చకా అయిపోయేవి. జ్యోతిప్రజ్వలనానికి నిలువెత్తు జ్యోతి, ప్రసంగాలు ఇచ్చుకోవటానికి మైకు, పిండప్రదానాలు చేసుకోవటానికి తెలిసిన బ్రాహ్మణులు,

చివరిరోజు గురువుద్వారా ఇప్పించటానికి కాశీచెంబులు, శివలింగాలు– ఒకటేమిటి అన్నీ క్షణాలమీద అమర్చిపెట్టేవారు. ఇవన్నీ మహిమలు కాక మరేమిటి?

మావారు రాఘవరావుగారు **అపరోక్షానుభూతి,** నేను **దృగ్దృశ్య వివేకము** అనే ప్రకరణ గ్రంథాలు బోధించాము అక్కడ. అపరోక్షానుభూతి పెద్దదే. అయినా దాన్ని ఒక క్రమపద్ధతిలో క్లాసుకు తొమ్మిది శ్లోకాల చొప్పున విభజించుకుని చాలా చక్కగా బోధించారు. **దృగ్దృశ్య వివేకము** అందరూ ముక్తకంఠంతో పఠిస్తుంటే నాకు ఆనందంగా ఉండేది. నాకు ఆనందం కలుగుతున్నదని వారు గ్రహించారు.

పొద్దున్న శ్రీ రామ్మోహన్‌గారు యోగాసనాలు నేర్పేవారు. దాని తర్వాత రుద్రంతో ప్రార్థన మొదలుపెట్టి, ఇద్దరం మా మా బోధలు చేసేవారము. మళ్ళీ మూడింటినుంచి రెండు గంటలు మధ్యాహ్న బోధ ఉండేది. రాత్రి భోజనాలయ్యాక గంటసేపు సత్సంగం. సభ్యులు ఒక్కొక్క అంశంమీద మాట్లాడేవారు. శ్రీ విష్ణుప్రసాద్‌గారు అనుష్ఠానం గురించి, యోగాసనాల గురించి మాట్లాడారు. ఇలా తొమ్మిదిరోజులు మా శిబిరం నడిపాక, రుద్రాభిషేకం చేయాలనుకున్నాము. అది ఒక పెద్ద మహిమ.

శ్రీ అన్నపూర్ణప్రసాద్‌గారు ఒక పెద్ద స్ఫటికలింగం, దానికి వెండి పానువట్టం ఉన్నది తెచ్చారు. మాతోనే ఆ లింగానికి పూజ ఆరంభమట. నలుగురు వేదపండితులను పిలిచి, సామాగ్రి సమృద్ధిగా తెప్పించి ఘనంగా, దిక్కులు దద్దరిల్లిపోయేలా వారి యజ్ఞశాలలో చేయించారు. ఆ ఆశ్రమంలో ఆంజనేయస్వామి గుడి, యజ్ఞశాల, వంటశాల, గోశాల, మామిడిచెట్టు ఉన్నాయి. ఇవన్నీ ఉన్నచోట ఉండాలిట. అంతేకాదు,వేదపాఠశాలలో వేదం నేర్చుకుంటున్న చిట్టి, పొట్టి తమ్ముళ్ళను పిలిపించి వారిచేత వేదపారాయణం చేయించారు. వింటుంటే ఎంత మధురంగా ఉందో చెప్పలేను. ఆ రోజు విందు భోజనం అందరికీ. ఇప్పటికీ ఆ రుద్రాభిషేక వైభవం తలచుకుంటే ఒక పులకింత కలుగుతుంది.

నాకు జరిగిన అద్భుతాలు రెండు. మా అమ్మాయికి మేము అక్కడ ఉండగా ఉద్యోగం వచ్చింది; మావారు రుద్రాక్షమాల వేసుకోవాలని నేను మనస్సులో అనుకున్నాను. చివరిరోజు అన్నపూర్ణ ప్రసాద్ గారు మావారిని ప్రత్యేకంగా పిలిచి, రుద్రాక్షమాలను ఆయన స్వయంగా మావారి మెడలో వేశారు. అలా దిగ్విజయంగా ముగిసింది మా అద్వైత వేదాంత శిబిరం!!

**– మద్దూరి రాజ్యశ్రీ**

# స్వామిని ఆత్మలీనానందవారికి నమస్సుమాంజలులు

**గురోరంఘ్రి పద్మే మనశ్చేన్న లగ్నమ్।**
**తతఃకిం తతఃకిం తతఃకిం తతఃకిమ్॥**

గురువు దీవెనను మించిన దీవెన ఉందా? గురువూ, పరమాత్మ ఒక్కసారి ప్రత్యక్షమయితే, ముందుగా గురువు పాదపద్మాలకే నమస్కారం చేయాలన్నారు పెద్దలు. ఎందుకంటే గురువే పరమాత్మను దర్శింపచేస్తాడు. మా విషయంలో అక్షరాలా అదే జరిగింది.

మా వారు రాఘవరావుగారూ, నేనూ కొన్ని సంవత్సరాలు ఆత్మలీనానంద స్వామిని దగ్గర ఆత్మవిద్య నేర్చుకున్నాము. కొన్ని ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలూ నేర్చుకున్నాము. వాటిని స్వామిని మనస్సుకు హత్తుకుపోయేలా బోధించారు. స్వామిని దయానందసరస్వతి స్వామీజీ శిష్యురాలు. ఆయనంటే ఎనలేని గౌరవాభిమానాలు. పూజ్యస్వామీజీ అంటూ ఆయన గురించి తరుచూ చెప్తూనే ఉంటారు. ఆయన హైదరాబాద్ వచ్చినప్పుడు మమ్మల్నందరినీ తీసుకువెళ్ళి పరిచయం చేశారు.

ఈమధ్య స్వామిని, హైదరాబాద్‌లో బోధ చేయటం విరమించుకుని నిదిధ్యాసనం చేసుకోవటానికి కాశీ వెళ్ళిపోయారు. మధ్యలో గీతాజయంతి ముందు హైదరాబాద్ వస్తే మేమిద్దరం వెళ్ళి కలిశాము. మమ్మల్ని గీతా జయంతికి ఆహ్వానించారు. మా దంపతులం మూడు సత్సంగాలలో ఆత్మవిద్య బోధ చేయటం మొదలుపెట్టాము. మా సత్సంగ సభ్యులు గీతాజయంతి వేడుకలను అప్పటికే ఏర్పాటు చేసేసుకున్నారు. ఆ విషయమే ఆవిడతో చెపితే, మీ శిష్యులతో సహా రండి అన్నారు.

గురువు మనస్ఫూర్తిగా దీవిస్తే తప్పక ఫలిస్తుందని చెప్పటానికి ఇదే నిదర్శనం. నాలుగు నెలలు తిరక్కుండా, మేము 41మంది సత్యంగ సభ్యులతో కలిసి కాశీ వెళ్ళాము. ఆవిడ మీ శిష్యులతో సహా రండి అన్నప్పుడు ఈ కాశీ ప్రయాణం ఆలోచనలో కూడా లేదు. దాని తర్వాత అక్కడికి వెళ్ళి పదిరోజులు

ఉండి మేమిద్దరం వేదాంత శిబిరం పెట్టి, అక్కడ బోధించాలనే ఆలోచన రావటం, అది రూపుదిద్దుకోవటం అన్నీ జరిగి, కాశీపట్టణంలో అడుగుపెట్టాము.

స్వామిని దీవెన ఫలించినందుకు ముందుగా వారి దర్శనమే చేసుకున్నాము. ఆవిడ కళ్ళద్వారా కాశీ విశ్వేశ్వరుని దర్శనం చేసుకున్నాము. మేమెంత సంతోషించామో, మాకన్నా ఆవిడ ఎక్కువగా సంతోషించారు. మావారు **అపరోక్షానుభూతి,** నేను **దృగ్దృశ్య వివేకము** చెపుదామను కుంటున్నామని చెప్పాము. రెండూ మంచి ప్రకరణ గ్రంథాలు అని సంతోషించారు. ఇలాంటి బృహత్కార్యం సాహసమేనన్నా, కాశీవిశ్వనాథుని దీవెన ఉంటుందని, దిగ్విజయంగా ముగుస్తుందనీ ముందే మనసారా ఆశీర్వదించారు. అంతేకాదు స్వామిని వచ్చి మా యజ్ఞాన్ని శుభారంభం చేసి, మమ్మల్ని, మా శిష్యులని ఆశీర్వదించాలని కోరితే, హృదయపూర్వకంగా ఒప్పుకున్నారు. పైగా, అంత పెద్ద పని తలపెట్టినందుకు తన భాగంగా **అపరోక్షానుభూతి**లోని ధ్యానశ్లోకాన్ని వివరిస్తానన్నారు. స్వామిని సహృదయానికి మావారికి ఆనందబాష్పాలు రాలాయి.

అన్నట్టుగానే మర్నాడు వచ్చి, గంటసేపు ప్రసంగించారు. గంట గడిచినట్టే తెలియలేదు ఎవరికీ. అందరూ మంత్రముగ్ధులయి విన్నారు. అపరోక్షానుభూతిని వివరించటమే కాదు, కాశీ పుణ్యక్షేత్రాన్ని కూడా మాకు కళ్ళకి కట్టినట్టే వర్ణించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు కూడా చెప్పటంవల్ల ఒక్కరికి కూడా అనారోగ్యం కలుగలేదంటే నమ్ముతారా? మధ్యమధ్యలో గంగాహారతి దగ్గర మాలో కొంతమందికి ఆవిడ దర్శనమయితే, వారి జన్మ ధన్యమయినట్టే భావించారు.

స్వామిని దీవించినట్టే మా వేదాంత శిబిరం అనుకున్నదానికన్నా మహాద్భుతంగా సాగిందని వేరే చెప్పాలా! ప్రత్యక్షంగా వెళ్ళి స్వామినికి కృతజ్ఞతలు చెప్పుకున్నా కూడా తనివి తీరలేదు. మళ్ళీ ఒక్కసారి ఆ మధుర స్మృతులను నెమరువేసుకుంటూ గురుపాదాలకు నమస్కరిస్తున్నాము. మా తరుఫున, మా శిష్యులందరి తరుఫునా!

**జ్ఞానశక్తి సమారూఢః తత్త్వమాలా విభూషితః।**
**భుక్తి ముక్తి ప్రదాతా చ తస్మైశ్రీ గురవే నమః॥**

**మద్దూరి రాజ్యశ్రీ**

# నా స్పందన

నేను ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతల నుండి విరమణ తీసుకొన్న తరువాత, మా సతీమణి శ్రీమతి కొందూరు సుబ్బరత్న, మీరు ఇంట్లో ఉపయోగం లేని టీ.వితో ఎందుకు కాలక్షేపము చేస్తారు, గురువులు శ్రీ కస్తూరి రాఘవరావుగారు మరియు వారి సతీమణి శ్రీమతి రాజ్యశ్రీ అమ్మగారు వేదాంతం/ఉపనిషత్తులు చాలా చక్కగా చెప్పుచున్నారు, మీరు కూడా వస్తే చాలా ఆనందిస్తారు, రావలసినదని 'హుకుమ్' జారీ చేసింది. అలా నేను మా ఆవిడతో మరియు ఇతర దయాసత్సంగ్ సభ్యులతో కలసి గురువులు బోధించిన వేదాంతాన్ని వినడం జరిగింది. గురువులు చెప్పే బోధనా విధానం, వివరణలు, విశ్లేషణలు నాకు చాలా నచ్చేవి. కాని నాకు వేదాంతం కొత్తయినందువలన పూర్తిగా బుర్రకు ఎక్కుతున్నట్లు అనిపించేది కాదు. కాని, వారియొక్క విధివిధానాలు, వేదాంత జ్ఞానాన్ని ఇతరులకు అందించాలనే జిజ్ఞాస, వారి సింప్లిసిటీ నాకు ఎంతో నచ్చాయి. అప్పుడు వారి సత్సంగ్ సభ్యునిగా ఉండాలని నిర్ణయించుకొన్నాను.

పిమ్మట 2017 సంవత్సరములో ఋషికేశ్‌లోని శ్రీ దయానంద సరస్వతివారి ఆశ్రమములో జరిగే వేదాంత శిబిరానికి, మన గురువులతో కలసి వెళ్ళడం, అచ్చట వివరించిన వేదాంతం, అక్కడ గడిపిన రోజులు చాలా ఆనందాన్ని ఇచ్చాయి. తరువాత అటువంటి వేదాంత కార్యక్రమాలను మన సత్సంగం కూడా ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని భావించి 2018వ సంవత్సరము మాఘమాసంలో కాశీ పుణ్యక్షేత్రంలో మొట్టమొదటి వేదాంత శిబిరమును మన గురువుల ఆధ్వర్యంలో జరుపుకొనడం నా వేదాంత జీవితానికి ఒక మైలురాయి. అక్కడ గురువులు శ్రీ రాఘవరావుగారు అపరోక్షానుభూతి, శ్రీమతి రాజ్యశ్రీ అమ్మగారు, దృగ్దృశ్య వివేకము బోధించారు. వీరి బోధలకు సత్సంగ సభ్యులు ముగ్ధులైనారు. అలాంటి వారిలో నేను ఒకడిని. అలా కాశీలో గడిపిన 11-13 రోజులు, నాకు చాలా ఆనందాన్ని ఇచ్చాయి. మరియు అమ్మగారు బోధించిన "దృగ్దృశ్య వివేకము" మనస్సుకు హత్తుకొని పోయింది. ఇదంతా గురువుల జ్ఞానభిక్ష మాత్రమే. అప్పుడు మా కోరిక మేరకు ఈ గ్రంథాన్ని ముద్రించారు.

దృగ్దృశ్య వివేకములో మమ్మల్ని అంతగా ఆకట్టుకున్న అంశం ఏమిటి? మొదటి శ్లోకమే కొత్త ప్రపంచాన్ని చూపిస్తుంది.

**రూపం దృశ్యం లోచనం దృక్ తద్దృశ్యం దృక్తు మానసమ్।**
**దృశ్యా ధీ వృత్తయః సాక్షీ దృగేవ నతు దృశ్యతే॥**

నేను చూస్తున్నాను అని నేను అంటే, ఆ నేను ఎవరు?

బాహ్యప్రపంచాన్ని నేను కన్నుతో చూస్తున్నాను.

**జగత్తు దృశ్యం, కన్ను దృక్ – దృక్ 1.**

కన్నును మనస్సు చూస్తోంది.

**కన్ను దృశ్యం, మనస్సు దృక్ – దృక్ 2.**

మనస్సును కూడా చూసేది ఒకటి ఉంది. అది సాక్షిచైతన్యం.

**మనస్సు దృశ్యం సాక్షిచైతన్యం దృక్ – దృక్ 3 .**

మరి సాక్షిని చూసేదెవరు?

**దృగేవ నతు దృశ్యతే.** అయితే నేను ఏమిటి?

నేను దృక్ 1 + దృక్ 2 + దృక్ 3ల మేలు కలయికను.

సాక్షిచైతన్యానికి చావు పుట్టుకలు లేవు. అది తనంతట తాను ప్రకాశిస్తూ, ఇతర పదార్థాలను ప్రకాశింపచేస్తుంది. అదే శాశ్వతం మరియు స్వయంప్రకాశకం. నేనే ఆ సాక్షిచైతన్యాన్ని. చూచేది ఒకటే, చూడబడేవి అనేకం. అలా చాలా చక్కగా వివరించారు. ఎన్నటికీ మరువలేము. ఇందులకు వారికి వారే సాటి. వారి ఉపదేశం ఎన్నటికీ మరుపురానిది.

దృక్‌దృశ్య వివేకసారం మా సత్సంగసభ్యులకు షడ్రసోపేత విందుభోజనం మరియు అమృతరసాస్వాదనంగా, కాశీలో గడిపిన మధురక్షణాలు నాకు ఒక మరపురాని, మరువలేని అనుభూతిగా మిగిలింది. అలా 40 సభ్యులతో మొదలైన మన గురువుల సత్సంగం ఇప్పుడు ఎన్నో వందల సభ్యులతో దేశదేశాలకు విస్తరింపబడినందులకు గురువులకు పాదాభివందనాలు. మన ఈ 'దృక్‌దృశ్య వివేకం' ఎంతో జనాదరణ పొందింది. ఇప్పుడు రెండవ ముద్రణగా మరలా ముద్రించబడటం ఎంతో సంతోషదాయకం. వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ సందర్భంలో అత్యంత బాధాకర విషయాన్ని గుర్తు చేసుకోవడం నాకు తప్పనిసరి. కాశీలో నిర్వర్తించిన మా మొదటి వేదాంత శిబిరము 2018లో, 11–13 రోజులూ గురువులను నీడలా వెన్నంటి ఉండి, వారికి ఎంతో సేవచేస్తూ, మా సత్సంగ్ సభ్యులకు చేదోడువాదోడుగా ఉంటూ, ఏ పనిలో చూసినా తానే ఉండి, అందరికీ చక్కని సహాయ సహకారాలను అందించి, ఆనంద ఆప్యాయతలను పంచిన శ్రీమతి కొట్టం భవాని గారు అక్టోబరు 4, 2020న విదేహముక్తి పొందారు. అటువంటి భవానిగారు మన మధ్య నేడు లేకపోవడం ఎంతో దుఃఖదాయకం. వారి సేవలను ఎల్లప్పుడూ మన సత్సంగం గుర్తు చేసుకుంటూనే ఉంటుంది.

మీ ఆత్మీయ దయా సత్సంగ్ సభ్యులు

**డా. కొండూరు రాఘవరాజు**

# దృగ్దృశ్య వివేకము - శ్లోకాలు

రూపం దృశ్యం లోచనం దృక్ తద్దృశ్యం దృక్తు మానసమ్।
దృశ్యా ధీ వృత్తయః సాక్షీ దృగేవ నతు దృశ్యతే॥ 1

నీలపీతస్థూలసూక్ష్మ హ్రస్వదీర్ఘాది భేదతః।
నానావిధాని రూపాణి పశ్యేల్లోచనమేకధా॥ 2

ఆన్ధ్యమాన్ద్య పటుత్వేషు నేత్రధర్మేషు చైకధా।
సఙ్కల్పయేన్మనః శ్రోత్రత్వగాదౌ యోజ్యతామిదమ్॥ 3

కామః సఙ్కల్పసన్దేహౌ శ్రద్ధాఽశ్రద్ధే ధృతీతరే
హ్రీర్ధీర్భీరిత్యేవమాదీన్ భాసయత్యేకధా చితిః 4

నోదేతి నాస్తమేత్యేషా న వృద్ధిం యాతి న క్షయమ్।
స్వయం విభాత్యథాన్యాని భాసయేత్సాధనం వినా॥ 5

చిచ్ఛాయాఽఽవేశతో బుద్ధౌ భానం ధీస్తు ద్విధా స్థితా।
ఏకాహఙ్కృతిరన్యా స్యాదన్తఃకరణరూపిణీ॥ 6

ఛాయాఽహఙ్కారయోరైక్యం తప్తాయఃపిణ్డవన్మతమ్।
తదహఙ్కారతాదాత్మ్యాద్దేహశ్చేతనతామగాత్॥ 7

అహఙ్కారస్య తాదాత్మ్యం చిచ్ఛాయాదేహసాక్షిభిః।
సహజం కర్మజం భ్రాన్తిజన్యం చ త్రివిధం క్రమాత్॥ 8

సమ్బన్ధినోః సతోర్నాస్తి నివృత్తిః సహజస్య తు।
కర్మక్షయాత్ ప్రబోధాచ్చ నివర్తేతే క్రమాదుభే॥ 9

అహఙ్కారలయే సుప్తౌ భవేద్దేహోఽప్యచేతనః।
అహఙ్కారవికాసార్ధః స్వప్నః సర్వస్తు జాగరః॥ 10

అన్తఃకరణవృత్తిశ్చ చితిచ్ఛాయైక్యమాగతా।
వాసనాః కల్పయేత్ స్వప్నే బోధేఽక్షైర్విషయాన్ బహిః॥ 11

మనోఽహఙ్కృత్యుపాదానం లిఙ్గమేకం జడాత్మకమ్।
అవస్థాత్రయమన్వేతి జాయతే మ్రియతే తథా॥ 12

శక్తి ద్వయం హి మాయాయా విక్షేపావృతిరూపకమ్।
విక్షేపశక్తిర్లిఙ్గాది బ్రహ్మాణ్డాన్తం జగత్ సృజేత్॥ 13

సృష్టిర్నామ బ్రహ్మరూపే సచ్చిదానన్దవస్తుని।
అబ్ధౌ ఫేనాదివత్ సర్వనామరూపప్రసారణా॥ 14

అన్తర్దృగ్దృశ్యయోర్భేదం బహిశ్చ బ్రహ్మసర్గయోః।
ఆవృణోత్యపరా శక్తిః సా సంసారస్య కారణమ్॥ 15

సాక్షిణః పురతో భాతి లిఙ్గం దేహేన సంయుతమ్।
చితిచ్ఛాయా సమావేశాజ్జీవః స్యాద్వ్యావహారికః॥ 16

అస్య జీవత్వమారోపాత్ సాక్షిణ్యప్యవభాసతే।
ఆవృతౌ తు వినష్టాయాం భేదే భాతేఽపయాతి తత్॥ 17

తథా సర్గబ్రహ్మణోశ్చ భేదమావృత్య తిష్ఠతి।
యా శక్తిస్తద్వశాద్బ్రహ్మ వికృతత్వేన భాసతే॥ 18

అత్రాప్యావృతినాశేన విభాతి బ్రహ్మసర్గయోః।
భేదస్తయోర్వికారః స్యాత్ సర్గే న బ్రహ్మణి క్వచిత్॥ 19

అస్తి భాతి ప్రియం రూపం నామ చేత్యంశపఞ్చకమ్।
ఆద్యత్రయం బ్రహ్మరూపం జగద్రూపం తతో ద్వయమ్॥ 20

ఖవాయ్వగ్నిజలోర్వీషు దేవతిర్యఙ్నరాదిషు।
అభిన్నాః సచ్చిదానన్దాః భిద్యేతే రూపనామనీ॥ 21

ఉపేక్ష్య నామరూపే ద్వే సచ్చిదానన్దతత్పరః।
సమాధిం సర్వదా కుర్యాద్-హృదయే వాఽథవా బహిః॥ 22

సవికల్పో నిర్వికల్పః సమాధిర్ద్వివిధో హృది।
దృశ్యశబ్దానువేధేన సవికల్పః పునర్ద్విధా॥ 23

కామాద్యాశ్చిత్తగా దృశ్యాస్తత్సాక్షిత్వేన చేతనమ్।
ధ్యాయేద్దృశ్యానువిద్ధోఽయం సమాధిః సవికల్పకః॥ 24

అసఙ్గః సచ్చిదానన్దః స్వప్రభో ద్వైతవర్జితః।
అస్మీతి శబ్దవిద్ధోఽయం సమాధిః సవికల్పకః॥ 25

స్వానుభూతిరసావేశాద్దృశ్యశబ్దావుపేక్ష్య తు।
నిర్వికల్పః సమాధిః స్యాన్నివాతస్థితదీపవత్॥ 26

హృదీవ బాహ్యదేశేఽపి యస్మిన్ కస్మింశ్చ వస్తుని।
సమాధిరాద్యః సన్మాత్రాన్నామరూపపృథక్కృతిః॥ 27

అఖణ్డైకరసం వస్తు సచ్చిదానన్ద లక్షణమ్।
ఇత్య విచ్ఛిన్నచిన్తేయం సమాధిర్మధ్యమో భవేత్॥ 28

స్తబ్ధీభావో రసాస్వాదాత్తృతీయః పూర్వవన్మతః।
ఏతైః సమాధిభిః షడ్భిర్నయేత్ కాలం నిరన్తరమ్॥ 29

దేహాభిమానే గలితే విజ్ఞాతే పరమాత్మని।
యత్ర యత్ర మనో యాతి తత్ర తత్ర సమాధయః॥ 30

భిద్యతే హృదయగ్రన్థిశ్ఛిద్యన్తే సర్వ సంశయాః।
క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే॥ 31

అవచ్ఛిన్నశ్చిదాభాసస్తృతీయః స్వప్నకల్పితః।
విజ్ఞేయస్త్రివిధో జీవస్తత్రాద్యః పారమార్థికః॥ 32

అవచ్ఛేదః కల్పితః స్యాదవచ్ఛేద్యం తు వాస్తవమ్।
తస్మిన్ జీవత్వమారోపాద్బ్రహ్మత్వం తు స్వభావతః॥ 33

అవచ్ఛిన్నస్య జీవస్య పూర్ణేన బ్రహ్మణైకతామ్।
తత్త్వమస్యాదివాక్యాని జగుర్నేతరజీవయోః॥ 34

బ్రహ్మణ్యవస్థితా మాయా విక్షేపావృతిరూపిణీ।
ఆవృత్యాఖణ్డతాం తస్మిన్ జగజ్జీవౌ ప్రకల్పయేత్॥ 35

జీవో ధీస్థచిదాభాసో భవేద్భోక్తా హి కర్మకృత్।
భోగ్యరూపమిదం సర్వం జగత్ స్యాద్భూతభౌతికమ్॥ 36

అనాదికాలమారభ్య మోక్షాత్ పూర్వమిదం ద్వయమ్।
వ్యవహారే స్థితం తస్మాదుభయం వ్యావహారికమ్॥ 37

చిదాభాసస్థితా నిద్రా విక్షేపావృతిరూపిణీ।
ఆవృత్య జీవజగతీ పూర్వే నూత్నే తు కల్పయేత్॥ 38

ప్రతితికాల ఏవైతె స్థితత్వాత ప్రాతిభాసికె।
న హి స్వప్నప్రబుద్ధస్య పునః స్వప్నే స్థితిస్తయోః॥ 39

ప్రాతిభాసికజీవో యస్తజ్జగత్ ప్రాతిభాసికమ్।
వాస్తవం మన్యతేఽన్యస్తు మిథ్యేతి వ్యావహారికః॥ 40

వ్యావహారికజీవో యస్తజ్జగద్వ్యావహారికమ్।
సత్యం ప్రత్యేతి మిథ్యేతి మన్యతే పారమార్థికః॥ 41

పారమార్థికజీవస్తు బ్రహ్మైక్యం పారమార్థికమ్।
ప్రత్యేతి వీక్షతే నాన్యద్వీక్షతే త్వనృతాత్మనా॥ 42

మాధుర్యద్రవశైత్యాని నీరధర్మాస్తరఙ్గకే।
అనుగమ్యాథ తన్నిష్ఠే ఫేనేఽప్యనుగతా యథా॥ 43

సాక్షిస్థాః సచ్చిదానన్దాః సమ్బన్ధాద్వ్యావహారికే।
తద్ద్వారేణానుగచ్ఛన్తి తథైవ ప్రాతిభాసికే॥ 44

లయే ఫేనస్య తద్ధర్మా ద్రవాద్యాః స్యుస్తరఙ్గకే।
తస్యాపి నిలయే నీరే తిష్ఠన్త్యేతే యథా పురా॥ 45

ప్రాతిభాసికజీవస్య లయే స్యుర్వ్యావహారికే।
తల్లయే సచ్చిదానన్దాః పర్యవస్యన్తి సాక్షిణి॥ 46

***

# శ్రీగణపతి ప్రార్థన

ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే
కవిం కవీనాముపమశ్రవస్తమమ్।
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆ నః
శృణ్వన్నూతిభిస్సీద సాదనమ్॥

ప్రణో దేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ।
ధీనామవిత్ర్యవతు। గణేశాయనమః।
సరస్వత్యైనమః। శ్రీ గురుభ్యోనమః।
హరిః ఓమ్॥

ఓం శాంతిః శాంతిః శాంతిః॥

# దృగ్దృశ్య వివేకము

## ఉపోద్ఘాతము

ఆత్మజ్ఞానం పొందటానికి మనకు మూడు ప్రాథమిక గ్రంథాలు ఉన్నాయి. వాటిని ప్రస్థానత్రయం అంటారు. ప్రస్థానం అంటే పద్ధతి, త్రయం అంటే మూడు. అందుకని ప్రస్థానత్రయం అంటే ఆత్మస్వరూపాన్ని వివరించే మూడు పద్ధతులు.

**1. శ్రుతిప్రస్థానం** – శ్రుతి అంటే వేదాలు. ఆత్మ గురించి బోధించేది వేద అంతభాగం. దాన్ని వేదాంతం అనీ, ఉపనిషత్తు అనీ అంటారు. ఇది అపౌరుషేయం. ఋషులు దర్శించటంవల్ల వచ్చింది. సాక్షాత్తూ పరమాత్మనుంచి వచ్చింది.

**2. స్మృతిప్రస్థానం** – స్మృతి అంటే శ్రుతినుంచి సంగ్రహించబడ్డ సారం. స్మృతి స్వంతంగా విషయం చెప్పదు. కాని వేదాలనుంచి గ్రహించిన సారాన్ని తన పద్ధతిలో చెపుతుంది. భగవద్గీత స్మృతి ప్రస్థానం కిందకి వస్తుంది. ప్రతి అధ్యాయం చివర ఉపనిషత్సు అని వస్తుంది. అంటే ఉపనిషత్తులసారం అని అర్థం. ఇందులో వేదాంతబోధ తేలిగ్గా అర్థమయ్యేలాగా ఉండటమే కాక, కర్మయోగం, ఉపాసనయోగాల గురించి కూడా వస్తుంది.

**3. న్యాయప్రస్థానం** – ఇందులో వేదాంతబోధకు తర్కం జోడించ బడుతుంది. శ్రుతి, స్మృతులు ఋషులు దర్శించిన జ్ఞానంమీద ఆధారపడి ఉంటే, న్యాయప్రస్థానం వారు చేసిన బోధను తార్కికంగా నిరూపిస్తుంది. బ్రహ్మసూత్రాలు న్యాయప్రస్థానం కిందకి వస్తుంది. స్మృతి ప్రస్థానం, న్యాయప్రస్థానం రెండూ కూడా వ్యాసాచార్యులు రచించారు.

ఇవి చాలా పెద్దవిగా ఉండటంవల్ల, అందరికీ అందుబాటులో ఉండకపోవటంవల్ల, కొందరు ఆచార్యులు ప్రస్థానత్రయాన్ని కుదించి టూకీగా, అందరికీ తేలికగా అర్థమయ్యేలాగా కొన్ని గ్రంథాలు వ్రాసారు. వాటిని ప్రకరణ గ్రంథాలు అంటారు. ఈ ప్రకరణ గ్రంథాలు రెండు రకాలు. అవి –

1. మొదటి రకం ప్రకరణ గ్రంథాలలో వేదాంతబోధలో వచ్చే అన్ని అంశాల గురించీ వస్తాయి. ప్రస్థానత్రయం ఆరు అంశాలను చర్చిస్తుంది. అవి

| | | | |
|---|---|---|---|
| ఎ) | జీవుడు | – | వ్యక్తి |
| బి) | జగత్తు | – | ప్రపంచం |
| సి) | ఈశ్వరుడు | – | పరమాత్మ |
| డి) | బంధం | – | బంధకారణం |
| ఇ) | మోక్షం | – | విముక్తి |
| ఎఫ్) | సాధన | – | జీవుడు బంధంనుంచి మోక్షానికి ప్రయాణం చేసే మార్గం. |

ఇందులో మొట్టమొదటిది తత్త్వబోధ. ఇవికాక వివేకచూడామణి, వేదాంత సారం, సర్వవేదాంత సిద్ధాంత సారసంగ్రహం మరికొన్ని ఉదాహరణలు.

2. రెండో రకం ప్రకరణ గ్రంథాలు ఈ ఆరు అంశాలనూ వివరించవు. ఒక ప్రకరణ గ్రంథం ఏదో ఒక అంశమే తీసుకుని దాన్ని కూలంకషంగా చర్చిస్తుంది.

ఒక గ్రంథం జీవుని గురించే విశ్లేషిస్తుంది. ఇంకో గ్రంథం మహావాక్య విచారణ మాత్రమే చేస్తుంది. కర్మయోగం, ఉపాసనాయోగాల గురించి మాట్లాడదు.

రెండు రకాల ప్రకరణ గ్రంథాలూ ముఖ్యమే. విద్యార్థి ఆరంభదశలో ఉన్నప్పుడు, మొదటి రకం ప్రకరణ గ్రంథం చదివితే ముందుగా వేదాంతసారం మీద ఒక విహంగవీక్షణం ఏర్పడుతుంది. కాని విషయం కొత్తది కాబట్టి అనేక సందేహాలు కూడా కలుగుతాయి. అలాంటప్పుడు రెండో రకం ప్రకరణ గ్రంథాలు తోడ్పడతాయి. అందువల్ల రెండు రకాలూ మనకి ఉపయోగకరమైనవే.

ఇప్పుడు మనం చూడబోయే **దృగ్దృశ్య వివేకము,** రెండో రకం ప్రకరణ గ్రంథంలోకి వస్తుంది. ఇది వేదాంత సారంలోని మొదటి అంశాన్ని లోతుగా విశ్లేషిస్తుంది. జీవ విచారణ మాత్రమే చేస్తుంది. ఈశ్వరుని గురించీ, జగత్తు గురించి అంతగా చెప్పదు. జీవుని బంధం గురించి, అతని మోక్షం గురించి, దానికి చేయాల్సిన సాధన గురించే చెపుతుంది.

ఇది చిన్న ప్రకరణ గ్రంథం. ఇందులో 46 శ్లోకాలు మాత్రమే ఉన్నాయి. ఈ గ్రంథం రచించినదెవరో స్పష్టంగా తెలియదు. కొంతమంది ఆదిశంకరాచార్యులు వ్రాసారు అంటే, మరికొంత మంది విద్యారణ్యులవారు రచించారు అంటారు.

# దృగ్దృశ్య వివేకము

దృక్ అంటే అస్మత్ ప్రత్యయ గోచరం, దృశ్యం అంటే యుష్మత్ ప్రత్యయ గోచరం. అస్మత్ అంటే నేను, సబ్జెక్ట్; యుష్మత్ అంటే ఇది (జగత్తు), ఆబ్జెక్ట్; నేను వేసుకున్న బట్టలనుంచి బాహ్యవస్తువు అవుతుంది. వస్తువులన్నీ అనాత్మ. అనాత్మ అంటే న ఆత్మ. ఆత్మ కానిది. దృక్కుకూ, దృశ్యానికీ మధ్య బంధం ఉంటుంది. దృక్ అంటే ఒక్క చూపునే తీసుకోకూడదు. ఐదు ఇంద్రియాల శక్తీ వస్తుంది ఇందులో. జగత్తును మన ఇంద్రియాలు ఐదుగా విభజించి మనకు అనుభవాలను అందజేస్తాయి. అవి రూపం, రసం, గంధం, శబ్దం, స్పర్శ. అందువల్ల చూసే నేను – చూడబడే వస్తువు; వినే నేను – వినబడే వస్తువు – అలా అన్నీ తీసుకోవాలి.

దృక్ – దృశ్య బంధం ఉంది బాగానే ఉంది. వివేకం పదం ఎందుకు? ఒక మందారపువ్వును చూస్తే అది మందారపువ్వుగానే తెలుస్తుంది. అందులో వివేకం ప్రదర్శించాల్సింది ఏముంది? అంతగా కావాలంటే దాని గురించి విచారణ చేయవచ్చు. మందారాన్ని జపాకుసుమం అంటారు. దానివల్ల లాభాలేమిటో తెలుసుకోవాలంటే విచారణ చేయాలి.

వివేకం ప్రసక్తి ఎప్పుడొస్తుందంటే ఒకదాన్ని చూసి ఇంకొకటిగా పొరబడినప్పుడు వస్తుంది. మందారపువ్వును చూసి గుమ్మడికాయ అనుకుంటే వస్తుంది. ఈ అయోమయం పువ్వు విషయంలో రాదు కాని కార్యకరణ సంఘాత విషయంలో వస్తుంది. దీన్ని ఇంగ్లీషులో బాడీ మైండ్ సెన్స్ కాంప్లెక్స్ అంటారు. దీని విషయంలో అయోమయం ఉంది. శరీరం పంచభూతాలతో చేయబడింది. ఈ పాంచ భౌతికశరీరం నేను అనుకుంటున్నాము; మనసు నేను అనుకుంటున్నాము; వాటితో తాదాత్మ్యం చెందుతున్నాము. ఈ పొరపాటును అవివేకం అనీ, మోహం అనీ, అధ్యాస అనీ అంటారు.

ఎన్నో విషయల్లో ఇలా ఒకదానికొకటి పొరబడటం జరుగుతూ ఉంటుంది. అలాంటప్పుడు, ఒక్క ఈ విషయంలోనే ఎందుకు వివేకం చూపాలి? ఎందుకంటే, తక్కిన అయోమయాలు మనను అంతగా బాధించవు, కాని ఈ అయోమయం

మనను సంసారంలో పడేస్తుంది. మనం మోక్షం పొందాలంటే ఈ అయోమయాన్ని పారద్రోలాలి. అందుకే దృక్‌దృశ్య వివేకం చాలా ముఖ్యమైన ప్రకరణ గ్రంథం అయింది. చూసే నేను ఎవరు? చూడబడే వస్తువు ఏది? ఈ విషయాల్లో వివేకం నేర్పిస్తుంది ఇది.

ఈ గ్రంథంలో జీవాత్మ లేదా త్వం పదార్థం గురించి వివరణే ఎక్కువగా వస్తుంది. ఈశ్వరుడు లేదా తత్ పదార్థ విచారణ అంతగా లేదు అని చూశాము. జీవాత్మలో ఉన్న అనేక అంశాలు లేదా కోశాలు ఏమిటి? తత్త్వబోధ, వివేకచూడామణిలాంటి ప్రకరణగ్రంథాలు జీవాత్మను శరీరత్రయంగానూ, పంచకోశాలుగానూ విభజించాయి.

స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం– శరీరత్రయం.

అన్నమయకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం,

విజ్ఞానమయకోశం, ఆనందమయకోశం – పంచకోశాలు

ఇప్పుడు, ఇందులో నాలుగు భాగాలుగా చూస్తాము.

శరీరం, ఇంద్రియాలు, మనస్సు, ఆత్మ.

ఇంకోవిధంగా చెప్పాలంటే దేహేంద్రియ మనోబుద్ధులు + ఆత్మ.

ఈ నాలుగింటిలో మూడు అంటే శరీరం, ఇంద్రియాలు, మనస్సు పంచభూతాలతో చేయబడ్డాయి. అందువల్ల అవి స్వతహాగా జడం. ఒక బల్ల, కుర్చీలు ఎలా జడమో, దేహేంద్రియ మనోబుద్ధులు కూడా జడమే. కాని అవి స్వతహాగా జడమైనా కూడా, వాటిలో చైతన్యం ఉన్నట్టుగా ప్రవర్తిస్తాయి. బాహ్యంగా ఉన్న వేడిని, చల్లదనాన్ని శరీరం అనుభవించగలుగుతోంది. కాని బల్ల అనుభవించలేదు. అలాగే ఇంద్రియాలు కూడా శబ్ద, స్పర్శ, రూప, రస గంధాలను గ్రహించగలుగు తున్నాయి. మనసు రాగద్వేషాలకు లోనవుతోంది. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను అనుభవించ గలుగుతోంది.

ఈ మూడూ స్వతహాగా జడమయి ఉండి కూడా చైతన్యాన్ని ప్రదర్శించగలుగుతున్నాయంటే దానికి కారణం, అవి ఎక్కడ్నుంచో చైతన్యాన్ని అరువు తెచ్చుకుంటున్నాయన్నమాట. ఒక జడమైన ఫ్యాను తిరుగుతోందంటే,

దాని వెనుక కనబడని కారణమేదో ఉందన్నమాట. దాన్నే విద్యుచ్ఛక్తి అంటాము. అలాగే జడాలైన శరీరం, ఇంద్రియాలు, మనస్సు వ్యవహారాలు నడిపిస్తున్నాయంటే, వాటి వెనుక కనబడని కారణమేదో ఉందన్నమాట.

**1. మూడు రకాల దృక్కులు - 1-5**

**కేనేషితం పతతి ప్రేషితం మనః - కేన**

మనస్సును, ప్రాణాన్ని, వాక్కును ఎవరు నడిపిస్తున్నారు? కన్ను, చెవులు వెనుక ఉన్న చైతన్యం ఏమిటి?

ఈ ప్రశ్నకు జవాబుతో మొదలుపెడుతున్నారు రచయిత, ఈ ప్రకరణ గ్రంథంలో. ఉపనిషత్తుల్లో చర్చించే ఆరు అంశాలలో అన్నింటినీ కాని, ఏదో ఒక అంశాన్ని కాని ప్రకరణ గ్రంథాలు చర్చిస్తాయని చూశాము. ఇక్కడ జీవాత్మ గురించి చర్చించబోతోందని కూడా చూశాము. జీవాత్మను సాక్షి లేదా చిత్ అని వ్యవహరిస్తున్నారు రచయిత. ఓం ప్రథమంగా సాక్షిచైతన్యం గురించిన ప్రస్తావన వచ్చింది కాబట్టి, రచయిత మళ్ళీ విడిగా ప్రార్థన శ్లోకం జోడించలేదు. ఏ గ్రంథమైనా పరమాత్మకు ప్రార్థనతో మొదలవుతుంది. ఇక్కడ సాక్షిచైతన్యం గొప్పదనాన్ని ప్రస్తావించటంలోనే ప్రార్థన చేయకనే చేసినట్టయింది. **దృగేవ న తు దృశ్యతే**

సాక్షిచైతన్యం జ్యోతులకు జ్యోతి – జ్యోతి అంటే ప్రకాశించేది. సాక్షిచైతన్యం జ్యోతులకే జ్యోతి.

**జ్యోతిషామపి తజ్జ్యోతిః తమసః పరముచ్యతే గీత 13-17**

సూర్యుడు ఒక స్వయం ప్రకాశక జ్యోతి. అన్నింటినీ ప్రకాశింపజేస్తాడు. తనను తాను ప్రకాశింపజేసుకుంటాడు. అందువల్ల సూర్యుడు ఒక జ్యోతి. కాని అంత స్వయం ప్రకాశకజ్యోతి కూడా గుడ్డివానికి తెలియదు. కాబట్టి కన్ను ఒక జ్యోతి. కన్ను దేన్నైనా చూడాలంటే, మనస్సు దాని వెనుక ఉండాలి. లేకపోతే దాన్ని సరిగ్గా చూడము. అంటే మనస్సు ఒక జ్యోతి. కాని మనస్సులో ఆలోచనలు ఉన్నా, లేకపోయినా ఆ విషయం తెలిపేది ఇంకోటి ఉంది. ఏమిటది? అది ఆత్మజ్యోతి, సాక్షిచైతన్యజ్యోతి. ఇది దేనివల్ల ప్రకాశిస్తోంది? ఇదే జ్యోతి – ఇది స్వయం ప్రకాశక జ్యోతి. ఇది తనంతట తాను ప్రకాశిస్తూ, తక్కిన వాటిని

ప్రకాశింపచేస్తుంది. అందుకే ఇది **జ్యోతిషాం జ్యోతి** అయింది.

ఇప్పుడు వెనుకనుంచీ ముందుకు వెళితే సాక్షి మనస్సును ప్రకాశింపజేస్తే, మనస్సు ఇంద్రియాలను ప్రకాశింపజేస్తే, ఇంద్రియాలు శరీరాన్నీ, బాహ్యంగా ఉన్న జగత్తునీ ప్రకాశింపజేస్తాయి. అంటే మనలో చూసే అంశాలు మూడు ఉంటాయి.

**బాహ్యప్రపంచం దృశ్యం, కన్ను దృక్ - దృక్ 1**
**కన్ను దృశ్యం, మనస్సు దృక్ - దృక్ 2**
**మనస్సు దృశ్యం, సాక్షి దృక్ - దృక్ 3**

ఈ విధంగా సాక్షి, ప్రపంచాన్ని ఒక వరుసక్రమంలో ప్రకాశింపజేస్తుంది. స్వప్నావస్థలో ఇంద్రియాలు పనిచేయనప్పుడూ, సుషుప్తిలో మనస్సు, ఇంద్రియాలు పనిచేయనప్పుడూ బాహ్యప్రపంచం తెలియదు. ఆత్మ వీటిద్వారా బాహ్యప్రపంచాన్ని ప్రకాశింపజేస్తుంది, కాని ప్రత్యక్షంగా చేయదు.

మధ్యస్థాయిలో ఉన్న దృశ్యాలను తీసుకుంటే, వాటికి రెండు హెూదాలు ఉంటాయి. నిండు పున్నమి రాత్రి పండు వెన్నెల కురిపిస్తున్న చంద్రుడు దృశ్యమా, దృక్కా? రెండూ. సూర్యుని కాంతి చంద్రునిమీద పడితే, చంద్రుడు భూమాతకు తన చల్లని వెన్నెలను పంచుతున్నాడు.

సూర్యునిపరంగా చూస్తే, సూర్యుడు దృక్, చంద్రుడు దృశ్యం.

అదే చంద్రునిపరంగా చూస్తే, చంద్రుడు దృక్, భూమి దృశ్యం.

సూర్యుని కాంతికీ, చంద్రుని కాంతికీ ఏమిటి భేదం? చంద్రుడు తనంతట తాను ప్రకాశించటం లేదు, సూర్యునివల్ల తన ప్రకాశాన్ని కురిపిస్తున్నాడు. అందుకని చంద్రుని కాంతి సాపేక్షిక కాంతి – అదే సూర్యుని విషయానికొస్తే సూర్యుడిని ఎవరూ ప్రకాశింపజేయటం లేదు. తనంతట తాను ప్రకాశిస్తున్నాడు. (ఈ ఉదాహరణ ఇంతవరకే తీసుకోవాలి. ఇందాక చూసిన జ్యోతిషాం జ్యోతికి వెళ్ళకూడదు). అందువల్ల సూర్యుడు ఆత్యంతిక జ్యోతి.

దీన్ని మన శరీరానికి వర్తింపజేస్తే కన్ను, మనస్సు చంద్రునిలాంటివి. అంటే కన్నుకు రెండు హెూదాలు ఉన్నాయి.

కన్నుపరంగా చూస్తే, కన్ను దృక్, ప్రపంచం దృశ్యం.

అదే మనస్సుపరంగా చూస్తే కన్ను దృశ్యం, మనస్సు దృక్.

అలాగే మనస్సుకు కూడా రెండు హోదాలు ఉన్నాయి.

మనస్సుపరంగా చూస్తే మనస్సు దృక్, కన్ను దృశ్యం.

అదే సాక్షిపరంగా చూస్తే మనస్సు దృశ్యం, సాక్షి దృక్.

అందువల్ల కన్ను, మనస్సులు సాపేక్షిక దృక్కులు అయితే, సాక్షిచైతన్యం ఆత్యంతిక దృక్.

ప్రతి వ్యక్తిలోనూ సాపేక్షిక దృక్కులు, ఆత్యంతిక దృక్ ఉంటాయి. తర్వాత సాపేక్షిక దృక్కులను అహంకారం అంటారు రచయిత. అప్పటిదాకా వాటిని సాపేక్షిక దృక్కులనే వ్యవహరిద్దాము. మొదటి ఐదు శ్లోకాల్లో ఈ దృక్‌ల గురించిన వివరణ వస్తుంది. తర్వాత సాపేక్షిక, ఆత్యంతిక దృక్కుల మధ్య అయోమయమే మనను సంసారంలో పడేస్తోందనీ, వీటిని విడదీసి చూడగలగటం నేర్చుకోవాలనీ చూపిస్తారు.

## శ్లోకం - 1

**రూపం దృశ్యం లోచనం దృక్ తద్దృశ్యం దృక్తు మానసమ్।**
**దృశ్యా ధీ వృత్తయః సాక్షీ దృగేవ నతు దృశ్యతే॥**

**రూపం దృశ్యం లోచనం దృక్ –** బాహ్యప్రపంచంలో కనబడే అనేక రూపాలు, మన శరీరంతో సహా, కంటికి కనబడే వస్తువులు. లోచనం అంటే కన్ను.

**జగత్తు దృశ్యం, కన్ను దృక్ - దృక్ – 1**

**తద్దృశ్యం దృక్తు మానసమ్ –** కన్ను కూడా అనుభవంలోకి వచ్చే వస్తువు. కన్ను ఎలా పని చేస్తోందో, మనసుకు తెలుస్తుంది. కన్ను మూసుకుంటే, కన్ను మూసుకుందని మనస్సుకు తెలుస్తుంది. అంతేకాదు, కన్ను మూసుకున్నా కూడా మనస్సు వస్తువులను ఊహించుకోగలదు, వాటి ఊహాచిత్రాన్ని నిర్మించగలదు. ఆ విధంగా కన్నుకు రెండు హోదాలు ఉన్నాయి. ఒకవైపు అది దృక్, ఇంకోవైపు అది దృశ్యం.

**కన్ను దృశ్యం, మనస్సు దృక్ - దృక్ – 2**

కన్ను అంటే కన్నునొక్కదాన్నే తీసుకోకూడదు. ఇది ఐదు ఇంద్రియాలకూ వర్తిస్తుంది. ఉదాహరణకు శబ్దం దృశ్యం, చెవి దృక్, రెండు కళ్ళు ఉన్నా ఒకటిగా చూస్తాయి కాబట్టి లోచనం అని ఏకవచనం వాడబడింది.

**దృశ్యా ధీ వృత్తయః –** మనస్సు కూడా సాపేక్షిక దృక్ అవుతుంది. మనస్సులో లేచే అనేక ఆలోచనలు (వృత్తులు) – అనుమానం, బెంగ, రాగద్వేషాలు– మనకు తెలుస్తున్నాయి, అందువల్ల అవి కూడా అనుభవంలోకి వచ్చే వస్తువులు అవుతున్నాయి. మనస్సు పరిస్థితి మనకు అత్యంత సమీపంగా తెలుసు. మనస్సులో రేగే ఆలోచనలు తెలియకపోతే, వాటిని మాటల రూపంలో ప్రకటించలేము. ఒక విషయం అర్థం అవుతున్నా, అర్థం అవకపోయినా తెలుస్తోంది. అందువల్ల మనసులో లేచే వృత్తులు దృశ్యాలు. మరి దృక్ ఎవరు?

**సాక్షీ (దృక్) –** బింబచైతన్యం. మనసులో రేగే ఆలోచనలను సాక్షిగా చూస్తోంది కాబట్టీ, వాటిని ప్రకాశింపజేస్తోంది కాబట్టి దాన్ని సాక్షిచైతన్యం అంటారు.

**మనస్సు దృశ్యం – సాక్షి దృక్ – దృక్ – 3**

**దృగేవ న తు దృశ్యతే –** సాక్షిని దృశ్యంగా చూసే దృక్ ఎవరు? ఎవరూ లేరు. సాక్షి చైతన్యం స్వయం ప్రకాశక జ్యోతి. అది అనుభవంలోకి రాదు. కంటితో చూడబడదు.

**ఎవర్ ది ఎక్స్‌పీరియెన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియెన్స్‌డ్**

**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

అందుకని సాక్షిని బాహ్యవస్తువుగా చూడటానికి ప్రయత్నించకండి. ఈ శ్లోకాన్ని **సంక్షేపశ్లోకం** లేదా **ప్రతిజ్ఞాశ్లోకం** అంటారు. ఇందులో మూడు దృక్కులను చూశాము. కన్ను, మనస్సు, సాక్షి. మొదటి రెండూ సాపేక్షిక దృక్కులయితే సాక్షి ఆత్యంతిక దృక్. ఈ వివరణ చాలదనుకున్నారు రచయిత. అందుకని ఈ శ్లోకంలో నాలుగు భాగాలను, రాబోయే నాలుగు శ్లోకాల్లో వివరించుకు వస్తున్నారు.

## శ్లోకం - 2

**నీలపీతస్థూలసూక్ష్మ హ్రస్వదీర్ఘాది భేదతః।**
**నానావిధాని రూపాణి పశ్యేల్లోచనమేకధా॥**

ముందు శ్లోకంలో పరిచయం చేసిన మూడు దృక్కులలో మొదటి దృక్ గురించిన వివరణ ఈ శ్లోకం. **రూపం దృశ్యం, లోచనం దృక్‌**కి వివరణ.

**జగత్తు దృశ్యం, కన్ను దృక్ - దృక్ 1**

జగత్తు లోని రూపం, రంగులను కన్ను చూస్తుంది; శబ్దాన్ని చెవి వింటుంది. అలా ఒక్కొక్క ఇంద్రియం ఒక్కొక్క అంశాన్ని చూపిస్తుంది; దీని పేరు **దృగ్ధ ృశ్యవివేకము** కాబట్టి కన్ను గురించే చర్చ వస్తోంది. చూసే రూపాలు, రంగులు అనేకం ఉన్నా, వాటిని చూసే కన్ను ఒకటే. కన్నును, తక్కిన ఇంద్రియాలకు ఉపలక్షణంగా తీసుకోవాలి. ఉపలక్షణం అంటే ఒకటి చెప్పి తక్కినవి వదిలేసినా, అన్నింటినీ గురించి చెప్పినట్టుగా తీసుకోవటం.

**నీలపీత -** నీలం రంగు; పసుపురంగులు. నీలాంబరం, పీతాంబరం అనే పదాలు తరచూ వింటుంటాము. ఈ రెండు రంగులనూ తక్కిన రంగులకు ఉపలక్షణంగా తీసుకోవాలి. నీలం రంగును ఒక జతకళ్ళతోనూ, పసుపురంగును ఇంకో జత కళ్ళతోనూ చూడము.

**స్థూలసూక్ష్మ హ్రస్వదీర్ఘాది భేదతః -** రూపాల్లో ఉన్న భేదం, స్థూల, సూక్ష్మ అంటే అతి పెద్ద వస్తువు, అతి చిన్న వస్తువు. ఇక్కడ సూక్ష్మం అంటే సూక్ష్మశరీరాన్ని తీసుకోకూడదు. సూక్ష్మమైన వస్తువు అని తీసుకోవాలి. అలాగే హ్రస్వదీర్ఘాది అంటే పొట్టి వస్తువులు, పొడుగు వస్తువులు.

**నానావిధాని రూపాణి-** అందుకే రూపం, రంగు అనేకం ఉన్నాయి. ఒక్క గులాబీ పువ్వునే తీసుకుంటే అందులోనే ఎన్నో రంగులు, రూపాలు ఉన్నాయి. అతి పెద్ద గులాబీనుంచి, అతి చిన్న గులాబీ (బటన్ రోజ్ అంటారు) వరకూ ఉన్నాయి. అలాగే తెల్లరంగు నుంచీ, నల్లరంగు దాకా అనేక రంగులు ఉన్నాయి. అలాగే పక్షుల్లో ఎన్ని రకాలు ఉన్నాయో వర్ణించలేము. సృష్టిలో ఎన్నో

భేదాలు ఉన్నాయి. ఎంతో వైవిధ్యం ఉంది. కాని తమాషా ఏమిటంటే అంత భిన్నత్వాన్ని చూసే కన్ను ఒకటే. ఒక్కొక్క రకమైన దాన్ని చూడటానికి ఒక్కొక్క రకమైన కన్ను అవసరము లేదు.

**పశ్యేల్లోచనమేకధా–** అందుకే చూసే కన్ను ఒకటే. కన్ను ఏమీ మార్పు చెందకుండా, ఉన్నదున్నట్టుగా ఉంటూనే అనేక నామరూపాలను చూపిస్తుంది. రూపాలు వేరు, రంగులు వేరు అంటే దృశ్యం అనేకం, **దృక్ ఏకం.** ఈ విషయం బాగా గుర్తుంచుకోవాలి. ఎందుకంటే, ఇదే వాదన ముందు ముందు కొనసాగి, ఉన్న సాక్షిచైతన్యం ఒకటే, అది అద్వైత ఆత్మ అని నిరూపిస్తారు రచయిత. ఇక్కడే ఒక పునాది రాయి వేశారు.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్ – ఛాందోగ్యమ్**

సత్‌బ్రహ్మలో నానా విధాల రూపాలు, రంగులు లేవు. ఉన్నదొకటే చైతన్యం. దృక్ 3 దగ్గరకి వచ్చేసరికి అద్వైత ఆత్మ ఆత్యంతిక దృక్ అని నిరూపించాలి. రెండోది లేదు, ఉన్నదొకటే అని అర్థమయితేనే, దానికి దేశకాల వస్తుపరిమితులు లేవని తెలుస్తుంది.

**శ్లోకం –3**

**ఆన్ధ్యమాన్ద్య పటుత్వేషు నేత్రధర్మేషు చైకధా।**
**సఙ్కల్పయేన్మనః శ్రోత్రత్వగాదౌ యోజ్యతామిదమ్॥**

మొదటి శ్లోకంలో పరిచయం చేసిన మూడు దృక్కులలో రెండవ దృక్ గురించిన వివరణ ఈ శ్లోకం – **తద్దృశ్యం దృక్తు మానసమ్**కు వివరణ.

**కన్ను దృశ్యం, మనస్సు దృక్ – దృక్ 2**

ముందేమన్నాం? చూసే దృశ్యాలు అనేకం, చూసే కన్ను ఏకం అన్నాం. కన్ను ఆ వస్తువుకు తగ్గట్టుగా పెద్దదీ, చిన్నదీ అవదు. దృశ్యం అనేకం ఉన్నట్టుగా, కన్ను దృశ్యం అయినప్పుడు, కన్ను చూసే శక్తికి మూడు స్థాయిల్లో నాణ్యత ఉంది.

**ఆన్ధ్యమాన్ద్య పటుత్వేషు నేత్రధర్మేషు చైకధా –** బాగా సూదంటు రాయిలాగా చూడగలిగే శక్తి ఒకరికి ఉంటే, అసలు బొత్తిగా కనపడదు ఇంకొకరికి. మధ్యస్థాయిలో ఉంటుంది మరొకరికి. అన్ధ్య అంటే గుడ్డితనం– గుడ్డివాడు అసలేమీ చూడలేడు; పటుత్వం అంటే సూదంటు రాయిలా తీక్షణంగా చూడగలిగే శక్తి; మాన్ద్య అంటే చూపు సన్నగిల్లటం. కళ్ళజోడు పెట్టుకుంటే కనపడుతుంది. అది కూడా కొంతమందికి పవర్ చాలా ఎక్కువ ఉంటే, కొంతమందికి చాలా తక్కువ ఉంటుంది. అలా కంటికి మూడు లక్షణాలు ఉన్నాయి – పూర్తి అంధత్వం, పూర్తి పటుత్వం, మధ్యమస్థాయి.

**యోజ్యతామిదమ్ –** ఇదే వర్ణన తక్కిన ఇంద్రియాలకు కూడా అన్వయించుకోవాలి. తక్కిన ఇంద్రియాలు దృశ్యం, మనస్సు దృక్.

**శ్రోత్రత్వగాదౌ –** శ్రోత్రం, త్వగ్ ఆదౌ – చెవి, చర్మం వగైరా. ఉదాహరణకు చెవికి కూడా ఈ మూడు లక్షణాలూ ఉంటాయి. పూర్తి వినికిడి శక్తి, అసలేమీ వినబడకపోవటం, మధ్యమస్థాయి. అసలేమీ కనపడని వ్యక్తిని అంధుడు అంటే అసలేమీ వినబడని వాడిని బధిరుడు అంటారు.

**సఙ్కల్పయేన్మనః –** ఈ లక్షణాలన్నీ ఎవరికి తెలుస్తున్నాయి? మనస్సుకు. అందువల్ల మనస్సు దృక్, కన్ను దృశ్యం. మొదటి వివరణలో చెప్పినట్టే. కన్ను పనిచేయకపోయినా, మనసు పనిచేయటం మానదు. కంటి శక్తి తగ్గితే, మనస్సుకున్న పదును ఎంత మాత్రం తగ్గదు. కంటిచూపులో హెచ్చుతగ్గులు కన్నుకు వర్తిస్తాయి కాని మనస్సుకు కాదు.

**ఏకధా(పశ్యతి) –** అంతేకాదు కన్నుతో చూసే మనస్సు, హఠాత్తుగా చెవితో వినాల్సివచ్చినా అదేమీ మారదు. వినటానికొక మనస్సు, చూడటానికొక మనస్సు, మాట్లాడటానికొక మనస్సు అంటూ విడివిడిగా లేదు. అంటే ముందు శ్లోకంలో చెప్పిన సూత్రమే ఇక్కడా వర్తిస్తుంది. **దృశ్యం అనేకం, దృక్ ఏకం.**

**శ్లోకం –4**

**కామః సఙ్కల్పసన్దేహౌ శ్రద్ధాఽశ్రద్ధే ధృతీతరే**
**హ్రీర్ధీర్భీరిత్యేవమాదీన్ భాసయత్యేకధా చితిః**

మొదటి శ్లోకంలో పరిచయం చేసిన మూడు దృక్కులలో మూడవ దృక్ గురించిన వివరణ ఈ శ్లోకం – **దృశ్యాధీ వృత్తయః సాక్షీ దృగేవ న తు దృశ్యతే**కు వివరణ

**మనస్సు దృశ్యం, సాక్షి దృక్ – దృక్ 3**

ముందేమన్నాం? చూడబడే కన్నుకు లక్షణాలు అనేకం, చూసే మనస్సు ఏకం అన్నాం. కన్ను పటుత్వానికి తగ్గట్టుగా మనస్సు పటుత్వం మారదు. అంతేకాదు ఒక్కొక్క ఇంద్రియాన్ని ఒక్కొక్క మనస్సుతో చూడము. ఉన్నదొకటే మనస్సు.

ఇప్పుడు మనస్సులో చెలరేగే అనేక భావనల పరంపర గురించిన వర్ణన వస్తోంది. మనస్సులో ఆనందం, దుఃఖం, ఈర్ష్య, అసూయ, జాలి, దయ, భయంలాంటి అనేక భావ తరంగాలు లేస్తాయి. అంతేకాదు కంటిచూపులో ఎలా తారతమ్యాలు ఉంటాయో అలా మనస్సు అర్థం చేసుకునే శక్తిలో కూడా తారతమ్యాలు ఉంటాయి. అజ్ఞానం, జ్ఞానం, తెలిసీ తెలియని అజ్ఞానం, అర్థమయీ కాని జ్ఞానం, సందేహం ఇలా స్థాయీ భేదాలు ఉంటాయి. అవన్నీ మనం అనుభవిస్తున్నామని చెపుతున్నామంటేనే మనం అనుభవిస్తున్నట్టు లెక్క. బృహదారణ్యక ఉపనిషత్తు మొదటి అధ్యాయం, ఐదో బ్రాహ్మణంలో వీటి గురించి ఒక పెద్ద పట్టిక ఇస్తుంది. అందులోవే ఈ శ్లోకంలో కూడా చూస్తాము.

**కామః సఙ్కల్పసన్దేహౌ శ్రద్ధాఽ శ్రద్ధే ధృతీతరే హ్రీర్ధీర్భీరిత్యేవమాదీన్ –**

**కామం –** కోరిక. నాకు కోరిక ఉందని తెలిస్తేనే అది తీర్చుకోవటానికి ప్రయత్నిస్తాను. తెలియకపోతే, దాన్ని పట్టించుకోను.

**సంకల్పం –** ప్రణాళిక. ఈ నెల ఖర్చుల్లో ఇది కొందామని వేసుకునే ప్రణాళిక.

**సందేహం –** చేయగలనో లేదో అనే శంక. అనుకోని ఖర్చు వస్తుందేమోననే శంక. అందుకే పరమాత్మను సత్యకామః సత్య సంకల్పః అంటారు.

బృహదారణ్యకంలో సందేహం బదులు విచికిత్స ఉంది. ఇక్కడ పద్యరూపంలో రావటానికి సందేహం వాడబడింది.

**శ్రద్ధ** – నమ్మకం; **అశ్రద్ధా**– అపనమ్మకం

**ధృతి** – దృఢ నిశ్చయం; **ఇతరే**– దృఢ నిశ్చయం లేకపోవటం

బృహదారణ్యకంలో ధృతిః అధృతిః అని వస్తుంది.

**హ్రీః** – అణకువ; **ధీః** – జ్ఞానం; **భీః** – భయం

**ఇత్యేవమాదీన్** – ఇటువంటి భిన్న లక్షణాలను

**చితిః** – చైతన్యం. ఇంతకు ముందు దీన్ని సాక్షిగా చూశాము. అందువల్ల సాక్షిచైతన్యం అనవచ్చు.

**భాసయతి** – ప్రకాశింపజేస్తుంది. ఎలా?

**ఏకధా** – ఈ సాక్షిచైతన్యం ఒక్కటిగా ప్రకాశిస్తోంది.

దృశ్యం అనేకం, దృక్ ఏకం.

మనసులో ఆలోచనలు ఉన్నా, ఆలోచనలు లేకపోయినా, ఆ మనస్సును సాక్షీభూతంగా చూస్తుంది సాక్షిచైతన్యం. దీనికి పుస్తకం – కాంతి ఉదాహరణ చూద్దాము. దీన్ని తత్త్వబోధలో చూస్తాము. 5 లక్షణాలు చెబుతారు. మన చేతిలో ఒక పుస్తకం ఉందనుకోండి. కాంతి – పుస్తకం విశ్లేషణ చూద్దాము.

1. కాంతి పుస్తకంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దానినుంచి ఉత్పత్తి అయిన వస్తువు కాని కాదు.

2. కాంతి స్వతంత్ర వస్తువు. అది పుస్తకం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తుంది.

3. కాంతి, పుస్తకం సరిహద్దులకు మాత్రమే పరిమితమవలేదు.

4. కాంతి, పుస్తకం తీసేస్తే మాయమవదు. పుస్తకం తీసాక కూడా కాంతి ఉంటుంది.

5. కాంతి, పుస్తకం లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన కాంతి లేనట్టు కాదు.

ఇప్పుడు ఇవే సూత్రాలను చైతన్యానికీ, మనస్సుకూ అన్వయించి చూద్దాము.

1. చైతన్యం మనస్సులో ఒక భాగం కాని, లక్షణం కాని, దానినుంచి ఉత్పత్తి అయిన వస్తువు కాని కాదు.

2. చైతన్యం స్వతంత్ర వస్తువు. అది మనసంతటా వ్యాపించి మనస్సును ప్రకాశింపజేస్తుంది.

3. చైతన్యం, మనస్సు సరిహద్దులకు మాత్రమే పరిమితమవలేదు.

4. చైతన్యం, మనస్సు నిద్రపోయినా, నిద్రపోదు.

5. చైతన్యం, మనస్సు నిద్రపోయినా ఉంటుంది కాని తెలియదు. దాన్ని ప్రతిబింబింపజేసే మాధ్యమం లేదు కాబట్టి అది తెలియదు.

అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఈ చైతన్యమే దృక్ 3. దీని స్వరూపమేమిటి?

**దృగేవ న తు దృశ్యతే** – అది చూసేదే కాని, చూడబడేది కాదు.

**ఎవర్ ది ఎక్స్‌పీరియెన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియెన్స్‌డ్**

**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

ఆత్మ అనుభవంకోసం ఎన్నడూ ప్రయత్నించకూడదు. ఎందుకంటే ఆత్మ ఆబ్జెక్టు కాదు, సబ్జెక్ట్, అంటే మీరే. ఎప్పుడో అనుభవంలోకి వస్తుంది అని ఎదురు చూస్తున్నారంటే దాన్ని మీరు ఆబ్జెక్టుగా పొరపడుతున్నారన్నమాటే. ఆత్మే మీ స్వస్వరూపం. భగవద్గీతలో చెప్పినట్టుగా ఆత్మ పరాప్రకృతి.

**శ్లోకం – 5**

**నోదేతి నాస్తమేత్యేషా న వృద్ధిం యాతి న క్షయమ్।**
**స్వయం విభాత్యథాన్యాని భాసయేత్సాధనం వినా॥**

**ఏషా** – ఈ చైతన్యం. ముందు శ్లోకంలో వర్ణించిన చైతన్యం ఐదు లక్షణాలనూ, ఇక్కడ ఈ శ్లోకం చెపుతోంది. మామూలుగా చైతన్యాన్ని శరీరంతో పోల్చి ఈ ఐదు లక్షణాలనూ చెపుతాము– ఇక్కడ మనస్సుపరంగా చెప్పటం జరిగింది అంతే. దాని గొప్పదనమేమిటి?

**నోదేతి నాస్తమేతి –** చైతన్యం ఉదయించదు. అస్తమించదు. అంటే చావు, పుట్టుకలు లేవు. ఆది, అంతాలు లేవు. అంటే చైతన్యానికి **కాలపరిమితి లేదు.**

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్ – ఛాందోగ్యమ్**

సృష్టికి పూర్వం ఉన్నది చైతన్యం మాత్రమే.

**న వృద్ధిం యాతి న క్షయమ్–** చైతన్యానికి పెరగటం, తరగటం లేదు. ఆకారంలో మార్పు లేదు. అసలు ఆకారమే లేదు. నిర్వికారం. అందుకని శరీరానికి అంటే షడ్వికారాలు చైతన్యానికి అంటవు. అంటే చైతన్యానికి **వస్తు పరిమితి లేదు.**

**స్వయం విభాతి –** సాక్షిచైతన్యం స్వయం ప్రకాశకం– చంద్రుడిని ప్రకాశింపజేసే సూర్యుడు స్వయంప్రకాశకం అయినట్టు, మనస్సును, తద్వారా కన్నును ప్రకాశింపజేసే సాక్షిచైతన్యం స్వయం ప్రకాశకం. అందుకని దాన్ని అనుభవించాలని చూడకూడదు. దాని వల్లే తక్కిన అనుభవాలు తెలుస్తున్నాయి. నా కన్ను పనిచేస్తోందా లేదా అని ఎవరినన్నా అడుగుతామా? ఎవరినన్నా చూడగలుగుతున్నామంటేనే కన్ను పనిచేస్తున్నట్టు. అలాగే ఏదైనా అనుభవం పొందుతున్నామంటే, సాక్షిచైతన్యం ఉన్నట్టు.

**ప్రతిబోధ విదితం మతం – కేన**

**అథాన్యాని భాసయేత్ –** అంతేకాదు, స్వయం ప్రకాశకమే కాదు, మనస్సును కూడా ప్రకాశింపజేస్తుంది. దేనిద్వారా?

**సాధనం వినా –** దానికి వేరే పరికరం అవసరం లేదు. కాని మనస్సుకు ఆలోచనలు కావాలి. ఆలోచనను వృత్తి అంటాము. ఒక వస్తువును మనస్సు చూడాలంటే, ముందు మనస్సులో ఆ వస్తువు గురించిన వృత్తి ఏర్పడాలి. సాక్షి మనస్సును ప్రకాశింపజేయటానికి ఏమీ పనిచేయనవసరము లేదు. ఆలోచన, కోరిక, ప్రణాళిక, చర్య– ఇవేవీ అవసరము లేదు. సాక్షిసన్నిధి మాత్రం చేతే మనస్సు ప్రకాశింపబడుతోంది. నేను అద్దం ముందు నుల్చుంటే చాలు, అందులో నా ప్రతిబింబం వస్తుంది. అలాగే సాక్షిప్రతిబింబం ఏర్పడటానికి ఏమీ చర్య అవసరము లేదు. అదికాక, సాక్షి ఏమీ మార్పు చెందటం లేదు. ఆ విధంగా సాక్షి, వేరే పరికరం సహాయం లేకుండా మనస్సును ప్రకాశింపజేస్తోంది.

టూకీగా సాక్షిలక్షణాలు–

- సాక్షి ఆత్యంతిక దృక్. దాన్ని వేరే ఎవరూ ప్రకాశింపజేయనవసరము లేదు.
- మనస్సుకు ఆలోచనల తోడు కావాల్సినట్టుగా, సాక్షికి దేని తోడూ అవసరం లేదు.
- సాక్షిసంకల్పం, ఆలోచన, ప్రణాళికల్లాంటివి చేయనవసరము లేదు.
- సాక్షికి దేశకాలవస్తు పరిమితులు లేవు.
- సాక్షిసన్నిధి మాత్రం చేతే మనస్సు ప్రకాశింపబడుతోంది.

**శ్లోకం – 6**

**చిచ్ఛాయాఽఽవేశతో బుద్ధౌ భానం ధీస్తు ద్విధా స్థితా।**
**ఏకాహఙ్కృతిరన్యా స్యాదన్తఃకరణరూపిణీ॥**

## 2. మూడు దృక్కుల పనితీరు – 6–12

ఇంతవరకూ, ఒక వ్యక్తిలో ఎలా మూడు దృక్కులుఉన్నాయో చూశాము. ఇప్పుడు శ్లోకాలు 6–12లలో, ఈ మూడు దృక్కులూ ఎలా వచ్చాయి, వాటి పనులేమిటి? వాటి కార్యకలాపాలేమిటి వగైరా ప్రశ్నలకు జవాబులు వస్తాయి. చూసే మూడింటిలో సాక్షి మూడోది. దానికి చావు, పుట్టుకలు లేవు అని చూశాము. అందుకని దానికి కాలపరిమితి లేదు. అది ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూస్తుందని కూడా చూశాము.

అందుకని మనస్సు గురించే చూడాలి. మనస్సు పాంచభౌతికమనీ, అందుకని స్వతహాగా జడమనీ చూశాము. పంచభూతాలయొక్క సత్త్వగుణంతో మనస్సు ఏర్పడింది. అది జడం, సూక్ష్మం. కంటికి కనబడని పదార్థం. కాని అది చూసేది అయింది. ఎలా? దీనికి చంద్రుడే గొప్ప ఉదాహరణ. నిండు పున్నమి రాత్రి పండు వెన్నెల ఎలా కురుస్తోంది? సూర్యుని కాంతి చంద్రునిమీద పడితే, చంద్రుడు భూమాతకు తన చల్లని వెన్నెలను పంచుతున్నాడు. మనస్సు విషయంలోనూ అంతే. సాక్షిని సూర్యునితోనూ, మనస్సును చంద్రునితోనూ పోల్చవచ్చు.

**చిచ్ఛాయావేశతః –** సాక్షియొక్క చైతన్యం మనస్సుమీద ప్రతిబింబించినప్పుడు దాన్ని ఛాయాప్రవేశం అంటారు. అంటే ప్రతిబింబచైతన్యం లేదా ఆభాసచైతన్యం.

**బుద్ధౌ భానం(భవతి) –** చంద్రునిమీద కాంతి పడితే, అది భూమి మీదకు ప్రసరించినట్టు, మనస్సుమీద ప్రతిబింబచైతన్యం పడగానే, మనస్సుకు చైతన్యం రావటమే కాక, అది కూడా దృక్ అవుతుంది, సాక్షికి కాదు, ఇంద్రియాలకు. ఆ విధంగా మనస్సు రెండో దృక్ అవుతుంది. చూడటానికి మనస్సుకు స్వతహాగా చైతన్యం ఉన్నట్టు కనిపిస్తుంది కాని, నిజానికి అది జడం.

**ధీస్తు ద్విధా స్థితా –** మనస్సు విశ్లేషించబడటానికి వీలుగా, దాన్ని రెండు భాగాలుగా విభజించటం జరిగింది.

**ఏకాహఙ్కృతిః –** మనస్సులో ఒక భాగాన్ని అహంకృతి అంటారు. అహంకృతి అంటే మనస్సనే పదార్థం. దానికి ఒక ఉనికి ఉంది. దాన్నే మనోద్రవ్యం లేదా ద్రవ్య అంశం అని కూడా అంటారు.

**అన్యా స్యాదన్తఃకరణరూపిణీ –** రెండో భాగాన్ని అంతఃకరణం అంటారు. అంతఃకరణం ఆలోచన భాగాన్ని సూచిస్తుంది. ఆలోచనలు మనస్సులో లేచి, పడుతూ ఉంటాయి. వీటినే వృత్త్యంశం అని అనవచ్చు. అలలు లేచే ఒక కొలనును తీసుకుంటే, అలలు ఒక అంశం, దాని కింద భాగం ఇంకో అంశం. అలాగే మనస్సులో రేగే అలలు (ఆలోచనలు) వృత్తి, మనసు కింద భాగం ద్రవ్యం. ఇప్పుడు, మనస్సు ఒక బాహ్యవస్తువును చూస్తే, మనస్సులోని ద్రవ్యంశం శరీరంలోనే ఉంటుంది.

కాని మనస్సుయొక్క వృత్తి అంశం బాహ్యంగా వెళ్ళి, ఆ వస్తువును తాకి వస్తుంది. వేదాంతం ప్రకారం, ఆలోచనలు బాహ్యంగా వెళ్ళి వస్తువును చుట్టుముట్టుతాయి. వృత్తి అంశం పెద్దదీ, చిన్నదీ అవుతూ ఉంటుంది.

ఈ రెండు అంశాలూ అర్థం కావటానికి ఇంకో ఉదాహరణ చేతిలో పట్టుకునే ఫ్లాష్‌లైటు. ఫ్లాష్‌లైటు చేతిలోనే ఉంటుంది కాని, లైటు కాంతి బయటకు వెళ్ళి, వస్తువుమీద పడి, దాన్ని ప్రకాశింపజేస్తుంది. మనస్సులోని ఈ రెండు అంశాలూ జడమే. చిదాభాస ప్రవేశంవల్ల అవి చైతన్యం పొందుతున్నాయి.

సూర్యకాంతి అలనూ, కొలనునూ ప్రకాశింపజేసినట్టుగా, సాక్షి మనస్సునూ, ఆలోచననూ ప్రకాశింపజేస్తుంది.

**శ్లోకం - 7**

**ఛాయాఽహఙ్కారయోరైక్యం తప్తాయఃపిణ్డవన్మతమ్।**
**తదహఙ్కారతాదాత్మ్యాద్దేహశ్చేతనతామగాత్॥**

**ఛాయాఽహఙ్కారయోరైక్యం** - మనస్సుకూ, ప్రతిబింబచైతన్యానికీ మధ్య ఉన్న అనుబంధం ఏమిటి? అది ఎంత బలమైనది? మనస్సూ, ప్రతిబింబ చైతన్యమూ ఒక దానితో ఒకటి ఎంత బాగా పెనవేసుకుపోయాయంటే, వాటిని విడదీయటం కుదరదు. మనస్సు అంటే మనస్సులోని ద్రవ్యంశం.

**తప్తాయః పిణ్డవత్** - ఒక ఇనుపబంతిని అగ్నిలో వేస్తే, ఆ అగ్నికున్న వేడీ, కాంతి రెండూ ఇనుపబంతిలోకి చొరబడుతాయి. అది కూడా ఎఱ్ఱగా, నిప్పు కణికలా ఉంటుంది. అది అగ్నితో బాగా కలిసిపోయినట్టుగా, మనస్సు, ప్రతిబింబ చైతన్యమూ కూడా కలిసిపోతాయి. అలా కలిసిన మనస్సు రెండో దృక్ అవుతుంది. **మతమ్** - ఇదే బోధ.

**తదహఙ్కారతాదాత్మ్యాత్** - ఇప్పుడు ఈ మనస్సు శరీరానికి చైతన్యాన్ని ఇస్తుంది. శరీరం, ఇంద్రియాలు కూడా పంచభూతాలతో చేయబడటంవల్ల అవి కూడా జడమే. బింబచైతన్యంనుంచి చైతన్యాన్ని అరువుతెచ్చుకున్న మనస్సు, శరీరానికీ, గోళకాలకీ కూడా చైతన్యాన్ని ఇస్తుంది.

**దేహశ్చేతనతామగాత్** - ఎప్పుడైతే శరీరం, గోళాలకు చైతన్యం అందుతుందో, అప్పుడు ఇంద్రియాలు మొదటి దృక్ అయి, బాహ్యప్రపంచాన్ని చూడగలుగుతాయి. ఆ విధంగా మూడో దృక్‌నుంచి రెండో దృక్, రెండో దృక్ నుంచి మొదటి దృక్ ఏర్పడి, మొదటి దృక్‌వల్ల ప్రపంచాన్ని అనుభవించ గలుగుతాము. అంటే సాక్షి (దృక్ 3) మనస్సు (దృక్ 2)కు చైతన్యం ఇస్తే, మనస్సు ఇంద్రియాల (దృక్ 1)కు చైతన్యం ఇస్తుంది.

**తమేవ భాన్తమనుభాతి సర్వం**
**తస్య భాసా సర్వమిదం విభాతి - ముండకమ్ 2-2-11**

అలా ఈ మూడు దృక్కులూ ఏర్పడుతాయి. ఈ మూడూ కలిపి, ఒక వ్యక్తి అవుతాడు. నేను మనస్సును అనుభవిస్తున్నాను అంటే ఆ 'నేను' సాక్షి. నేను ఇంద్రియాలను అనుభవిస్తున్నాను అంటే ఆ 'నేను' మనస్సు. రూపు, రంగులు నేను చూస్తున్నానంటే ఆ 'నేను' ఇంద్రియాలు. ఆ విధంగా నేను ఈ మూడు దృక్కులలో ఏదైనా అవవచ్చు. కాని ఏం జరుగుతోంది? మనం అయోమయంలో పడిపోయి, ఏది దేన్ని చూస్తోందో తెలుసుకోలేకపోతున్నాము. అవి మూడూ ఎంతగా కలిసిపోయాయంటే, వాటిని విడదీసి చూడటం కష్టమవుతోంది. అందుకని వేదాంతం వాటిని విడదీయటంలో సహాయపడుతోంది.

సాక్షి అసలు దృక్, తక్కిన రెండు సాపేక్షిక దృక్కులు. అవి కూడా ఉపయోగపడతాయి కాని, వాటిలో ఇరుక్కుపోకూడదు. ఈ బోధ తరువాత వస్తుంది. ఒక వ్యక్తి మరణించాక, అతని మనస్సు శరీరాన్ని వదిలి వెళ్ళిపోతుంది. అప్పుడు శరీరం జడం అయిపోతుంది. ఎందుకంటే శరీరం ప్రత్యక్షంగా ఆత్మనుంచి చైతన్యాన్ని తెచ్చుకోలేదు. రెండో దృక్ వెళ్ళిపోవటంవల్ల మొదటి దృక్ చూడలేదు. మూడో దృక్ సర్వవ్యాపకమైనా మాధ్యమం లేక, దాని ఉనికీ తెలియదు.

టూకీగా చెప్పాలంటే– మనస్సు లేకపోతే శరీరం పనిచేయదు. మనస్సు లేకపోతే సాక్షి ఉన్నా తెలియదు.

## శ్లోకం - 8

**అహఙ్కారస్య తాదాత్మ్యం చిచ్ఛాయాదేహసాక్షిభిః।**
**సహజం కర్మజం భ్రాన్తిజన్యం చ త్రివిధం క్రమాత్॥**

ఈ శ్లోకంలో వచ్చే విశ్లేషణ సాధారణంగా వేరే ఎక్కడా చూడము. చూడటానికి మెదడుకు మేతలాగా అనిపించినా, కాస్త జాగ్రత్తగా చూస్తే, ఇది ఎంత విలువైన విశ్లేషణో తెలుస్తుంది.

**అహఙ్కారస్య తాదాత్మ్యం చిచ్ఛాయాదేహసాక్షిభిః –** సూక్ష్మమైన, కంటికి కనబడని మనస్సుకు మూడింటితో అవినాభావ సంబంధం ఉంటుంది. అవి శరీరం, ప్రతిబింబచైతన్యం, బింబచైతన్యం.

**మనఃషష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి – గీత 15-7**

శరీరాన్ని నడిపే శక్తి వెళ్ళిపోతున్నప్పుడు, అది శరీరంలో ఉన్న ఐదు ఇంద్రియాలనూ, ఆరోదైన మనస్సునూ తీసుకువెళ్తుంది.

అలాగే ప్రతిబింబచైతన్యంతో కూడా మనస్సుకు అవినాభావ సంబంధం ఉంది. చంద్రునికి సూర్యకాంతితో ఎంత దగ్గర సంబంధం ఉందో, అంత దగ్గర సంబంధం ఉంది. మనస్సు ప్రతిబింబించే మాధ్యమం, ప్రతిబింబచైతన్యం మనస్సులో ప్రతిబింబిస్తుంది.

మనస్సుకూ, బింబచైతన్యానికీ సంబంధం లేదు.

**సహజం కర్మజం భ్రాన్తిజన్యం చ త్రివిధం క్రమాత్** – ఇప్పుడు ఈ మూడు సంబంధాలూ ఎటువంటివి? అవి వరుసగా సహజం, కర్మజం, భ్రాంతిజం అంటున్నారు రచయిత.

సహజం – మనస్సుకూ, ప్రతిబింబ చైతన్యానికీ ఉన్న అనుబంధం సహజం, శాశ్వతం, విడదీయరాని అనుబంధం. ప్రతిబింబించే మాధ్యమం లేనిదే ప్రతిబింబం లేదు. మాధ్యమం ఉన్నంతవరకూ, ప్రతిబింబం తెలుస్తూనే ఉంటుంది. అందువల్ల చిదాభాస (ప్రతిబింబం)కూ, మనస్సుకూ నిత్య సంబంధం ఉంది. చిదాభాస లేకుండా మనస్సు ఉన్న సందర్భమే లేదు. అంతగా ఈ రెండూ పెనవేసుకుపోయాయి కాబట్టే, మనస్సు జడం కాదు, చేతనం అనుకుంటారు అందరూ. అరువు తెచ్చుకున్నా కూడా చైతన్యం అంత సామీప్యంలో ఉండేసరికి అది సహజగుణంలా అనిపిస్తుంది. మనస్సు సుషుప్తిలో నిద్రపోతున్నప్పుడు, ప్రతిబింబ చైతన్యం కూడా అవ్యక్తంగా ఉంటుంది, కాని విడిపోదు. మరణంలో కూడా ఈ రెండూ విడిపోవు. ఆ మాటకొస్తే ప్రళయంలో కూడా మనస్సు, చిదాభాస కలిసే ఉంటాయి, కాకపోతే అవ్యక్తరూపంలో. ఒక్క విదేహముక్తి సమయంలోనే విడిపోతాయి. అప్పుడు మనస్సు శాశ్వతంగా నాశనమవటం వల్ల, ప్రతిబింబించే మాధ్యమం పోవటంవల్ల ప్రతిబింబం ఉండదు. అందువల్ల మనస్సుకూ, ప్రతిబింబ చైతన్యానికీ ఉన్న అనుబంధం సహజం.

కర్మజం – శరీరానికీ, మనస్సుకూ మధ్య ఉన్న అనుబంధం కర్మజం. అది శాశ్వతం కాదు. ఎందుకంటే శరీరం ఏదో ఒక సమయంలో మరణిస్తుంది. శరీరం మరణించినప్పుడు, మనస్సు దానినుంచి విడివడుతుంది. ఈ రెండింటి మధ్య ఉన్న అనుబంధం శాశ్వతమైతే, శరీరం శాశ్వతంగా ఉండాలి. అందువల్ల ఈ రెండింటి మధ్య అనుబంధం ఏర్పడుతూ ఉంటుంది, తెగిపోతూ ఉంటుంది. తెగిపోవటం మరణం, కొత్త శరీరంతో అనుబంధం పునర్జన్మ. ఇదే పునరపి జననం, పునరపి మరణం.

**వాసాంసి జీర్ణాని యథా విహాయ –** అలా మనసు ఒక శరీరాన్ని వదిలి, ఇంకో శరీరంలోకి వెళ్ళి అక్కడ అది ఉన్నంతవరకూ ఉండి, మళ్ళీ ఇంకో శరీరంలోకి వెళుతుంది. ఆ విధంగా మనస్సుకూ – శరీరానికీ మధ్య ఉన్న అనుబంధం అశాశ్వతం. దేనివల్ల అనుబంధం ఏర్పడుతూ, వీగిపోతూ ఉంటుంది? ప్రారబ్ధకర్మవల్ల. స్థూలశరీరం ప్రారబ్ధకర్మవల్ల ఏర్పడుతుంది. ప్రారబ్ధకర్మ ముగిసేవరకూ స్థూలశరీరం ఉంటుంది. స్థూలశరీరం ఉన్నంతవరకూ మనస్సుతో అనుబంధం ఉంటుంది. అందుకని మనస్సుకూ, శరీరానికీ మధ్య ఉన్న అనుబంధం కర్మజం.

భ్రాంతిజం– మనస్సుకూ, సాక్షికీ మధ్య ఉన్న అనుబంధం భ్రాంతిజం. అంటే వాటి మధ్య నిజంగా అనుబంధం లేదు. ఉందనుకుని మనం పొరబడి, సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాం. ఇది అర్థమవ్వాలంటే ముందు మూడు రకాల సత్యం గురించి తెలుసుకోవాలి. అవి –

**1. ప్రాతిభాసిక సత్యం –** మన స్వప్నప్రపంచం.

**2. వ్యావహారిక సత్యం –** మన జాగ్రద్ ప్రపంచం. స్వప్నంనుంచి జాగ్రద్ ప్రపంచంలోకి లేస్తే స్వప్నప్రపంచం మిథ్య అని తేలుతుంది.

**3. పారమార్థిక సత్యం – త్రికాలేపి తిష్ఠతి –** మూడు కాలాల్లోనూ ఉండేది. బ్రహ్మ మూడు కాలాల్లోనూ ఉంటుందనే నిష్ఠలోకి వస్తే, జాగ్రద్ ప్రపంచం మిథ్య అని తేలుతుంది. జాగ్రద్ ప్రపంచం ఒక కాలంలో ఉండి, ఒక కాలంలో ఉండదు కాబట్టి బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య.

ఇప్పుడు సాక్షినీ, మనస్సునూ తీసుకుంటే బ్రహ్మ అంటే సాక్షిచైతన్యం. సాక్షిచైతన్యం మూడు కాలాల్లోనూ ఉంటుంది కాబట్టి అది పారమార్థిక సత్యం. మనస్సు శరీరంలో ఒక భాగం కాబట్టి అది వ్యావహారిక సత్యం. రెండు భిన్న స్థాయిలకు చెందిన వాటి మధ్య అనుబంధం కుదరదు. ఉదాహరణకు మీ కలలో ఒక అందమైన అమ్మాయిని చూశారనుకోండి. ఆ అమ్మాయిని ఇలలో పెళ్ళి చేసుకోగలరా?

ఇంకో కారణంవల్ల కూడా సాక్షికీ, మనస్సుకూ మధ్య అనుబంధం కుదరదు. ఆకాశంలాగే సాక్షి కూడా అసంగం. దేనితోనూ సంగత్వం కుదరదు.

కాని, అజ్ఞానంవల్ల మనం ఈ రెండింటికీ సంగత్వం కలిపేస్తున్నాము. నేను సాక్షిచైతన్యాన్ని, నాకు దేనితోనూ సంగత్వం లేదు. అందువల్ల మనస్సుతో కూడా లేదు. కాని నేనేం చేస్తున్నాను? సాక్షిచైతన్యాన్ని అయిన నేను, నేను మనస్సును అనుకుని నేను ఆనందంగా ఉన్నాను; నాకు అసూయగా ఉంది; నాకు బెంగగా ఉంది అంటూ మనస్సులో రేగే అనేక రాగద్వేషాలను సాక్షికి ఆపాదించేస్తున్నాను.

వేదాంత బోధను ఒక్కముక్కలో చెప్పాలంటే, నాకూ మనస్సుకూ ఎటువంటి సంగత్వం లేదు. మనస్సులో చెలరేగే భావాలు నన్ను సంసారిని చేయలేవు. ఇంత చిన్న జీవనసత్యం తెలియక మనం మనస్సుకు బందీలమయిపోయాము. మనస్సు ఆడింది ఆట, పాడింది పాటగా చేస్తున్నాము. ఎంత చేసినా తనివితీరని మనస్సును తృప్తి పరచటానికే అహర్నిశలూ పాటుపడుతున్నాము. ఇదంతా కేవలం భ్రాంతి వల్ల ఏర్పడింది. ఉపదేశ సాహస్రిలో 19వ అధ్యాయాన్ని ఆత్మ – మనస్సుల సంవాద ప్రకరణం అంటారు. అందులో సారాంశం జ్ఞాని మనస్సును ఎలా సాక్షీభూతంగా చూసి, దానితో సంభాషణ జరుపుతాడో వస్తుంది. కాని మనమేం చేస్తున్నాం? మనస్సును ఆబ్జెక్టుగా చూసే బదులు, అదే నేను అనుకుని, దాని బాధలను మన బాధలుగా చేసుకుంటున్నాము. అందుకని, మనస్సుకూ, సాక్షికీ మధ్య ఉన్న అనుబంధం భ్రాంతిజం.

జన్యంచ త్రివిధం క్రమాత్– ఈ పద్ధతిలో ఉంది.

మనస్సుకూ ప్రతిబింబ చైతన్యానికీ మధ్య ఉన్న అనుబంధం సహజం.

మనస్సుకూ శరీరానికీ మధ్య ఉన్న అనుబంధం కర్మజం.

మనస్సుకూ సాక్షికీ మధ్య ఉన్న అనుబంధం భ్రాంతిజం.

టూకీగా చెప్పాలంటే–

మనస్సుకు చిత్‌తో, చిదాభాసతో, శరీరంతో ఉన్న అనుబంధం –

**సహజం –** మనస్సుకూ, చిదాభాసకూ మధ్య ఉన్న అనుబంధం సహజం. జన్మజన్మలకూ ఉంటుంది. ఇది మనస్సు రాలితేనే రాలిపోతుంది.

**కర్మజం –** మనస్సుకూ, శరీరానికీ మధ్య ఉన్న అనుబంధం కర్మ సంబంధం. ఇది శరీరం రాలితే రాలిపోతుంది.

**భ్రాంతిజం –** మనస్సుకూ, సాక్షికీ మధ్య నిజంగా అనుబంధం లేదు. ఇది భ్రాంతి. మనమే మనస్సే సాక్షి అనే భ్రాంతిలో పడి సంసారంలో పడిపోతున్నాము.

## శ్లోకం – 9

**సమ్బన్ధినోః సతోర్నాస్తి నివృత్తిః సహజస్య తు।**
**కర్మక్షయాత్ ప్రబోధాచ్చ నివర్తేతే క్రమాదుభే॥**

ఈ అనుబంధాల గురించి ఎందుకు తెలుసుకోవాలి? వాటి గురించి సరియైన అవగాహన ఉంటే, వాటితో సరిగ్గా వ్యవహరించవచ్చు. జ్ఞానం శక్తి. జ్ఞానం ఉంటే, పని బాగా చేయగలిగే నమ్మకం కలుగుతుంది. ఇప్పుడు ఈ అనుబంధాల గురించి తెలిస్తే జరిగేది ఏమిటో చూద్దాము.

**సహజస్య నివృత్తిః నాస్తి –** మనస్సు– ప్రతిబింబ చైతన్యాల మధ్య ఉన్న అనుబంధం సహజం. ఈ అనుబంధాన్ని ఎన్నటికీ విడదీయలేము. ప్రతిబింబ మాధ్యమమైన మనస్సు లేనిదే ప్రతిబింబం లేదు. ప్రతిబింబం లేనిది మాధ్యమం లేదు. అందుకని ఈ రెండింటి అనుబంధం సహజం. ఈ అనుబంధం విదేహముక్తి కలిగినప్పుడే పోతుంది. జ్ఞాని జ్ఞానం పొందాక, ఇక్కడే ఇప్పుడే జీవన్ముక్తి పొందుతాడు. అతనికి మరణం తర్వాత పునర్జన్మ ఉండదు. విదేహముక్తి

పొందుతాడు. అప్పుడు మనస్సు నాశనమయిపోతుంది. ప్రతిబింబ మాధ్యమం అయిన మనస్సు లేకపోతే ప్రతిబింబం ఎక్కడ పడుతుంది? అప్పుడు వాటి మధ్య అనుబంధం పోతుంది. అందుకని జ్ఞాని విషయంలో ఈ అనుబంధం సహజం అయినా, శాశ్వతం కాదు.

**సమ్బన్ధినోః సతః –** అవి ఉన్నంతవరకూ, కలిసే ఉంటాయి. 'మరణం తప్ప మమ్మల్ని విడదీయలేదు' అంటారు గొప్ప అనుబంధాన్ని వివరించేటప్పుడు. ఇక్కడ మరణం కూడా విడదీయలేదు, వీటి అనుబంధాన్ని. మరణంలో మనస్సు, ప్రతిబింబ చైతన్యం కలిసి ప్రయాణం చేసి, ఇంకో కొత్త శరీరంలోకి వెళతాయి. మరణమే కాదు, ప్రళయం కూడా విడదీయలేదు, వీటి అనుబంధాన్ని. ప్రళయంలో కూడా ఈ రెండూ కలిసే ఉంటాయి, మళ్ళీ ఇంకో శరీరంలో ప్రవేశించేవరకూ. ఒక్క సందర్భంలోనే వీటి మధ్య అనుబంధం వీగిపోతుంది.

**కర్మక్షయాత్ (నివృత్తిః) –** మనస్సు– శరీరాల మధ్య ఉన్న అనుబంధం– ఈ అనుబంధం కర్మజం. ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకూ ఈ శరీరంలో ఉంటుంది. మనస్సుద్వారా శరీరానికి కర్తగా ఉండే శక్తి క్షీణించినా శరీరంలో ఇంకా ఉంటుంది. భోక్తగా అది ప్రారబ్ధకర్మ ఇంకా అనుభవించాల్సి ఉంటుంది.

**దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః।**
**వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే॥** **గీత 2–56**

దుఃఖాలకు క్రుంగిపోనివాడు, సుఖాలకు పొంగిపోని వాడు, ఆసక్తిని, భయక్రోధాలను వీడినవాడు అయినట్టి వ్యక్తిని స్థితప్రజ్ఞుడంటారు. ఆ స్థితప్రజ్ఞత ఆత్మజ్ఞానంవల్ల వస్తుంది. ఆత్మజ్ఞానం పొందాక కూడా ప్రారబ్ధకర్మ పోదు. జ్ఞాని కూడా అనారోగ్యాన్ని అనుభవించక తప్పదు.

మనస్సుకూ శరీరానికీ మధ్య ఉన్న అనుబంధం కూడా పోదు, కాని ఆత్మజ్ఞానం పొందాక ఈ అనుబంధాన్ని కొత్తకోణంలో చూస్తాము. అంతకుముందు శరీరానికి ఏదైనా బాధ కలిగితే, మనస్సు నాకే ఎందుకు వచ్చింది అని వాపోతుంది. నొప్పి ప్రారబ్ధకర్మవల్ల కలుగుతుంది. దుఃఖం అజ్ఞానంవల్ల కలుగుతుంది.

అదే నేను శరీరం కాదు, నేను మనస్సు కాదు అనే జ్ఞానం ఎప్పుడైతే వస్తుందో, అప్పుడు ఈ నొప్పివల్ల కలిగే మానసిక దుఃఖం తగ్గుతుంది.

**ప్రబోధాశ్చ** – మనస్సు, సాక్షిల మధ్య ఉన్న అనుబంధం– ఈ అనుబంధం భ్రాంతిజం. అక్కడ నిజంగా అనుబంధం లేదు. ఉందనుకుని పొరబడుతున్నాము. అందుకని అది భ్రాంతిజం. జ్ఞానం పొందితే ఈ భ్రాంతి పోతుంది. ప్రబోధాత్ అంటే వాచ్యార్థం లేవటం, ఇక్కడ జ్ఞానంతో మేలుకోవటం.

**అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమ్ అక్లేద్యోఽశోష్య ఏవ చ।**
**నిత్యః సర్వగతః స్థాణుః అచలోఽయం సనాతనః॥ గీత 2-24**

సాక్షిని ఛేదించటానికి, దహించటానికి, తడపటానికి, శోషింపజేయటానికి సాధ్యము కాదు. ఇది నిత్యం, సర్వవ్యాపి, అచలం, స్థాణువు, శాశ్వతం.

సాక్షి వేరు, మనస్సు వేరు అనే విషయం అర్థం చేసుకోవాలి. చేయి, కాంతి ఒకదానితో ఒకటి సన్నిహితంగా ఉన్నట్టు ఉన్నా కూడా, చేయి లక్షణాలేమీ కాంతికి అంటవు. చేయి కదిలితే, కాంతి కదలదు. చేయి మురికిగా ఉంటే కాంతి మురికిగా అవదు. అలాగే మనస్సుకు ఏమయినా, సాక్షికి అది అంటదు.

జ్ఞానంలో రెండు దశలు ఉన్నాయి. అవి –

1. మనస్సును, సాక్షిని విడదీయటం నేర్చుకోవాలి.

2. విడదీసాక, నేను మనస్సును అనుకోకూడదు. నిదిధ్యాసనంలో నేను మనస్సును కాను, సాక్షిని అని జీర్ణించుకోవాలి. మనస్సుకు నేనే చైతన్యాన్ని ఇస్తున్నాను. అందువల్ల మనస్సులో ఆలోచనలు ఉన్నా నేను చలించను. మనస్సులో ఆలోచనలు లేకపోయినా, అలాగే సుషుప్తిలో మనస్సు నిద్రపోయినా, నేను ఉన్నాను. మనస్సు, వ్యవహారాలూ సద్దుమణిగినా, నేను ఎల్లవేళలా ఉంటాను.

నాకు తెలుసు, మనసులో ఆలోచనలు ఉన్నాయని
నాకు తెలుసు, మనసులో ఆలోచనలు లేవని

ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షీభూతంగా చూసే చైతన్యాన్ని నేను.

ఈ సాక్షి గురించిన వివేకం పొంది, సాక్షితో మమేకం చెందటమే ఆత్మజ్ఞానం.

**యః సాక్షాత్కురుతే ప్రబోధ సమయే స్వాత్మానమేవాద్వయమ్॥**

**-దక్షిణామూర్తి స్తోత్రం**

అందువల్ల ఆత్మజ్ఞానం పొందితే ఈ అనుబంధం భ్రాంతిజం అని అర్థమయితే, ఆ అనుబంధం తొలగిపోతుంది. అనుబంధం లేదని తెలుసుకోవటమే అనుబంధాన్ని తొలగించటం.

రెండింటి మధ్య అనుబంధం లేకపోయినా ఉందనుకోవటం భ్రాంతిజం అని చూశాము కదా. దీన్ని అధ్యాస అని అంటారు. బ్రహ్మసూత్రాల్లో శంకరాచార్యులవారు అధ్యాసభాష్యం రాశారు. దాన్ని వివరించటానికి రజ్జుసర్పభ్రాంతిని ఉదాహరణగా తీసుకున్నారు. అక్కడ పాము ఉంది.

చిరుచీకట్లో తాడును చూసి పాము అనుకున్నాము. అక్కడ ఉన్నది తాడు. పాము లేనే లేదు. అంటే ఒకటి సత్యం, ఇంకోటి అనృతం (అసత్యం). నిజం తాడును, అబద్ధం పామును ఎలా కలుపుతాము? అయినా కలుపుతున్నాము. దీన్ని **సత్యానృత మిథునీకృతం** అంటారు. అలాగే సత్యమైన సాక్షిని, మిథ్య అయిన మనస్సునూ కలుపుతున్నాము. కలపలేని రెండింటిని కలపటమే అధ్యాస. ఈ అధ్యాసవల్ల నేను పుట్టాను, నాకు వయసయిపోతోంది, నాకు కోపంగా ఉంది లాంటి వాక్యాలను వాడుతూ ఉంటాము.

**నివర్తేతే క్రమాదుభే –** జ్ఞానం పొందాక ఈ అయోమయం పోయి, జ్ఞాని తనకు రాగద్వేషాలు లేవనీ, ఇష్టాయిష్టాలు లేవనీ, తను అనంతమైన చైతన్యాన్ననీ అర్థం చేసుకుంటాడు. అలా ఎప్పుడైతే మనస్సునుంచి తనను విడదీసుకుంటాడో, అప్పట్నించే అతన్ని అతని మనస్సు ఆటలాడించలేదు. మనస్సుతో మమేకం చెందితే అది సంసారం. ఇది వివరంగా తర్వాత వస్తుంది. 8,9 శ్లోకాలు దానికి పునాది.

## శ్లోకం – 10

**అహఙ్కారలయే సుప్తౌ భవేద్దేహోఽప్యచేతనః।**
**అహఙ్కారవికాసార్ధః స్వప్నః సర్వస్తు జాగరః॥**

ఆరో శ్లోకంలో మనస్సులో రెండు భాగాలున్నాయనీ, వాటిని ద్రవ్యంశం అనీ, వృత్త్యంశం అంటారనీ చూశాము. ద్రవ్యాంశాన్ని అహంకారమనీ, వృత్త్యంశాన్ని అంతఃకరణం అనీ అంటారు. మూడు అవస్థల్లో మనస్సు మూడు రకాలుగా ఉంటుంది. సాక్షి మూడు అవస్థల్లోనూ ఒకేలాగా ఉంటుంది. అందుకే దాన్ని అవస్థాత్రయ సాక్షి అంటారు.

**అహఙ్కారలయే సుప్తౌ –** సుషుప్తి అవస్థ– మనస్సు ఏమీ పనిచేయనప్పుడు, దీన్ని సుషుప్తి అవస్థ అంటారు. అందులో ఏమీ అనుభవం జరుగదు, ఒక్క అనుభవం తప్ప. నాకేమీ తెలియలేదు అని తెలుస్తుంది అంతే. ఇక్కడ మనస్సు పూర్తిగా ముకుళించుకుపోతోంది.

**భవేద్దేహోఽప్యచేతనః –** దేహః అపి అచేతన భవతి – మనస్సు పడుకునేసరికి శరీరంలో చైతన్యం తెలియదు. అందుకే సుషుప్తి అవస్థలో మరణించినట్టుగా ఉంటుంది.

**అహఙ్కారవికాసార్ధః స్వప్నః –** స్వప్నావస్థ – ఇది సుషుప్తి అవస్థకూ, జాగ్రదావస్థకూ మధ్య దశ. ఇక్కడ మనస్సు అర్ధవికాసం చెంది ఉంటుంది. ఒక స్వప్నప్రపంచాన్ని సృష్టించగలిగేటంత మెలకువగా ఉంటుంది. కాని, ఇంద్రియాలను ఉపయోగించగలిగేటంత హుషారుగా ఉండదు. తన చిత్తంలో నిక్షిప్తమై ఉన్న అనేక జ్ఞాపకాలను వాసనలు అంటారు. ఆ వాసనలు ఈ మధ్య జరిగిన వాటి జ్ఞాపకాలు కావచ్చు లేదా అంతకు ముందు జన్మలోవి కూడా కావచ్చు. ఆ వాసనల ఆధారంగా తన స్వంత స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తుంది.

**సర్వస్తు జాగరః –** జాగ్రదావస్థ– ఇప్పుడు మనస్సు పూర్తిగా హుషారుగా ఉంటుంది. అందుకే దాన్ని పూర్ణవికాసం అంటారు. జాగ్రదావస్థలో రెండు దృక్కులుగా, అంటే ఇంద్రియాలను మొదటి దృక్‌ను చేసి, బాహ్యప్రపంచాన్ని అనుభవిస్తుంది.

వెనుకనుంచి మూడు అవస్థలనూ గమనిస్తే జాగ్రదావస్థలో శరీరం, ఇంద్రియాలు, మనస్సూ అన్నీ హుషారుగా ఉండి, బాహ్యప్రపంచాన్ని అనుభవిస్తాయి. స్వప్నావస్థలో శరీరం, ఇంద్రియాలు పనిచేయవు. మనస్సు మాత్రమే అర్ధవికాసంతో వాసనలద్వారా పనిచేస్తుంది. సుషుప్తిలో మనస్సు కూడా పనిచేయదు.

జాగ్రద్, స్వప్న, సుషుప్తి అవస్థలు వృత్తాకారంలో కొనసాగుతూనే ఉంటాయి. అవస్థల కాలం ఎక్కువ తక్కువలు ఉండవచ్చు. మరణాన్ని కూడా దీర్ఘకాలిక నిద్ర అనాలి ఎందుకంటే అప్పుడు కూడా మనస్సు పనిచేయదు. మరణం తర్వాత కూడా మనస్సు ఉంటుంది. అయితే, మరణం తర్వాత మనస్సు స్వప్న ప్రపంచాన్ని సృష్టించగలదా? లేదు, ఎందుకంటే కలలు కనటానికి మనస్సుకు ఒక శరీరం కావాలి. శరీరం ఉంటేనే జాగ్రద్, స్వప్నావస్థలు సాధ్యం.

ప్రళయంలో మనస్సు కారణావస్థలో బీజరూపంలో ఉండి, తరువాత సృష్టిలో ఇంకో శరీరాన్ని, దాని కర్మఫలంగా పొందుతుంది. మళ్ళీ మూడు అవస్థలు పొందుతూనే ఉంటుంది. ఈ పునరపి జననం, పునరపి మరణం వృత్తి కొనసాగుతూనే ఉంటుంది. అతను జ్ఞానం పొంది విదేహముక్తి పొందితేనే పూర్తి విముక్తి. విదేహముక్తిలో మనస్సు సమష్టి మనస్సులో లయమయిపోతుంది కాబట్టి, పునర్జన్మ ఉండదు.

ఇప్పుడు శరీరపరంగా చూస్తే, మనస్సు హుషారుగా ఉంటే, శరీరం కూడా వ్యవహారం నడపగలదు. మనస్సు పడుకుంటే, శరీరం కూడా పడుకుంటుంది. శరీరంలో చలనం ఉండదు. అందుకని అది మరణించినట్టుగా ఉంటుంది. అందుకే సుషుప్తిలో శరీరంమీద దోమలు స్వైరవిహారం చేసినా తెలియదు, టీవి రణగొణధ్వని చేస్తున్నా తెలియదు.

ఇదొక సమగ్రమైన శ్లోకం. మనస్సు, సాక్షి, మూడు అవస్థలు, ఇంద్రియాలు, శరీరం, మరణం, ప్రళయం, స్వప్నం, విదేహముక్తి, మోక్షం – అన్నిటిగురించీ చెబుతుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే మనిషియొక్క జీవిత చరిత్ర వచ్చేస్తుంది ఇందులో.

**సాక్షి –** సాక్షికి అవస్థలు లేవు. అందుకే దాన్ని అవస్థాత్రయ సాక్షి చైతన్యం అంటారు.

**మనస్సు –**మనస్సును పువ్వుతో పోల్చారు. మొగ్గగా సుషుప్తిలో, అర్థవికాసంగా స్వప్నంలో, పూర్తి వికాసంగా జాగ్రదావస్థలో ఉంటుంది.

మూడు అవస్థలలో మనస్సు, ఇంద్రియాలు, శరీరం.

**జాగ్రదావస్థ –** జాగ్రదావస్థలో ఇంద్రియాలు, మనస్సు, శరీరం పూర్తిగా పనిచేస్తాయి.

**స్వప్నావస్థ –** స్వప్నావస్థలో ఇంద్రియాలు, శరీరం పడుకుంటాయి. మనస్సు పనిచేస్తుంది.

**సుషుప్తి అవస్థ:–** మనస్సు కూడా పడుకుంటుంది. అందువల్ల శరీరం అచేతనంగా ఉన్నట్టు ఉంటుంది.

ఈ మూడు అవస్థలూ వృత్తాకారంలో కొనసాగుతూనే ఉంటాయి.

**మరణం –** మరణంలో కూడా మనస్సు, ప్రతిబింబం ఉంటాయి. కాకపోతే బీజరూపంలో ఉంటాయి.

**ప్రళయం –** ప్రళయంలో కూడా మనస్సు, ప్రతిబింబం ఉంటాయి. కాకపోతే బీజరూపంలో ఉంటాయి.

**స్వప్నం –** మనస్సు మరణం తరువాత, ప్రళయంలోనూ ఉన్నా అది కలగనలేదు. ఎందుకంటే కలగనటానికి స్థూలశరీరం కావాలి.

**విదేహముక్తి –** జ్ఞాని జ్ఞానం పొందాక, అతని మనస్సు సమష్టి మనస్సుతో కలిసిపోతుంది. అప్పుడు అతనికి పునర్జన్మ ఉండదు.

**మోక్షం –** నేను సాక్షిని అని తెలుసుకుని జ్ఞాననిష్ఠలో ఉంటే జీవితం హాయిగా సాగుతుంది.

నేను మనస్సును అని భ్రమలో పడితే మూడు అవస్థల్లో తిరుగుతూ అవస్థపడతాము.

హాయిగా ఉంటారా... అవస్థ పడతారా?

### శ్లోకం – 11

**అన్తఃకరణవృత్తిశ్చ చితిచ్ఛాయైక్యమాగతా।**
**వాసనాః కల్పయేత్ స్వప్నే బోధేఽక్షైర్విషయాన్ బహిః॥**

మనస్సులోని రెండు భాగాలలో ఇంతకుముందు మంత్రంలో అహంకారం గురించి చూశాము. ఇప్పుడు అంతఃకరణం గురించి చూస్తాము. అహంకారాన్ని

కొలనుతోనూ, అంతఃకరణాన్ని దానిలో లేచే అలలతోనూ పోల్చవచ్చు. అలలు కొలనులోని భాగమే అయినా, పైకి లేచి, పడుతుండటంవల్ల వేరేగా ఉన్నట్టు అనిపిస్తాయి.

జాగ్రద్, స్వప్న, సుషుప్తి అవస్థలు– మూడింటిలోనూ ద్రవ్యంశం (అహంకారం) ఉంటుంది. వృత్త్యంశమే అంటే ఆలోచనలే పైకి లేస్తూ ఉంటాయి. పడిపోతూ ఉంటాయి. మనస్సు జడం కాబట్టి, మనస్సులో రేగే ఆలోచనలు కూడా జడమే.కాని ఎలాగైతే సూర్యకాంతి కొలనుమీదా, అలలమీదా కూడా పడుతుందో అలాగే మనస్సులోని అహంకారానికీ, అంతఃకరణకూ కూడా సాక్షి నుంచి చైతన్యాన్ని అరువు తెచ్చుకునే శక్తి ఉంది. సాక్షిచైతన్యం (చిత్)నుంచి అరువు తెచ్చుకున్నదాన్ని చిదాభాస అంటారు. సాక్షిప్రతిబింబం మనస్సులోనూ, ఆలోచనల్లోనూ రెండింటిలోనూ పడుతుంది. ఒక ఆలోచన లేవటమే చిదాభాసతో లేస్తుంది. లేచే ప్రతి ఆలోచననూ వృత్తిజ్ఞానం అంటారు. చిదాభాసతో లేచిన ఆలోచనకు ఇచ్చిన సాంకేతిక పదం వృత్తిజ్ఞానం. ఒక అనుభవం జరిగిందంటే అది సాక్షికి జరిగిన అనుభవం కాదు. చిదాభాసతో కూడిన ఆలోచనకు జరిగినది. ఈ ఆలోచనలు ఎలా ఉంటాయన్నది ఈ శ్లోకంలో చూస్తాము.

సుషుప్తి– సుషుప్తిలో ఆలోచనలు చాలా తక్కువ ఉంటాయి. దాదాపు శూన్యంగా ఉంటాయి. అందువల్ల సుషుప్తిలో ఏ అనుభవమూ ఉండదు. ఆలోచనలు పూర్తిగా శూన్యం అని ఎందుకనటం లేదు అంటే సుషుప్తిలో ఒక చాలా సూక్ష్మమైన ఆలోచన ఉంటుంది. సుషుప్తిలో నాకేమీ తెలియలేదు అని తెలుస్తుంది. ఏ అనుభవమూ లేదు అని తెలియటం కూడా ఒక అనుభవమే. ఉదాహరణకు నా చేతిలో ఏమీ లేదు అంటే, పుస్తకం లేకపోవటమనే అనుభవం తెలుస్తోంది. ఏమీ తెలియలేదు అనే అనుభవాన్ని తర్వాత చెపుతున్నామంటే, ఏమీ లేకపోవటం గురించి తెలిపే ఆలోచన ఉండాలి. అంటే సుషుప్తిలో నాకే అనుభవమూ లేదు అని చెప్పటానికి ఒక వృత్తి కావాలి. ఆ వృత్తిని అవిద్యావృత్తి అనీ, కారణశరీరవృత్తి అనీ, నిద్రావృత్తి అనీ అంటారు.

**రాహుగ్రస్తదివాకరేన్దుసదృశో మాయా సమాచ్ఛాదనాత్।**
**సన్మాత్రః కరణోపసంహరణతో యోఽ భూత్ సుషుప్తః పుమాన్ ॥**
**–దక్షిణామూర్తి స్తోత్రం**

సుషుప్తిలో నాకేం అనుభవం లేదు అని లేచాక చెప్పగలుగుతున్నాము.

**స్వప్నావస్థ –** మన మనస్సులో వాసనల రూపంలో నిక్షిప్తమై ఉన్న గత అనుభవాలనుంచి, ఆలోచనలు ఉత్పన్నమయి, అవి స్వప్నపపంచాన్ని సృష్టిస్తాయి. ఆ విధంగా స్వప్నం మనస్సుయొక్క వృత్తి అంశంనుంచి వస్తుంది.

**జాగ్రదావస్థ –** చేతిలో ఉన్న ఫ్లాష్ లైటునుంచి కాంతి బాహ్యవస్తువులమీద పడినట్టుగా, జాగ్రదావస్థలో మనస్సు ఇంద్రియాలద్వారా బయటకు వెళ్ళి బాహ్యప్రపంచాన్ని చూస్తుంది. మనస్సులోని ద్రవ్యం ఫ్లాష్‌లైటు, వృత్తి లైటు కాంతి, అలాంటి వృత్తులు ఐదు ఇంద్రియాలద్వారా, ఐదు వస్తాయి.

**అన్తఃకరణవృత్తిశ్చ చితిచ్ఛాయైక్యమాగతా –** అంతఃకరణ వృత్తి చితిఛాయతో కలిసినప్పుడు, రెండు ప్రపంచాలను సృష్టిస్తుంది.

**వాసనాః కల్పయేత్ స్వప్నే –** మన మనస్సులో ఉన్న వాసనలనుంచి స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తుంది.

**బోధేఽక్షైర్విషయాన్ బహిః –** బోధే – జాగ్రదావస్థలో, అక్షై– జ్ఞానేంద్రియాలద్వారా, విషయాన్ బహిః – బాహ్యప్రపంచాన్ని సృష్టిస్తుంది.

అలా వృత్తులద్వారా బాహ్యప్రపంచాన్ని చూస్తాము. అంటే వృత్తులవల్లే మనలోంచి వచ్చిన స్వప్న ప్రపంచాన్నీ చూస్తాము. వృత్తులవల్లే బాహ్య ప్రపంచాన్నీ చూస్తాము. అందుకని వృత్తులు సుషుప్తిలో లయమయిపోయినప్పుడు, బాహ్యప్రపంచమూ తెలియదు. స్వప్నప్రపంచమూ తెలియదు. అంటే మూడు దశలూ – బాహ్యప్రపంచం, అంతఃప్రపంచం, శూన్యం అన్నీ వృత్తులవల్లే తెలుస్తున్నాయి. బాహ్యప్రపంచాన్ని ఇంద్రియాలతో చూస్తే, అంతఃప్రపంచాన్ని వాసనలద్వారా చూస్తున్నాయి.

దీనివల్ల ఒక సందేహం రావచ్చు. అంతఃప్రపంచాన్ని ఆలోచనలే సృష్టిస్తున్నాయి. అంటే బాగానే ఉంది, కాని బాహ్యప్రపంచాన్ని కూడా ఆలోచనలే

సృష్టిస్తున్నాయా? అలా అంటే, ఆలోచనలు లేనప్పుడు, ప్రపంచం కూడా లేనట్టే అవుతుందిగా? బాహ్యప్రపంచాన్ని నేను సృష్టించలేదు, దాన్ని ఈశ్వరుడు ఎప్పుడోనే సృష్టించాడు. అలాంటప్పుడు నా ఆలోచనలు బాహ్యప్రపంచాన్ని సృష్టించాయి అని ఎలా చెప్పగలడు రచయిత? ఈశ్వరుడు సృష్టించిన ప్రపంచానికీ, ఆలోచన సృష్టించిన ప్రపంచానికీ మధ్య ఉన్న భేదాన్ని నేను తెలుసుకోవాలి.

మొదటి దాన్ని ఈశ్వరసృష్టి అనీ, రెండోదాన్ని జీవసృష్టి అనీ అంటారు. ఈశ్వరసృష్టివల్ల ఏమీ సమస్య లేదు. కాని నేను నా ఆలోచనలవల్ల సృష్టించిన జగత్తుతోనే సమస్య అంతా. ఆ జగత్తులో నేను అహంకార, మమకారాలు పెంచుకుని, తద్వారా రాగద్వేషాలను ఏర్పరచుకుని, సుఖదుఃఖాలలో మునిగి తేలుతుంటాను. అదే సంసారం అంటే. ఈశ్వరుడు సృష్టించిన బాహ్యప్రపంచం రాగద్వేషాలను ఏర్పరచదు. నేను సృష్టించిన ప్రపంచమే నాలోని అహంకార మమకారాలే నన్ను కృంగదీస్తుంటాయి. ఈ శ్లోకం నేను నా ఆలోచనలద్వారా సృష్టించిన ప్రపంచం గురించి చెప్తోంది. మోక్షం అంటే అహంకార, మమకారాలను పారద్రోలి, జీవసృష్టినుంచి ఈశ్వరసృష్టికి మారటమే. అప్పుడు నేను కోరితెచ్చుకున్న సుఖదుఃఖాలు తొలగిపోతాయి.

అహంకార మమకారాలు పోతేనే, సుఖదుఃఖాలు పోతాయి. మోక్షం అంటే అహంకార మమకారాలను పోగొట్టుకోవటంద్వారా భోగ్యప్రపంచాన్ని దృశ్యప్రపంచంగా మార్చటం.

**నిర్మమో నిరంహంకారః సమదుఃఖసుఖః క్షమీ। – గీత 12–13**

జ్ఞాని అంటే అహంకార, మమకారాలు లేనివాడు. సుఖం ప్రాప్తించినా, దుఃఖం ప్రాప్తించినా సమభావం కలిగి ఉండేవాడు, క్షమాగుణం కలవాడు.

ఈ జ్ఞానం ఎలా పొందాలి? అందుకే వేదాంతం ఉంది. కాని వేదాంతం జ్ఞానం సముపార్జించటంకోసం నేర్చుకునేది కాదు. బుద్ధిలో మార్పు తెచ్చేది.

**తన్‌మన్‌ధన్ సబ్‌కుచ్ తేరా –**

తనువు, మనస్సు, ధనం, మొత్తం నీదే దేవా అనగలగాలి. అలా అనుకోగలగటం కష్టంగా ఉండవచ్చు కాని మోక్షం కావాలంటే అదొక్కటే మార్గం.

వేరే లేదు. 'నేను', 'నాది' అనే అహంకార మమకారాలను పోగొట్టుకోలేకపోతే కనీసం తగ్గించుకోవాలి. ఉన్నదంతా ఈశ్వరునిదే అనుకోగలగాలి.

## శ్లోకం - 12

**మనోఽహఙ్కృత్యుపాదానం లిఙ్గమేకం జడాత్మకమ్।**
**అవస్థాత్రయమన్వేతి జాయతే మ్రియతే తథా॥**

ఈ శ్లోకంలో ఇంకో కొత్త విషయం తెలుస్తుంది. అది మనకు తర్వాత ఉపయోగపడుతుంది. ఇంతవరకూ మనస్సుయొక్క ద్రవ్యాంశం గురించి వృత్త్యంశం గురించీ చూశాము.

**మనోఽహఙ్కృత్యుపాదానం లిఙ్గమేకం –** రెండు అంశాలు ఉన్న ఈ మనస్సు సూక్ష్మశరీరంలో ఒక భాగం. వేదాంతపరిభాషలో మనస్సు అనే అంగానికి సూక్ష్మశరీరం ఉపాదాన కారణం. సూక్ష్మశరీరాన్ని లింగం అంటారు, సూక్ష్మశరీరంలో 17 అంశాలు ఉన్నాయి. పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, మనస్సు, బుద్ధి. ఇవన్నీ కలిసి ఒక భాగం.

**జడాత్మకమ్–** ఈ లింగశరీరం లేదా సూక్ష్మశరీరం జడాత్మకం. కాని మనస్సు ప్రతిబింబింపజేసే చిదాభాసవల్ల అది కూడా చైతన్యవంతమవుతుంది.

**అవస్థాత్రయమన్వేతి–** ఈ లింగశరీరమే ఈ అవస్థాత్రయాన్ని అనుభవిస్తుంది. అవస్థాత్రయం అంటే జాగ్రదావస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థ. ఇంతకు ముందు ఈ అవస్థలను మనస్సు అనుభవిస్తుందని చూశాము. ఇప్పుడు సూక్ష్మశరీరం అనుభవిస్తుందని చెపుతున్నారు రచయిత. తమిళనాడుకు ఉన్న సమస్య భారతదేశానికి చెందుతుందని చెప్పినట్టన్నమాట. దేశంలో ఒక భాగం అవస్థ పడితే, దేశానికి అంతటికీ అవస్థే కదా!

ఇలా సూక్ష్మశరీరం అవస్థాత్రయాన్ని అనుభవిస్తుంది అని చెప్పటంద్వారా ఒక అతి ముఖ్యమైన సమాచారాన్ని అందచేస్తున్నారు రచయిత. మరణకాలంలో స్థూలశరీరం మాత్రమే పడిపోతుంది. సూక్ష్మశరీరం ఉంటుంది. అంతకుముందు సాక్షి ఉంటుందని చూశాము. ఇప్పుడు, మనస్సుతో పాటు సూక్ష్మశరీరం కూడా

ప్రయాణిస్తుంది. స్థూల, సూక్ష్మశరీరాల వియోగం మరణం. సూక్ష్మశరీరం, నూతన స్థూలశరీరాల సంయోగం పునర్జన్మ.

**జాయతే మ్రియతే తథా –** సూక్ష్మశరీరాన్ని (మనస్సుతో సహా), కారణశరీరాన్ని, ప్రతిబింబచైతన్యాన్ని కలిపి జీవాత్మ అంటారు. శరీరం పడిపోయినప్పుడు, సూక్ష్మశరీరం కూడా ప్రయాణం చేసి, ఇంకో స్థూలశరీరాన్ని పొంది మళ్ళీ మూడు అవస్థలనూ అనుభవిస్తుంది. ఆ విధంగా దృక్ 1 – ఇంద్రియాలు, దృక్ 2 – మనస్సు, సూక్ష్మశరీరం రూపంలో ప్రయాణం చేస్తాయి, దృక్ 3 – సాక్షి ప్రయాణం చేయదు. చేయలేదు, చేయనవసరము లేదు కూడా. ఎందుకంటే అది సర్వవ్యాపకం.

**న జాయతే మ్రియతే వా కదాచిత్**
**నాయం భూత్వా భవితా వా న భూయః॥**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో**
**న హన్యతే హన్యమానే శరీరే॥** గీత **2– 20**

ఈ ఆత్మ ఏ కాలంలోనూ పుట్టదు, గిట్టదు. ఇది జన్మలేనిది. నిత్యం, శాశ్వతం. పురాతనం, శరీరం చంపబడినా ఇది చావదు.

వేదాంత సారాంశం మన దృష్టిని దృక్ 1,2లనుంచి దృక్ 3, సాక్షికి మార్చటమే. ఈ మార్పు జరగనంత వరకూ పునరపి జననం, పునరపి మరణం పొందక తప్పదు. జీవి జీవించి ఉన్నంతవరకూ కార్యకరణసంఘాతమైన ఈ సూక్ష్మశరీరం మూడు అవస్థలనూ అనుభవిస్తూనే ఉంటుంది. జాగ్రద్, స్వప్నావస్థలు సుఖదుఃఖాల మేలుకలయికలు. సుషుప్తి అలసిపోయిన శరీరానికి, మనస్సుకు విశ్రాంతిని, ఆనందాన్ని కలుగచేస్తుంది. ఇందాక చూసినట్టుగా సూక్ష్మశరీరం అనుభవాలు ఇక్కడితో ఆగవు. మరణించినా, ఇంకో కొత్త స్థూలశరీరాన్ని పొంది మళ్లీ ఈ అవస్థలన్నీ పడాలి. వ్యక్తులు ఒక ఇల్లు ఖాళీ చేసి ఇంకో ఇంటికి వెళ్ళినట్టుగా ఇది వెళుతుంది. కాని ఇల్లు ఖాళీ చేయబడినా అందులో ఆకాశం ఎక్కడికీ వెళ్ళనట్టుగా, సాక్షి సర్వవ్యాపకం కాబట్టి ఎక్కడికీ వెళ్ళదు. జీవి జ్ఞానం పొందేవరకూ, ఈ జనన మరణ వృత్తాలు తప్పవు అతనికి. ఇదీ ఒక వ్యక్తి

యొక్క పుట్టుపూర్వోత్తరాలు. దీనితో మూడు దృక్కుల గురించిన వర్ణన ముగుస్తుంది. ఇక్కడ్నుంచీ, అసలైన చర్చ మొదలవుతుంది.

**3. సంసారం కారణం, దాని పరిష్కారం - 13-21**

13-21 శ్లోకాలలో, సంసారం గురించిన విశ్లేషణ వస్తుంది. సంసారం ఎలా ఏర్పడింది, దానికి పరిష్కారం ఏమిటి అనే విశ్లేషణ వస్తుంది.

సంసారానికి కారణం ఏమిటి? ఆత్మ అజ్ఞానం. మనలో మూడు దృక్కులు ఉన్నాయి. అందులో రెండు మిథ్య, ఒకటి సత్యం. మన స్వస్వరూపం సత్యసాక్షి. అది తెలియక మనం తక్కిన రెండు దృక్కులతో మమేకం చెంది, సంసారాన్ని కోరి తెచ్చుకుంటున్నాము.

ఈ అజ్ఞానానికి కారణం ఏమిటి?

**మాయ -** మాయ గురించి తెలుసుకోవాలంటే ఈశ్వరుని గురించి, సృష్టి గురించి తెలుసుకోవాలి. మాయవల్ల అజ్ఞానం, అజ్ఞానంవల్ల సంసారం ఏర్పడుతున్నాయి. ఇది తెలుసుకోవాలంటే సృష్టి గురించి కూడా తెలుసుకోవాలి. అందువల్ల సృష్టి, మాయ, అజ్ఞానం, సంసారం- ఈ వరుసక్రమంలో విశ్లేషణ జరుగుతుంది. రచయిత దీని గురించి వివరంగా చెప్పలేదు కాబట్టి, ఈ అంశాల గురించి మనం కొంచెం లోతుగా పరిశీలిద్దాము. లేకపోతే ఈ శ్లోకాలు అర్థం చేసుకోవటం కొంచెం కష్టమవుతుంది.

**సృష్టి- పాఠం-1**

సృష్టి నిర్వచనం - కారణంనుంచి ఒక కార్యం ఉత్పత్తి చెందటం. కార్య, కారణ పదాలను తేలిగ్గా వాడేస్తాము. ఉదాహరణకు మట్టి ముద్దనుంచి ఒక కుమ్మరి అనేక వస్తువులను తయారు చేశాడనుకుందాము. అప్పుడు మట్టి కారణం, అతను తయారుచేసిన వస్తువులు- కుండ, కూజా, మూత మొదలైనవి కార్యం. అంటే కుమ్మరి ఎన్నో కుండలను ఉత్పత్తి చేశాడు, సృష్టించాడు లేదా తయారుచేశాడు అంటున్నాము. కుమ్మరి కుండను సృష్టించాడు అంటే నిజంగా సృష్టించాడా? మనం లోతుగా విశ్లేషిస్తే అతను కొత్తగా ఏమీ ఉత్పత్తి చేయలేదు. సృష్టించలేదు. ఆ మాటకొస్తే ఎవరూ కూడా దేన్నీ సృష్టించలేరు. పదార్థాన్ని

సృష్టించలేము, నాశనం చేయలేము అనేది ప్రకృతి సూత్రం. అంటే కుమ్మరి, అణువంత కూడా కొత్త పదార్థాన్ని సృష్టించలేదు.

ముందూ మట్టే ఉంది, ఇప్పుడూ మట్టే ఉంది. మరి అయితే, కుమ్మరి కుండను సృష్టించాడని ఎందుకు అంటున్నాము? అప్పుడు 'సృష్టి' అంటే ముందే ఉన్న మట్టిముద్దకు ఒక ఆకారాన్ని ఇవ్వటమని తెలుసుకుంటాము. కుమ్మరి కొత్తగా దేన్నీ సృష్టించలేదు, సృష్టించలేడు కూడా, అతను చేసిందల్లా ముందే ఉన్న తడిమట్టికి, ఒక ఆకారాన్ని ఇచ్చాడు. కుండ ఏర్పడకముందూ, కుండ ఏర్పడ్డాక కూడా మట్టే ఉంది. ఒక ఆకారం ఏర్పడ్డాక, దానికొక కొత్తపేరు యిచ్చాడు. కుండ అని– అంటే ఉన్న మట్టికి ఒక రూపం, ఆ రూపానికి తగ్గ నామం ఇచ్చాడు.

**వాచాఽఽరంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్॥ – ఛాందోగ్యమ్**

నామరూపాలను సృష్టి అంటారు కాని, వాటిలో కొత్తగా వస్తువు లేదు. ఉన్న వస్తువుకు నామరూపాలు వచ్చి చేరాయంతే.

| | | | | |
|---|---|---|---|---|
| మట్టి | + | నామరూపాలు | = | కుండ |
| బంగారం | + | నామరూపాలు | = | ఆభరణాలు |
| చెక్క | + | నామరూపాలు | = | సామగ్రి |
| **కారణం** | + | **నామరూపాలు** | = | **కార్యం** |

ఇది పాఠం 1

## పాఠం–2

కుమ్మరి కొత్తగా దేన్నీ సృష్టించలేదు. ఉన్నదానికే కొత్తరూపాన్ని ఇచ్చాడు అన్నాము. ఆ రూపం ఎక్కడ్నుంచి వచ్చింది? ఆ రూపాన్ని కూడా కుమ్మరి తేలేదు. వృత్తాకారంలో ఉన్న మట్టిలో అన్ని ఆకారాలు ఉన్నాయి. వృత్తాకారంలో, అవ్యక్తరూపంలో ఉన్నాయి నామరూపాలు. అవ్యక్త నామరూపాలను వ్యక్త నామరూపాలుగా మార్చటమే కుమ్మరి చేసిన పని. కుమ్మరి మట్టిని సృష్టించలేదు. నామరూపాలనూ సృష్టించలేదు. అవ్యక్త నామరూపాలు, వ్యక్తనామరూపాలుగా మారటమే సృష్టి. వస్తువు అంటే మట్టి అలాగే ఉంటుంది.

| | | | | |
|---|---|---|---|---|
| **వస్తువు** | **+** | **అవ్యక్త నామరూపాలు** | **=** | **కారణం** |
| **వస్తువు** | **+** | **వ్యక్త నామరూపాలు** | **=** | **కార్యం** |

ఇది పాఠం –2 ఇక్కడ వస్తువు అంటే చైతన్యం

**పాఠం–3**

జగత్తు అనే కార్యం వెనుక ఉన్న కారణం ఏమిటి? వస్తువు+అవ్యక్త నామరూపాలు = కారణం అన్నాము. వస్తువు+ వ్యక్త నామరూపాలు = కార్యం అన్నాము. కుండ విషయంలో, ఆభరణాల విషయంలో వాటి వస్తువు ఏమిటో తేలిగ్గానే తెలుస్తుంది.

| | | | | |
|---|---|---|---|---|
| **మట్టి** | **+** | **వ్యక్త నామరూపాలు** | **=** | **కుండ** |
| **బంగారం** | **+** | **వ్యక్త నామరూపాలు** | **=** | **ఆభరణం** |

అలా అయితే జగత్తుకు మూల కారణం ఏమిటి? జగత్తు కూడా కార్యం అయితే, దానికి కూడా అవ్యక్త నామరూపంలో ఉన్న ఒక వస్తువు ఉండాలి కదా. పదార్థాన్నేమీ సృష్టించలేము, నాశనం చేయలేము అంటున్నాము. ఈశ్వరుడు కూడా సృష్టించలేడు, నాశనం చేయలేడు అంటున్నాము. అయితే ఆ మూల వస్తువు, అవ్యక్త నామరూపాలతో ఉన్న ఆ మూలవస్తువు ఏమిటి? వేదాంతం దాన్ని **బ్రహ్మ** లేదా చైతన్యం అంటోంది. కుండలాంటి వస్తువులకు మట్టి కారణమయినట్టుగా, ఆభరణాలకు బంగారం కారణమయినట్టుగా, పంచభూతాలు, జగత్తు సృష్టికి మూలకారణం బ్రహ్మ లేదా చైతన్యం.

**బ్రహ్మ స్వరూపం –** ఆ బ్రహ్మ స్వరూపం ఏమిటి? **సత్ చిత్ ఆనందం.** ముందు ఆనందం అంటే ఏమిటో చూద్దాము. ఆనందం అంటే అనంతం. దేశ,కాల, వస్తు పరిమితులకు అతీతం. సత్ అంటే త్రికాలేపి తిష్ఠతి– మూడు కాలాల్లోనూ, అనంతంగా, ఉండే శుద్ధసత్తా. చిత్ అంటే శుద్ధచైతన్యం. ఈ సత్ చిత్ ఆనందమనే మూలవస్తువే జగత్తులో అనేక నామరూపాలుగా ప్రకటితమవుతోంది. బృహదారణ్యకం (6–1)లో నామరూపాలకు తోడుగా కర్మ(దాని పని) కూడా కలుస్తుంది. వ్యక్త నామరూపానికి ఒక వ్యవహారం ఉంటుంది. నిజానికి, ఆ రూపం చేసే పనిని సూచించటానికి ఒక నామం

ఇవ్వబడింది. ఉదాహరణకు కుండ నామరూపాలకు తోడు, దాని పని నీటిని నిలవ ఉంచటం.

**బ్రహ్మ + అవ్యక్త నామరూపాలు = కారణం**

**బ్రహ్మ + వ్యక్త నామరూపాలు = కార్యం**

అవ్యక్త నామరూపాలకున్న సాంకేతిక పదం మాయ.

**బ్రహ్మ + అవ్యక్త నామరూప మాయ = కారణం (ఈశ్వరుడు)**

**బ్రహ్మ + వ్యక్త నామరూప మాయ = కార్యం (జగత్తు)**

కారణం, కార్యాల మధ్య భేదం చూపించటానికి వాటికి భిన్నమైన పేర్లు ఇవ్వటం జరిగింది.

**బ్రహ్మ + అవ్యక్త నామరూప మాయ = ఈశ్వరుడు**

లేదా **బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు.**

సృష్టి స్థితి లయ– మూడింటిలోను వస్తువు అయిన బ్రహ్మకు మార్పు లేదు. అలాగే ఉంటుంది. బ్రహ్మలో అవ్యక్తంగా ఉన్న నామరూపాలు అవ్యక్తంనుంచి వ్యక్తానికీ, వ్యక్తంనుంచి అవ్యక్తానికీ మారుతూ ఉంటాయి.

అవ్యక్త నామరూపాలు వ్యక్తమయితే సృష్టి.

వ్యక్త నామరూపాలు అవ్యక్తంలోకి వెళితే లయ.

ఈ సృష్టి, లయల వృత్తం కొనసాగుతూనే ఉంటుంది.

**అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవంత్యహరాగమే।**

**రాత్ర్యాగమే ప్రలీయన్తే తత్రైవావ్యక్తసంజ్ఞకే॥** **గీత 8-18**

చరాచరప్రాణులన్నీ పగలు ప్రారంభం కాగానే, అవ్యక్తంనుంచి ఉత్పన్నమవుతాయి. మళ్ళీ రాత్రి కాలం ప్రారంభంలో అవి అదే అవ్యక్తంలో లీనమవుతాయి.

ఉన్నదొకటే వస్తువు బ్రహ్మ. అవ్యక్తస్థితిలో ఈశ్వరుడు, వ్యక్తస్థితిలో జగత్తు.

**బ్రహ్మ + అవ్యక్త మాయ = ఈశ్వరుడు**

**బ్రహ్మ + వ్యక్త మాయ = జగత్తు**

ఇది పాఠం 3

## పాఠం - 4

అవ్యక్త నామరూపంలో ఉన్న ఈ మాయను, బ్రహ్మయొక్క మాయాశక్తి అంటారు. ఏ వ్యక్తిశక్తి కూడా ఆ వ్యక్తినుంచి భిన్నంగా ఉండలేదు. ఉదాహరణకు ఒక నాట్యాచారుడు + అతని నాట్యశక్తి వచ్చారు అనగలమా? లేదు. నాట్యాచారునిలో అతని నాట్యశక్తి అవ్యక్తంగా ఉంటుంది. అతను స్టేజీ ఎక్కి నాట్యమాడటం మొదలుపెడితే అతని నాట్యశక్తి బయటకు వచ్చి విన్యాసాలు చేస్తుంది. అలాగే **మాయాశక్తి బ్రహ్మలో అంతర్గతంగా ఉంటుంది.**

ఈ మాయకు రెండు శక్తులు ఉన్నాయి. **విక్షేపశక్తి, ఆవరణశక్తి.** విక్షేపం అంటే విసిరేయటం లేదా బయటకు తేవటం. బ్రహ్మలో అంతర్లీనంగా ఉన్న ఈ విక్షేపశక్తి అవ్యక్తదశనుంచి వ్యక్తదశకు జగత్తును తెస్తుంది. ఆవరణం అంటే మూయటం లేదా కప్పటం. ముందు మాయయొక్క విక్షేపశక్తి పనిచేస్తుంది. జగత్తు అంతా సృష్టి జరిగేవరకూ, దాని తర్వాత ఒక వ్యక్తిలోని సూక్ష్మశరీరం, స్థూలశరీరం ఏర్పడేవరకూ, ఆవరణశక్తి బయటకు రాదు.

సృష్టి ఎప్పుడు జరగాలన్నది జీవుల సమష్టికర్మలమీద ఆధారపడి ఉంటుంది. ప్రళయంలో జీవుల సంచితకర్మలు అవ్యక్తంగా ఉంటాయి. మొత్తం జగత్తుయొక్క సంచిత కర్మలు ప్రారబ్ధకర్మలుగా మారటానికి సిద్ధంగా ఉన్నప్పుడు, మాయయొక్క విక్షేపశక్తి పనిచేస్తుంది. ఒక వ్యక్తి ఎప్పుడు లేవాలి, ఎప్పుడు నిద్రపోవాలి అన్నది అతని ప్రారబ్ధకర్మ ఎలా నిశ్చయిస్తుందో, అలాగే సమష్టిస్థాయిలో జగత్తు ఎప్పుడు లేవాలో (సృష్టి జరగాలో), ఎప్పుడు పడుకోవాలో (లయ జరగాలో) సమష్టి ప్రారబ్ధకర్మలు నిశ్చయిస్తాయన్నమాట. మన నిద్ర లయ అయితే, జగత్తు నిద్ర ప్రళయం; మన నిద్ర భోగనిద్ర అయితే, బ్రహ్మనిద్ర యోగ నిద్ర. రెండింటి వెనుకా ఒకటే సూత్రం పనిచేస్తోంది.

విక్షేపశక్తి అవ్యక్త నామరూపాలను వ్యక్త నామరూపాలుగా మారుస్తుందని చూశాము. అందుకే మనం సున్నాను కనుగొన్నాము. సున్నా అంటే శూన్యం కాదు. అది అవ్యక్తరూపంలో ఉన్న వస్తువులు. అందుకే సంస్కృతంలో సున్నాను పూజ్యం అంటారు. సున్నా కూడా వృత్తాకారంలో ఉంటుంది. అనేక అంకెలు

రావటానికి అది బీజం. వృత్తంనుంచి ఏ ఆకారాన్ని కావాలంటే ఆ ఆకారాన్ని సృష్టించవచ్చు. నామరూపాలు రావటం అంటే, కొత్త వస్తువు పుట్టుకురావటం కాదు. ఉన్న వస్తువులోంచి నామరూపాలు రావటమని ముందే చూశాము.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశ స్సంభూతః ఆకాశాద్వాయుః వాయోరగ్నిః అగ్నేరాపః అద్భ్యఃపృథివీ పృథివ్యా ఓషధయః ఓషధీభ్యోஉ న్నమ్ అన్నాత్ పురుషః॥**

**– తైత్తిరీయం**

పంచభూతాలు, పధ్నాలుగు లోకాలు, స్థూల, సూక్ష్మ శరీరాలూ అన్నీ సృష్టింపబడ్డాయి. చివరి అంశం వ్యష్టి. వీటన్నింటికీ మూలకారణం, బ్రహ్మ. సమష్టిప్రపంచంనుంచి, వ్యష్టిశరీరం ఏర్పడేవరకూ మాయయొక్క విక్షేపశక్తే పనిచేస్తుంది.

సృష్టి అంతా జరిగాక, ఆవరణశక్తి పనిచేస్తుంది. ఆవరణశక్తి బ్రహ్మనేమీ చేయలేదు. ఆవరణశక్తి జీవులను నిజం తెలుసుకోనీయకుండా అజ్ఞానంలో కప్పేస్తుంది. అందువల్ల జీవికి జగత్తు అంటే బ్రహ్మ+నామరూపాలు అనీ తాను కూడా బ్రహ్మే అనీ తెలియదు. ఈ అజ్ఞానమే సంసారానికి కారణం. ఈ అజ్ఞానం పోగొట్టుకోవటమే సంసారంనుంచి విముక్తి.

**మాయ + విక్షేపశక్తి = జగత్తు + వ్యష్టి**

**మాయ + ఆవరణశక్తి = అజ్ఞానం + సంసారం**

**బ్రహ్మ + నామరూపాలు = జగత్తు + నేను = జ్ఞానం = సంసార నివృత్తి**

ఇది పాఠం 4.

మూడు దృక్కులతో కలిసిన వ్యక్తిని సృష్టించేవరకూ విక్షేపశక్తి పనిచేస్తుంది. అందువల్ల మన రాకకు విక్షేపశక్తి ఒక్కటే కారణం. ఇప్పుడు 'నేను' చూస్తున్నాను అని నేనంటే ఈ మూడు దృక్కులతో ఎవరు అంటున్నట్టు ఈ మాట?

సాక్షి ఒకటే ఉంటే అది 'నేను' అనలేదు, ఎందుకంటే సాక్షికి ఆలోచించేందుకు మనస్సు లేదు, మాట్లాడేందుకు నోరు లేదు. అందువల్ల సాక్షి కాదు.

మనస్సు ఒకటే 'నేను' అనలేదు ఎందుకంటే, మనస్సు మాట్లాడటానికి ఇంద్రియాలు కావాలి. అందువల్ల మనస్సు కాదు.

వాక్కు ఒకటే 'నేను' అనలేదు. ఎందుకంటే వాక్కు మాట్లాడటానికి మనస్సు, సాక్షి కావాలి. అందువల్ల నోరు కాదు.

అయితే నేను ఏమిటి?

నేను దృక్ 1 + దృక్ 2 + దృక్ 3ల మేలు కలయికను.

వీటిని ఎలా అర్థం చేసుకోవాలి?

వాటిలో దృక్ 1 + దృక్ 2 మాయయొక్క ఉత్పత్తులు. మాయయొక్క విక్షేపశక్తి మనస్సును, ఇంద్రియాలను ఉత్పత్తి చేసింది. అందువల్ల నేను 'నేను' అన్నప్పుడు, పలికే నా వాక్కు (దృక్ 1), ఆ వాక్కును ఆలోచనద్వారా పలికించే నా మనస్సు (దృక్ 2), మాయచేత సృష్టింపబడిన, విడిగా ఉనికి లేని నామరూపాలు మాత్రమే అని అర్థం చేసుకోవాలి. ఈ రెండు మిథ్యలోకి వస్తాయి. అంటే నాలో ఒక మిథ్య అంశం ఉంది. అధ్యాసభాష్యంలో శంకరాచార్యులు దీన్ని అనృత అంశం (అసత్య అంశం) అంటారు.

దృక్ 3 మాయయొక్క విక్షేపశక్తివల్ల పుట్టిన అనాత్మ అంశం కాదు. అది సాక్షాత్తు బ్రహ్మ. నిత్యచైతన్యస్వరూపం. అందువల్ల సత్య అంశం, నా అసలు స్వరూపం. అందువల్ల నేను సత్య అనృత అంశద్వయం. సత్యం, మిథ్యల మేలు కలయికను.

**'అహం బ్రహ్మ అస్మి,'** – సత్య అంశం అంటోందా, మిథ్య అంశం అంటోందా? మిథ్య అంశానికి సత్యం లేకుండా విడిగా ఉనికే లేదు, అలాంటప్పుడు అది మాట్లాడే ప్రశ్న ఎక్కడ?

అందువల్ల **అహం బ్రహ్మ అస్మి** అని చెప్పేది **సత్య అనృత అంశద్వయం.**

నేను అర్థం చేసుకోవాల్సింది ఏమిటి? నాలో రెండు అంశాలు ఉన్నాయి. ఒకటి మిథ్య అంశం. మిథ్య అంశాన్ని పూర్తిగా కొట్టిపారేయటానికి లేదు. అది వ్యవహారం నడపటానికి అనువుగా ఉంటోంది. మిథ్య అంశాన్నే ఇంకో విధంగా చెపితే వ్యావహారిక సత్యం అంటాము. వ్యావహారిక సత్యం అన్నికాలాల్లోనూ ఉండదు కాబట్టి, దాన్ని నేను నా అసలు 'నేను'గా తీసుకోకూడదు. నాకు ఇంకో నేను ఉంది, అది వ్యవహారానికి అతీతంగా, ఉన్నతంగా ఉంది.

**అదృష్టమవ్యవహారమగ్రాహ్యమలక్షణమచిన్త్యమవ్యపదేశ్యమేకాత్మప్రత్యయసారం ప్రపఞ్చోపశమం శాన్తం శివమద్వైతం చతుర్థం మన్యన్తే స ఆత్మా స విజ్ఞేయః॥**
**-మాండూక్యమ్ 7**

ఆ అసలు నేనే సత్యబ్రహ్మ అంశం. అందువల్ల నేను ఈ సత్యాన్ని. నాలో వచ్చిపోయే మిథ్య అంశం ఉంది, శాశ్వతంగా ఉండే సత్య అంశం ఉంది. నేను సత్య అంశాన్ని అని తెలుసుకుంటే, సంసారం లేదు. ఎందుకంటే మిథ్యను మిథ్యగా స్వీకరించటం నేర్చుకుంటాను. జననమరణాలు, వృద్ధాప్యం, రోగాలు ఇవన్నీ మిథ్య అంశానికి చెందినవి, నేను సత్య అంశాన్ని అనే నిజాన్ని నిజంగా తెలుసుకుంటే సంసారదుఃఖానికి చోటే లేదు.

వచ్చిన చిక్కేమిటి? నాకు నాలో రెండు అంశాలు ఉన్నాయని తెలియదు. అందులో ఏది సత్యమో, ఏది మిథ్యో కూడా తెలియదు. అశాశ్వతమైన అనాత్మ శాశ్వతంగా ఉండాలని కోరుకుంటాను. అందుకని ఈ సత్య అనృత అంశద్వయం విషయంలో ఉంది గొడవంతా!

నా కెందుకు తెలియటం లేదు? నేను ఈ ప్రపంచంలోకి అడుగుపెట్టానని, నాలో రెండు అంశలున్నాయనీ, సత్య అంశమే నేననీ, అనృత అంశం నా వేషమనీ, నా స్వప్నప్రపంచం ఛానెల్ ఒకటి అయితే, జాగ్రద్ ప్రపంచం ఛానెల్ రెండు అని తెలిస్తే, ఎంత బాగుంటుంది? కాని నాకెందుకు ఈ సత్యం తెలియటం లేదు? ఇక్కడే మాయయొక్క ఆవరణశక్తి రంగంలోకి దిగుతుంది.

ఆవరణశక్తి సమష్టిస్థాయిలో అంటే ఈశ్వరునిమీద పనిచేయదు. మనమీదే పనిచేస్తుంది. అందువల్ల మనం నేను సాక్షిని అని తెలుసుకోకుండా అశాశ్వతమైన మనోబుద్ధి అహంకారాలే నేను అనుకుని, అదే శాశ్వతమనుకుని, అక్కడ పరిపూర్ణత్వాన్ని ఎదురుచూస్తాము. వ్యష్టిస్థాయిలో కర్మ అధికారం చూపుతుంది. దృక్ 1, దృక్ 2 గా నేను ఎన్నటికీ యజమానిని కాలేను, ప్రారబ్ధకర్మకు బానిస అవాలి తప్ప. నన్ను నేను మిథ్య అంశంగా భావించుకున్నంతవరకూ సమస్య తప్పదు.

పరిష్కారం ఏమిటి? నేను దృక్ 1, దృక్ 2 అనుకుంటే కర్మనుంచి ఎన్నడూ తప్పించుకోలేను. ఏజన్మ నెత్తినా శరీరం ప్రారబ్ధకర్మను తప్పించుకోలేదు. అందుకని దృక్ 1ను, దృక్ 2ను రక్షించటానికి ప్రయత్నించే బదులు, నేను వాటినుంచి విడివడాలి. నా అసలు 'నేను' అవి కాను, నా అసలు నేను దృక్ 3 అనే ఉన్నతస్థాయికి ఎదగాలి.

**మనోబుద్ధ్యహంకార చిత్తాని నాహం**

దీన్ని గుడ్డిగా చదవటం కాదు. అందులో జీవించాలి. మనోబుద్ధి అహంకారాలనుంచి ఎదిగి సాక్షిని నేను అని తెలుసుకుని, జీర్ణించుకోవాలి. అదే జ్ఞానం.

**అజ్ఞానం = సత్యాన్ని, మిథ్యని కలిపి చూడటం = సంసారం**
**జ్ఞానం = సత్యం స్థాయికి చేరి సత్యనిష్ఠలో నిలబడటం = మోక్షం**

**శ్లోకం – 13**

**శక్తి ద్వయం హి మాయాయా విక్షేపావృతిరూపకమ్।**
**విక్షేపశక్తిర్లిఙ్గాది బ్రహ్మాణ్డాన్తం జగత్ సృజేత్॥**

**శక్తి ద్వయం హి మాయాయా –** మాయా అనే శక్తి ఉంది. బ్రహ్మలో అని మనం కలుపుకోవాలి. మాయ నిర్వచనం ఏమిటి? బ్రహ్మలో అశాశ్వతమైన అవ్యక్తనామరూపం. బ్రహ్మ నిర్వచనం సత్ చిత్ ఆనందం. మాయకు రెండు శక్తులు ఉన్నాయి. ఏమిటవి?

**విక్షేపావృతిరూపకమ్ –** వాటిపేర్లు విక్షేపశక్తి, ఆవరణశక్తి. విక్షేపశక్తి అంటే అవ్యక్తరూపంనుంచి వ్యక్తరూపానికి తీసుకురావటం. ఆవరణశక్తి అంటే కప్పటం.

**విక్షేపశక్తి జగత్ సృజేత్ –** విక్షేపశక్తి జగత్తును సృష్టించింది. ఏ జగత్తును?

**లిఙ్గాది బ్రహ్మాణ్డాన్తం –** లింగం అంటే వ్యష్టి సూక్ష్మశరీరం. దానికి స్థూలశరీరం కలుపుకోవాలి. అంటే వ్యష్టినుంచి బ్రహ్మాణ్డాన్తం– సమష్టి వరకూ.

మాయలో రెండు శక్తులు ఉన్నట్టే మన నిద్రలో కూడా రెండు శక్తులు ఉన్నాయి. నిద్రకు కూడా విక్షేపశక్తి, ఆవరణశక్తి ఉన్నాయి. రాత్రి రాబోయే కల ఇప్పుడే మన మనస్సులో ఉంది, కాని మనం చూడలేము. అది అవ్యక్తరూపంలో

ఉంది. స్వప్నం సృష్టించటానికి కూడా మన ప్రారబ్ధకర్మే కారణం. మన నిద్రయొక్క విక్షేపశక్తి ఒక స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తుంది. తర్వాత ఏమవుతుంది? ఆవరణశక్తి దాని నిజాన్ని కప్పివేస్తుంది. అందువల్ల అది స్వప్నం అని మనకు తెలియదు. దురదృష్టకరమైన అంశం ఏమిటంటే **స్వప్నంలో ఉండగా, స్వప్నం ఒక స్వప్నం అని మనకు తెలియదు.** నిద్రనుంచి లేచాకే అది స్వప్నం అని తెలుస్తుంది.

నిద్ర, తన విక్షేపశక్తిద్వారా స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తే, మాయ తన విక్షేపశక్తిద్వారా జాగ్రద్ ప్రపంచాన్ని సృష్టిస్తుంది.

**శ్లోకం-14**

**సృష్టిర్నామ బ్రహ్మరూపే సచ్చిదానన్దవస్తుని।**
**అబ్ధౌ ఫేనాదివత్ సర్వనామరూపప్రసారణా॥**

ఇంతకు ముందు శ్లోకంలో విక్షేపశక్తి జగత్తును సృష్టిస్తుందని చూశాము. ఇందులో సృష్టి గురించిన మరిన్ని వివరాలు చూస్తాము. దేవుడు కూడా పదార్థాన్ని సృష్టించలేడు, నాశనం చేయలేడు, అది ప్రకృతి సూత్రం అని తెలుసు. మరి అయితే దేవుడు ఎలా సృష్టించాడు? దేవుడు సృష్టించలేదు.

**సర్వనామరూపప్రసారణా** - దేవుడు కొత్తగా దేన్నీ సృష్టించలేదు. నామరూపాలను మాయయొక్క విక్షేపశక్తి అవ్యక్తరూపంనుంచి వ్యక్తరూపంలోకి మార్చింది. ఏమిటా రూపాలు?

**అబ్ధౌ ఫేనాదివత్** - సముద్రనీటిలో బుడగలు, అలలు, నురుగు లేచినట్టుగా. ఇవి వస్తువులు కావు, కేవలం రూపాలు. ఈ రూపాలను సముద్రంలో గాలి ఏర్పరస్తుంది. గాలి వీటిని నీటిమీద ఏర్పరచినట్టుగా, విక్షేపశక్తివల్ల నామరూపాల ప్రపంచం వచ్చింది. దానికి మూలవస్తువు కావాలి. ఏమిటా వస్తువు?

**సృష్టిర్నామ బ్రహ్మరూపే** - రూపే అంటే వస్తువు. ఆ వస్తువు బ్రహ్మ. బ్రహ్మకు స్వతంత్ర ఉనికి ఉంది కాని, నామరూపాలకు లేదు. బల్ల నామరూపానికి ఉనికి చెక్క. బల్లకు చెక్కలేకుండా విడిగా ఉనికి లేదు, కాని చెక్కకు బల్ల లేకపోయినా ఉనికి ఉంది. అలాగే సృష్టిలోని నామరూపాలు వాటి ఉనికికి బ్రహ్మమీద ఆధారపడి ఉన్నాయి గాని, బ్రహ్మకు సృష్టిలేకపోయినా ఉనికి ఉంది. అందువల్ల నామరూపాలు మిథ్య, బ్రహ్మ సత్యం.

**వాచాఽఽ ఽఽర్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్॥ - ఛాందోగ్యమ్**

**సచ్చిదానన్దవస్తుని** -వస్తుని అంటే సత్యం. అందువల్ల బ్రహ్మ నిర్వచనం సత్ చిత్ ఆనందం. ఆనందం అంటే అనంతం అనాలని చూశాము. ఆనందానికి మనం వాడే ఆనందం అర్థం తీసుకోకూడదు. ఎందుకంటే ఆనందం అనేది మనస్సులో ఏర్పడే ఒక భావన. మనస్సు ఏర్పడకముందే బ్రహ్మ ఉంది. సత్ చిత్ ఆనందం అంటే దేశకాలవస్తుపరిమితులు లేని శుద్ధసత్తా, శుద్ధచైతన్యం అని చూశాము. అటువంటి శుద్ధబ్రహ్మ లక్షణాలు 5 ఉన్నాయి.

శుద్ధసత్తా నేను శుద్ధసత్తాను అని చెప్పలేదు. ఎందుకంటే నేను శుద్ధసత్తాను అని చెపితే అది వ్యవహారం అవుతుంది. వ్యవహారం నామరూపం ఉంటేనే వస్తుంది. శుద్ధసత్తా అవ్యవహారి. శుద్ధ సత్ చిత్ ఎలా ఉంటుంది? ఎలా ఉంటుందో మనకు తెలుసు. వేదాంతం దేన్ని బోధించినా, దాన్ని ముందే మనం అనుభవిస్తూనే ఉన్నాము. అదీ దాని గొప్పదనం. వేదాంతంలో ఏమీ అర్థం కానిది లేదు. మనమే దాన్ని అర్థం కాకుండా చేస్తున్నాము. అవ్యవహారి అయిన శుద్ధ సత్ చిత్‌ను మనం ప్రతిరోజూ సుషుప్తిలో అనుభవిస్తున్నాము. గాఢనిద్రలో ఏమవుతోంది? నామరూపాలన్నీ లయమయిపోయి, మనం శుద్ధ సత్-చిత్‌గా మిగులుతున్నాము. ఆ స్థితిలో మన ఉనికి తెలియకుండా ఉంటున్నాము. మనం చైతన్యస్వరూపులం అని తెలియకుండా చైతన్యస్వరూపులుగా ఉంటున్నాము. అదే శుద్ధ సత్ చిత్ ఆత్మ.

### సత్ చిత్ బ్రహ్మరూపే సర్వనామ రూప ప్రసారణ

అన్ని నామరూపాలు వ్యక్తమయ్యాయి. నామరూపాలు ప్రళయంలో లయమయితే దాన్ని ఈశ్వరుని సుషుప్తి అనీ, జగత్తు సృష్టిని ఈశ్వరుని జాగ్రద్, స్వప్నావస్థలనీ అనవచ్చు.అలా మనందరం ఈశ్వరుని స్వప్నంలో ఉన్నాము.

స్వప్నంలో ఉన్న వ్యక్తి, మంచంమీద పడుకుని ఉన్న వ్యక్తిని చూసి ఆహా అతను ఎంత హాయిగా పడుకున్నాడు, ఇక్కడ నన్నేమో ఆడిస్తున్నాడు, అవస్థలు పడేలాగా చేస్తున్నాడు అనుకుంటాడు. కాని నిద్రనుంచి లేచి చూశాక, తను స్వప్నప్రపంచంలో ఒక వ్యక్తి కాదు, తనే స్వప్నప్రపంచ సృష్టికర్త అని

తెలుసుకుంటాడు. అలాగే జాగ్రదావస్థలో ఉండగా మహావిష్ణువు వైకుంఠపురంలో ఉండి, మనను సృష్టించి మనను ఆడిస్తున్నాడనుకుంటున్నాము. గురుశాస్త్ర ఉపదేశంద్వారా మనం ఈశ్వరుని స్వప్నంలో ఉన్నామని తెలుస్తుంది. ఈశ్వరుడు ఎవరు? మనమే. కాని మనకది తెలియదు. ఎందుకు? మాయయొక్క ఆవరణశక్తివల్ల తెలియటం లేదు. అదే తర్వాతవచ్చే శ్లోకంలో వస్తుంది.

## శ్లోకం -15

**అన్తర్దృగ్దృశ్యయోర్భేదం బహిశ్చ బ్రహ్మసర్గయోః।**
**ఆవృణోత్యపరా శక్తిః సా సంసారస్య కారణమ్॥**

విక్షేపశక్తివల్ల సృష్టి జరిగింది. ఆవరణశక్తివల్ల సత్యం, మిథ్యల మధ్య భేదం కప్పబడింది. ఈ ఆవరణశక్తి రెండు స్థాయిలలో జరుగుతుంది. సత్య అనృత వివేకం వ్యష్టిస్థాయిలోనూ లేదు, జగత్తుస్థాయిలోనూ లేదు.

**ఆవృణోత్యపరా శక్తిః –** అపరాశక్తి అంటే ఇంకో శక్తి. మొదటి శక్తి గురించి ముందు శ్లోకంలో వచ్చింది కదా. ఇప్పుడు రెండో శక్తి గురించి వస్తోంది. ఆవరణశక్తి వ్యష్టి సృష్టి జరిగాక మొదలవుతుంది. సృష్టి మొదట్లో ఉండదు. ఇది అర్థం చేసుకోవటానికి మన స్వప్నమే మంచి ఉదాహరణ. నిద్రకు కూడా రెండు శక్తులు ఉంటాయి. విక్షేపశక్తి, ఆవరణశక్తి. మనం నిద్రపోయినప్పుడు, ముందు విక్షేపశక్తి పనిచేసి, స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తుంది. జాగ్రదావస్థలోని పురుషుడు నిద్రపోయినప్పుడు, స్వప్నప్రపంచంలోకి స్వాప్నికుడుగా, స్వప్నశరీరంతో అడుగుపెడతాడు. అతను స్వప్నంలో ఉండగా, స్వప్నం ఒక స్వప్నం అని తెలియదు. దానికి కారణం ఆవరణశక్తి.

కేవలం విక్షేపశక్తే ఉంటే, లాభం ఏమిటి? నేను మంచంమీద పడుకుని, హాయిగా నా స్వప్నాన్ని అనుభవిస్తాను. స్వప్నం నడుస్తున్నంతసేపూ అది నేను సృష్టించిందే, అది అంతా మిథ్య, నాకెప్పుడు కావాలనిపిస్తే అప్పుడు స్వప్నాన్ని ఆపేసి, నిద్రలేవచ్చు అనుకుంటాను. కాని ఆవరణశక్తి ఈ జ్ఞానాన్ని కప్పేయటం వల్ల స్వప్నంలో ఉన్నంతసేపూ అది స్వప్నం అని నాకు తెలియదు.

ఈ ఆవరణశక్తి ఏం చేస్తుంది? అది మొదటిపాదంలో వస్తుంది.

**అన్తర్దృగ్దృశ్యయోర్భేదం –** వ్యష్టిలోపల మనస్సుకూ, సాక్షిచైతన్యానికీ ఉన్న భేదాన్ని ఆవరణశక్తి కప్పేస్తుంది. మనస్సు మాయవల్ల సృష్టింపబడిన అసత్య వస్తువు. దానికి రాకపోకలు ఉన్నాయి. సాక్షిచైతన్యం సత్యం. అది అధిష్ఠానంగా ఎప్పుడూ ఉంటుంది. నేను సాక్షిని, నేను సత్యాన్ని, మనస్సు మిథ్యావస్తువు. కాని దృక్‌దృశ్య వివేకం లేదు నాకు. దృక్ అంటే దృక్ 3 – సాక్షి. దృశ్యం అంటే దృక్ 2, 1 – మనస్సు, ఇంద్రియాలు. వీటి మధ్య భేదం నాకు తెలియక నేను మనస్సును అనుకుంటున్నాను. వీటి మధ్య ఉన్న భేదాలు ఏమిటి?

| | | |
|---|---|---|
| **సాక్షి** | – | **మనస్సు** |
| దృక్ | – | దృశ్యం |
| చేతనం | – | అచేతనం |
| నిర్వికారం | – | సవికారం |
| సత్యం | – | మిథ్య |

ఇన్ని భేదాలు ఉన్నా నాకు వాటి మధ్య భేదాలు తెలియటం లేదు, ఎందుకంటే యిది మాయయొక్క ఆవరణశక్తి చేసే గారడీ.

సాక్షి – అంతఃకరణయోః (భేదం ఆవృణోతి)

**బహిశ్చ బ్రహ్మసర్గయోః –** ఇదే ఆవరణశక్తి బాహ్యంగా కూడా పనిచేస్తోంది. బహిశ్చ తర్వాత భేదం ఆవృణోతి కలుపుకోవాలి. సర్గ అంటే కార్యప్రపంచం. కారణబ్రహ్మకూ, కార్యప్రపంచానికీ మధ్య ఉన్న భేదాలు ఏమిటి?

| | | |
|---|---|---|
| **కారణ బ్రహ్మ** | – | **కార్య ప్రపంచం** |
| వస్తుప్రధానం | | నామరూపప్రధానం |
| త్రికాలేపి తిష్ఠతి | | ఆగమాపాయి |
| సత్యం | | మిథ్య |

కాని, ఈ కార్యకారణ భేదాన్ని కూడా నేను గమనించటం లేదు. అలా బాహ్యంగా కూడా ఆవరణశక్తి కప్పేస్తోంది.

**సా సంసారస్య కారణమ్ –** రెండు స్థాయిల్లోనూ ఉన్న భేదాన్ని తెలుసుకోకపోవటమే సంసారానికి కారణం. అశాశ్వత వస్తువు శాశ్వతంగా

ఉండాలని కోరుకుంటున్నాను. కార్యప్రపంచం వచ్చిపోయేది, అది శాశ్వతం కాదు, అందువల్ల అది భద్రతనివ్వలేదు.

**కార్యం - అనేకం, అనిత్యం, అసారం, అసత్యం**

**కారణం - ఏకం,నిత్యం, సారం, సత్యం**

బ్రహ్మనుంచే భద్రత పొందగలము కాని అది తెలియక పెద్ద పొరపాటు చేస్తున్నాము. భద్రత కోసం వస్తువులమీద, మనుష్యులమీద, పరిస్థితులమీదా ఆధారపడుతున్నాము. అభద్రతా ప్రపంచంనుంచి భద్రత కోరటంవల్ల వస్తోంది సమస్య. అదే సంసారం. దేన్ని నమ్మాలో, దేన్ని నమ్మకూడదో తెలియటం లేదు.

స్వామిచిన్మయానంద రైలు ఎక్కబోతుండగా ఎవరో హిందూ ధర్మం గురించి రెండు ముక్కల్లో చెప్పమని అడిగారుట. స్వామీజీ అలాగే రెండు ముక్కల్లోనే చెప్పారు. అటాచ్‌మెంట్, డిటాచ్‌మెంట్ అన్నారు.

**ఏది నిత్య వస్తువో దానితో అనుబంధం పెంచుకో**

**ఏది అనిత్యవస్తువో దాని బంధంనుంచి విడివడు**

మనం దీనికి వ్యతిరేకంగా చేస్తున్నాము.

అనిత్య వస్తువైన మనస్సుతో అనుబంధం పెంచుకుంటున్నాము

నిత్యవస్తువైన సాక్షితో బంధం ఉందనే తెలుసుకోవటం లేదు

అదే మన సంసారానికి కారణం.

దీన్ని ముందు ముందు యింకా వివరంగా చూస్తాము.

## శ్లోకం- 16

**సాక్షిణః పురతో భాతి లిఙ్గం దేహేన సంయుతమ్।**

**చితిచ్ఛాయా సమావేశాజ్జీవః స్యాద్వ్యావహారికః॥**

ఇంతకుముందు చూసినట్టుగా నాకు సంసారం నేను చేసే రెండు పొరపాట్లవల్ల ఏర్పడుతోంది. వ్యష్టిస్థాయిలో, సమష్టిస్థాయిలో. వ్యష్టిస్థాయిలో నేను సాక్షిని అని తెలిస్తే నాకు ఎవరి అండదండలూ అవసరము లేదు. ఎందుకంటే సాక్షే భద్రత. అప్పుడు నాకు భద్రత ఉంది. నేను పూర్ణుడను అనుకుంటాను. ఇది తెలియక నేను వ్యష్టిపరంగా రెండు పొరపాట్లు చేస్తున్నాను.

1. నన్ను నేను తప్పుగా అర్థం చేసుకుంటున్నాను. నేను సాక్షిని అని తెలియక, నాకు భద్రత కావాలి అనుకుంటున్నాను.

2. పోనీ అలా అనుకుని బ్రహ్మనుంచి సహాయం కోరుతున్నానా? లేదే! ఇంకో పెద్ద పొరపాటు చేస్తున్నాను. శాశ్వతం కాని మనుష్యులు, ఆస్తులు, హోదా మొదలైన వాటినుంచి భద్రత కోరుతున్నాను.

మొదటి పొరపాటు వ్యక్తిపరంగా చేస్తే, రెండో పొరపాటు వస్తుపరంగా చేస్తున్నాను. ఈ రెండూ కలిపి నన్ను సంసారంలో పడేస్తున్నాయి. దీన్నే సాంకేతిక భాషలో వర్ణిస్తున్నాడు రచయిత.

**సాక్షిణః పురతో భాతి లిఙ్గం –** నేను సాక్షిచైతన్యాన్ని, సూక్ష్మశరీరం (లింగం) ముఖ్యంగా మనస్సు, నాకంటి ముందు వస్తువుగా కనిపిస్తోంది. ఎటువంటి మనస్సు?

**దేహేన సంయుతమ్ –** ఆ మనస్సు స్థూలశరీరంతో కలిసి ఉంది. దాని స్వరూపం ఏమిటి? కార్యకరణ సంఘాతమైన ఈ శరీరం ఎప్పటికీ అశాశ్వతం. దీనికి స్వేచ్ఛలేదు, దేశపరిమితి, కాల పరిమితి ఉంది. ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకూ ఉంటుంది.

**చితిచ్ఛాయా సమావేశాత్ –**సమావేశాత్ అంటే ప్రవేశం. సాక్షినుంచి చైతన్యంయొక్క ప్రతిబింబం మనస్సులో ఏర్పడటంవల్ల దేహేంద్రియ మనోబుద్ధులు చైతన్యాన్ని పొందుతాయి.

**జీవః స్యాద్వ్యావహారికః –** ఇలా చైతన్యం పొందిన మనస్సును, జీవి లేదా అహంకారం అనీ, కర్తాభోక్తా అనీ, సంసారి అనీ అంటారు. ఈ జీవి మిథ్య అని తెలియక, ఇదే నా స్వరూపం అని పొరపాటు పడతాను.

దేహేంద్రియ మనోబుద్ధులు ఎన్నటికీ ముక్తిని పొందలేవు. మనస్సు మూడు అవస్థల్లోనూ తిరుగుతూ ఉండాల్సిందే. కలలు వద్దన్నా వస్తాయి. వచ్చే జన్మ వద్దన్నా వస్తుంది. అది దాని స్వరూపం. దీన్ని ఎలా తప్పించుకోవాలి? దానికి ఒకటే మార్గం ఉంది.

నేను మనసును కాను, నేను సాక్షిని అని తెలుసుకోవటమే. ఉదాహరణకు పంచె కట్టుకున్న ఒక వ్యక్తి కారులో వెళుతున్న వ్యక్తిని సాగనంపటానికి వచ్చాడు.

వెళుతున్న కారులో అతని పంచె చిక్కుకుపోయింది. కారు వెంట పరుగెత్తి అందుకోలేడు. అయితే ఏం చేయాలి? దానికి ఒకటే మార్గం. పంచెను వదిలేయటమే! అలాగే మనస్సు పెట్టే చికాకుల వెంట పరుగెత్తి వాటిని అందుకోలేను. తీర్చుకోలేను. దానికీ ఒకటే మార్గం. నేను మనస్సు కాదు అని తెలుసుకోవటమే.

## శ్లోకం-17

**అస్య జీవత్వమారోపాత్ సాక్షిణ్యప్యవభాసతే।**
**ఆవృతౌ తు వినష్టాయాం భేదే భాతేఽపయాతి తత్॥**

**అస్య జీవత్వమారోపాత్ –** నేనుసాక్షిని, మనస్సు నాకు భిన్నంగా ఉన్న వస్తువు అని నిజం తెలియని అజ్ఞానంవల్ల, నేను మనస్సును, నేను శరీరాన్ని అనుకుని వాటితో మమేకం చెందుతున్నాను. ఈ తప్పు చేస్తున్నట్టు నాకెలా తెలుస్తుంది? శరీరానికి బాధ కలిగినప్పుడు నాకు నొప్పిగా ఉంది అంటాను. మనస్సుకు ఏదైనా చంచలత్వం కలిగినప్పుడు, నేను చలించాను అంటాను. ఇలా శరీరం, మనస్సే నేను అనుకోవటంవల్ల నేను సంసారిని అవుతున్నాను. వ్యావహారిక జీవియొక్క, దేహసహిత లింగంయొక్క సమస్యలను,
**సాక్షిణ్యప్యవభాసతే –** సాక్షి అయిన నామీద తప్పుగా ఆరోపించుకుంటున్నాను. సాక్షి అయిన నాకు ఏమీ సమస్యలు లేవు. ఇలా ఒక వస్తువు లక్షణాలను ఇంకో వస్తువుమీద ఆరోపించటాన్ని ధర్మ అధ్యాస అంటారు.

ఉదాహరణకు ఒక రంగులేని స్ఫటికం దగ్గరగా ఎఱ్ఱమందారపువ్వు (జపాకుసుమం) పెట్టాననుకోండి. ఏమవుతుంది? స్ఫటికం ఎఱ్ఱగా కనిపిస్తుంది. అదే ఎఱ్ఱగా ఉందనుకుని, నేను ఆ ఎఱుపు రంగు పోవటానికి ఆ స్ఫటికాన్ని ఎంత రుద్దినా, చెయ్యి నొప్పెడుతుందే తప్ప, రంగు పోదు. రంగు దానిమీద ఉంటే కదా పోవటానికి. అది ఎఱ్ఱపువ్వుకు దగ్గరగా ఉండటంవల్ల దానికి ఎఱ్ఱరంగు ఆపాదించబడింది. నా సమస్యలు కూడా అలా పొరపాటుగా ఆపాదించబడినవే. ఇలా పొరపాటుగా ఆపాదించబడ్డాయనే పొరపాటు గ్రహించక, ఆ సమస్యలను

తొలగించటానికి ప్రయత్నిస్తున్నాను. అవి ఎన్నటికీ పోవు. అవి నా సమస్యలు అయితే కదా పోవటానికి. అంతే కాకుండా, నేను చేసిన ప్రయత్నమేమీ ఫలించటం లేదని, దేవునితో మొరపెట్టుకుంటున్నాను. దేవుడు కూడా ఈ సమస్యలను తీర్చలేడు. ఎందుకంటే అవి నిజంగా నా సమస్యలు కావు కాబట్టి. సమస్యలకు పరిష్కారం లేదని వాపోతున్నాను కాని, నేనెవరినో సరిగ్గా అర్థం చేసుకుంటే, అసలు సమస్య అనేదే లేదని తెలుసుకుంటాను. ఇదే వేదాంతం.

**ఆవృతౌ తు వినష్టాయామ్ –** సమస్యలను పరిష్కరించటానికి ప్రయత్నించే ముందు, అసలు నాకు ఈ సమస్యలు ఉన్నాయా అని నాకు నేను ప్రశ్నించుకోవాలి. సమస్యలతో తన దగ్గరకి వచ్చినవారిని రమణమహర్షి ఈ ప్రశ్న అడిగేవారు, 'సమస్య ఎవరికి ఉంది?' సహజంగా దానికి జవాబు 'సమస్య నాకు ఉంది.' అప్పుడు ఆయన మళ్ళీ ప్రశ్నించేవారు. 'నువ్వెవరు?' ఈ ప్రశ్నవల్ల ఆ వ్యక్తిలో తనెవరో తెలియని అజ్ఞానం కనిపిస్తుంది. దేహేంద్రమనోబుద్ధులే తను అనుకుంటున్నాడు కాని, తాను సాక్షిచైతన్యాన్ని అని తెలుసుకోవటం లేదు. అందువల్ల రమణమహర్షి ముందు ఆ అజ్ఞానం తొలగించేవారు. ఎప్పుడైతే యిలా ఆత్మవిశ్లేషణ జరుగుతుందో నన్ను దుఃఖపెట్టే 'నేను' కరిగిపోతుంది.

విశ్లేషణ ఎలా చేయాలి? శ్రవణ, మననాలద్వారా చేయాలి. శ్రవణం అంటే ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాలపాటు ఒక సమర్థుడైన ఆచార్యుని వద్ద, వేదాంత శాస్త్ర అధ్యయనం చేయటం. శ్రవణం దశలో అనేక ప్రశ్నలు ఉదయిస్తాయి. మననంలో ఆ సందేహాలు తీరి నిస్సంశయ జ్ఞానం కలుగుతుంది.

అజ్ఞానం తొలగిపోయాక కూడా దేహేంద్రియ మనోబుద్ధులు ఉంటాయి. కాని జ్ఞానం పొందాక, వాటిమీద అభిమానం పోతుంది. అప్పుడు నేను శరీరం నుంచి, మనస్సునుంచి విడివడి, సాక్షిచైతన్యంగా ఉండటం నేర్చుకుంటాను.

**మనోబుద్ధ్యహంకార చిత్తాని నాహమ్।**

నేను మనస్సును కాను. మనస్సు కూడా ప్రపంచంలో ఒక భాగం. మనస్సు అనేక భావోద్రేకాలకు లోనవుతుంది. అది ఎదుర్కొనే కొన్ని సమస్యలకు

పరిష్కారాలు ఉన్నాయి. కొన్నింటికి లేవు. శరీరం, మనస్సు ఎదుర్కొని తీరాల్సిన, తప్పించుకోవటానికి వీలులేని అవస్థలను ఎదుర్కొనక తప్పదు. కాకపోతే నేను శరీరం కాదు, నేను మనస్సు కాదు అని గుర్తు తెచ్చుకుంటాను. అయితే నేను ఏమిటి?

**చిదానంద రూపః శివోఽహం శివోఽహమ్॥**

నేను సర్వవ్యాపక ఆత్మను, సాక్షిని.  ఆ ఆత్మ ఎప్పుడూ నిత్యముక్తం. నేను శరీరం లేదా సాక్షిస్వేచ్ఛకోసం ప్రయత్నించను. అవసరంలేదు. ఎందుకు?

శరీరం ఎన్నటికీ స్వేచ్ఛ పొందలేదు. సాక్షి ఎన్నటికీ బంధింపబడలేదు. అంటే **శరీరం విముక్తి పొందలేదు. సాక్షి ముక్తి పొందనవసరం లేదు.** అయితే నేను దేని గురించి పాటుపడాలి? దేని గురించీ పాటుపడనవసరం లేదు. సాక్షిచైతన్యంగా నన్ను నేను అర్థం చేసుకుని, వచ్చేపోయే విషయాలను సాక్షీభూతంగా చూస్తే చాలు. దీన్నే **సమ్యక్ దర్శనమ్** అంటారు.

**భేదే భాతేఽపయాతి తత్ –** సాక్షికి; శరీరం, మనస్సులకీ మధ్య ఉన్న భేదం స్పష్టంగా తెలిస్తే, మనస్సు, శరీరాలనుంచి నాకు ఆపాదించుకున్న సంసారం పోతుంది. స్ఫటికాన్ని ఎప్పటికీ స్పష్టంగా ఉండే స్ఫటికంగానూ, ఎఱ్ఱపువ్వును ఎప్పటికీ ఎఱుపుగానూ అర్థం చేసుకుంటే, స్ఫటికం ఎఱుపుగా ఉందని నేను అనను. స్ఫటికం ఎఱ్ఱగానే కనిపిస్తుంది, కాని నా దృక్కోణం మారుతుంది. సూర్యుడు ఉదయించడు, అస్తమించడు, భూమి సూర్యునిచుట్టూ తిరగటంవల్ల అలా అనిపిస్తోంది అని తెలిసినా, సూర్యోదయం అవుతూనే ఉంటుంది. భూమి గుండ్రంగా ఉందని తెలిసినా, తిరుగుతుందని తెలిసినా, అది నలుచదరంగా ఉన్నట్టూ, కదలనట్టూ అనిపిస్తుంది. అంటే పరిస్థితుల్లో మార్పులేదు, కాకపోతే నేను అర్థం చేసుకోవటంలో మార్పు వచ్చింది. భ్రాంతిని భ్రాంతిగా గుర్తిస్తే చాలు.

**తత్ –** ఎప్పుడైతే ఈ విషయం అర్థం చేసుకుంటామో, అప్పుడే సంసారం పోతుంది. తత్ అంటే జీవత్వం లేదా సంసారం.

## శ్లోకం-18

**తథా సర్గబ్రహ్మణోశ్చ భేదమావృత్య తిష్ఠతి।**
**యా శక్తిస్తద్వశాద్బ్రహ్మ వికృతత్వేన భాసతే॥**

అయోమయం రెండు స్థాయిల్లో ఉంది కాబట్టి, దాని పరిష్కారం కూడా రెండు స్థాయిల్లో చేయాలి. మొదటి అయోమయం నా గురించి. నాకు ఆధారం కావాలి అని కోరుకోవటం గురించి. నేను సాక్షిచైతన్యాన్ని అని శ్రవణ, మననాలద్వారా తెలుసుకుంటే ఆ అయోమయం పోతుంది. నిదిధ్యాసనం గురించి ఇక్కడ రాలేదు, ఎందుకంటే, దాని గురించి ముందు ముందు వివరంగా చూడబోతున్నాము.

ఈ శ్లోకంలో, బాహ్యప్రపంచం గురించిన మన అయోమయం వస్తుంది. బాహ్యప్రపంచాన్ని చూస్తే అక్కడ ఉన్నది ఒకటిగానే అనిపిస్తుంది కాని నిజానికి ఉన్నవి రెండు – బ్రహ్మ, జగత్తు, బ్రహ్మ, జగత్తు ఒకదానితో ఒకటి కలిసిపోయాయి. మనం ఒక కుండని చూస్తుంటే, నిజానికి దాంట్లో రెండు వస్తువులు ఉన్నాయి – కుండ, మట్టి. మట్టి వస్తువు, కుండ కేవలం నామరూపం. దానికి విడిగా ఉనికి లేదు. కాని మనమేం చేస్తున్నాం? రెండింటినీ కలిపేసి, కుండే ఉంది అనుకుంటున్నాము. అంతేకాకుండా దాని బరువు లాంటి లక్షణాల గురించి కూడా మాట్లాడుతాము. అదే అపోహను ప్రపంచానికి కూడా అన్వయిస్తున్నాము. జగత్తు సత్యం అనుకుంటున్నాము కాని అది కుండలాగా మిథ్య అని గ్రహించలేకపోతున్నాము. సత్యమైన ఉనికి లేని ఈ జగత్తుమీద ఆధారపడితే, అవస్థలు పడతాము. ఎందుకంటే అది శాశ్వతం కాదు. మార్పు చెందుతుంది. నాశనమవుతుంది.

**తథా సర్గబ్రహ్మణోశ్చ భేదమ్ –** కేవలం నామరూపాలైన జగత్తు మిథ్య; జగత్తుకు ఆధారమైన బ్రహ్మ సత్యం. కాని మనకు ఈ రెండింటి మధ్య భేదం తెలియటం లేదు. ఎందుకు?

**ఆవృత్యతిష్ఠతి–** ఎందుకంటే ఆవరణశక్తి ఆ భేదాన్ని కప్పివేస్తోంది.

**యా శక్తిః–** ఆ ఆవరణశక్తి కప్పటంవల్ల బ్రహ్మ

**వికృతత్వేన భాసతే –** వికృతం అంటే మార్పులు. నిర్వికారబ్రహ్మ సవికారజగత్తుగా పొరపాటుగా కనిపిస్తోంది. నామరూపాలు చెందే మార్పులను మార్పులేని బ్రహ్మకు ఆపాదిస్తున్నాము. ఎందుకంటే బ్రహ్మ గురించి మనకు తెలియదు. నామరూపాత్మక ప్రపంచానికి ఉన్న సవికారాలను బ్రహ్మకు ఆపాదించటమే కాక, సత్యమైన బ్రహ్మను తీసుకువెళ్ళి మిథ్యావస్తువు మీద ఆరోపిస్తున్నాము. దానివల్ల మిథ్యాప్రపంచం సత్ వస్తువు అయింది. దాన్ని సత్ వస్తువుగా పొరపాటు పడటం వల్ల. మనం మిథ్యాప్రపంచంమీద ఆధారపడుతున్నాము. అది కార్డుబోర్డుతో చేసిన కుర్చీమీద కూర్చోవటానికి ప్రయత్నించినట్లు ఉంటుంది. అటువంటి కుర్చీ దేనికన్నా పనికివస్తుంది కాని కూర్చోవటానికి పనికిరాదు. అలాగే మిథ్యాప్రపంచంలో మనం ఏ వస్తువుమీదా, వ్యక్తిమీదా, అధికారంమీదా, ఆస్తిమీదా ఆధారపడకూడదు. కేవలం ఒకదానిమీదే ఆధారపడాలి. అదే బ్రహ్మ.

**అనన్యాశ్చింతయన్తో మాం యే జనాః పర్యుపాసతే।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥** గీత 9–22

బ్రహ్మ ఒక్కటే సత్యం. అటువంటి బ్రహ్మ మీద ఆధారపడకుండా, జగత్తు మీద ఆధారపడుతున్నాము.

**తద్వశాత్ బ్రహ్మ వికృతత్వేన భాసతే –** ఆ విధంగా బ్రహ్మలక్షణాలు జగత్తుకూ, జగత్తులక్షణాలు బ్రహ్మకూ ఆపాదించి పొరపాటు చేస్తున్నాము. ఇప్పుడు ఈ పొరపాటును సరిదిద్దుకుని, జగత్తు మిథ్య అని తెలుసుకోవాలి. జగత్తులో వ్యవహారం నడపండి, జగత్తులో జీవించండి, కాని జగత్తులో సారం లేదు, దానికి సారం బ్రహ్మ అని గ్రహించండి. అలా గ్రహిస్తే ఎప్పుడు భద్రత కావాలనిపిస్తే, అప్పుడు బ్రహ్మమీద ఆధారపడటం నేర్చుకుంటారు, లేకపోతే జీవితం ఒక నిరంతర పోరాటం అవుతుంది, అంటుంది శాస్త్రం.

మాయ నాకు దేహేంద్రియ మనోబుద్ధులను యిచ్చింది. అది మాయికం, కాని నాకు ఎంతో మేలు చేసింది. లేకపోతే, సాక్షిచైతన్యమైన నేను వ్యవహారం

నడుపలేను. నేను ప్రపంచాన్ని చూడలేను, దానితో వ్యవహారం నడపలేను, ఆనందించలేను. చివరికి నేను సాక్షిని అనికూడా చెప్పలేను. నేను అవ్యవహారి అయిన సాక్షిని అని చెప్పటానికి కూడా నాకు శరీరం, మనస్సు కావాలి. అందువల్ల విక్షేపశక్తి అద్భుతమైనది, ప్రయోజనకరమైనది. దానికి నేను ఋణపడి ఉండాలి. అంతవరకూ కథ బాగానే ఉంది.

కాకపోతే, వచ్చిన చిక్కల్లా మాయయొక్క రెండో శక్తి వల్లే. అది ఆవరణశక్తి. దానివల్ల నేను అసలు నేను అయిన సాక్షికీ, తర్వాత వచ్చిన మాయిక మనశ్శరీరాలకూ మధ్య భేదాన్ని గుర్తించలేక పోతున్నాను. దీనివల్ల నేను వాస్తవానికీ, మాయికానికీ, ఆత్మకూ అనాత్మకూ; దృక్కూ, దృశ్యానికీ; సత్యానికీ మిథ్యకీ మధ్య ఉన్న భేదాలను గుర్తించలేక, మాయికం సమస్యలను తీసుకువచ్చి వాస్తవమైన నామీద ఆరోపించుకుంటున్నాను. మనశ్శరీరాలకు ఉండే సమస్యలన్నింటినీ క్రోడీకరిస్తే, దాన్ని జీవత్వం అని లేదా సంసారం అని అంటారు. శరీరంయొక్క సంసారం కొద్దికాలమే. శరీరం రాలిపోగానే (వ్యక్తి మరణించగానే) దాని పని అయిపోతుంది. కాని మనస్సు విషయం అలాకాదు. అది ఎన్నో జన్మలు ఎత్తుతూ ఉంటుంది. అంటే ఒక శరీరంనుంచి ఇంకో శరీరంలోకి మారుతుంది. మాయికత్వం ఉన్న ఆ జీవత్వాన్ని నామీద అంటే సాక్షిమీద ఆరోపించుకుంటున్నాను. దానివల్ల సంసారిని అవుతున్నాను. ఇది అంటే మాయికం, వాస్తవికాల మధ్య భేదాలు తెలియకపోవటం ఆధ్యాత్మిక స్థాయికి చెందింది.

ఈ ఆవరణశక్తి ఇక్కడితో ఆగకుండా బాహ్యప్రపంచ స్థాయిలో కూడా కప్పేస్తోంది. బాహ్యప్రపంచంలో సవికారజగత్తు, నిర్వికారబ్రహ్మ మధ్య భేదం తెలియటం లేదు. సర్గ అంటే మాయికం – సమష్టిపరంగా నిర్వికార బ్రహ్మను శుద్ధసత్ అనీ, వ్యష్టిపరంగా శుద్ధచిత్ అనీ అంటాము. సమష్టిపరంగా శాశ్వతంగా నిలిచేది సత్ మాత్రమే. ఇంగ్లీషులో ది బుక్ ఈజ్, ది టేబుల్ ఈజ్, ది మ్యాన్ ఈజ్ అని చెప్పుకుంటూ పోతే ఆ ఈజ్‌నెస్సే (ఉనికి) సత్తా. టేబుల్ ఈజ్ లో టేబుల్ మాయిక నామరూపం. ఈజ్ వాస్తవ బ్రహ్మ. ఇక్కడ కూడా ఏది సత్యమో, ఏది మిథ్యో తెలియటం లేదు. అందుకని నామరూపాలు చెందే వికారాలను, మార్పు చెందని బ్రహ్మకు ఆపాదిస్తున్నాము. ది వరల్డ్ ఈజ్ ఛేంజింగ్ అని

అంటున్నప్పుడు 'ఛేంజింగ్' అనే విశేషగుణాన్ని వరల్డ్‌కూ, ఈజ్‌కూ కూడా వాడుతున్నాము.

ఆ విధంగా, వ్యష్టిపరంగా ఆత్మ–అనాత్మ అయోమయం ఉంటే, సమష్టి పరంగా జగత్తు–బ్రహ్మ అయోమయం ఉంది. ఈ రెండు అయోమయాలు కలిసి సంసారానికి కారణమవుతున్నాయి.

| | |
|---|---|
| అభద్రతాభావం | సంసారం 1. |
| ఆధారపడకూడని దానిమీద ఆధారపడటం | సంసారం 2. |

దీనికి రెండు పరిష్కారాలు.

అభద్రతా భావం పోవాలంటే నాకసలు అభద్రతే లేదు, మనశ్శరీరాలను కాను నేనుసాక్షిని అని తెలుసుకోవటం. అది తెలుసుకోలేకపోతే రెండో కారణాన్ని ఛేదించాలి.

ఆధారపడకూడని దానిమీద ఆధారపడటం మాని, ఆధారపడాల్సిన దానిమీద ఆధారపడాలి. అంటే ప్రపంచంలోని మనుష్యులూ, వస్తువులమీద ఆధారపడటం మాని, వాస్తవబ్రహ్మమీద, మామూలు పరిభాషలో చెప్పాలంటే భగవంతునిమీద ఆధారపడాలి.

## శ్లోకం –19

**అత్రాప్యావృతినాశేన విభాతి బ్రహ్మసర్గయోః।**
**భేదస్తయోర్వికారః స్యాత్ సర్గే న బ్రహ్మణి క్వచిత్।।**

సమస్య విక్షేపశక్తితో లేదు, ఎందుకంటే అది నాకు శరీరాన్ని, మనస్సును కూడా యిచ్చింది కాబట్టి అని చూశాము. సమస్య ఆవరణశక్తితో ఉంది. ఆవరణశక్తిని తొలగించుకుని, ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకూ విక్షేపశక్తిని ఉండనిచ్చే వాడు జీవన్ముక్తుడు. ఆవరణం అజ్ఞానం. అజ్ఞానం జ్ఞానం పొందితేనే పోతుంది. ఆ జ్ఞానం ఆత్మ, అనాత్మల వివేకం. ముఖాన్ని చూసుకోవాలంటే, అద్దంలోనే ఎలా చూడాలో, అలాగే ఆత్మజ్ఞానం పొందాలంటే శాస్త్రప్రమాణంద్వారానే పొందాలి. శాస్త్రం కూడా స్వంతంగా అధ్యయనం చేయకూడదు. గురువుద్వారా శాస్త్ర, శ్రవణ, మననాలు చేయాలి. శ్రవణ, మననాలు చేయాలంటే,

సాధనచతుష్టయసంపన్నుడై ఉండాలి. శ్రవణ, మననాలు చేస్తే ఆత్మజ్ఞానం పొంది, వ్యష్టిపరంగా, సమష్టిపరంగా ఉన్న అపోహలు తొలగుతాయి. వ్యష్టిపరంగా, సాక్షిచైతన్యానికీ, మనశ్శరీరాలకీ మధ్య ఉన్న అపోహలు తొలగించుకోవాలి. దీన్ని ఆత్మానాత్మ వివేకం అంటారు. దీన్ని 17వ శ్లోకంలో రెండో పాదంలో చూశాము. ఈ శ్లోకంలో సమష్టిపరంగా సత్యబ్రహ్మకూ, మిథ్యాజగత్తుకూ మధ్య ఉన్న అపోహను శ్రవణ, మననాల ద్వారా ఎలా తొలగించుకోవచ్చో చూస్తాము. ముందు విచారణను త్వంపద విచారణ అనీ, ఇప్పుడు చేయబోయే దాన్ని తత్‌పద విచారణ అనీ అంటారు.

**అత్రాప్యావృతినాశేన –** బాహ్యజగత్తు విషయంలో కూడా బ్రహ్మకూ, జగత్తుకూ మధ్య వున్న భేదం గురించిన అజ్ఞానాన్ని తొలగించుకోవాలి. మనం బ్రహ్మనూ, జగత్తునూ కూడా అనుభవిస్తున్నాము కాని, మనకు ఏది ఏదో తెలియటం లేదు.

ఇది అర్థం చేసుకోవటానికి చేయి– కాంతి ఉదాహరణను చూద్దాము. నేను నా చేతిని చూస్తున్నప్పుడు, నిజానికి నేను నా చేతినీ, దాన్ని ప్రకాశింపజేస్తున్న కాంతినీ చూస్తున్నట్టు లెక్క. కాంతి నా చెయ్యంతా పడి, నా చేతిని ప్రకాశింపజేయటంవల్లే నేను దానిని చూడగలుగుతున్నాను. నేను చేతినే చూస్తున్నాను కాని, కాంతిని పట్టించుకోవటం లేదు. కాంతిని చూడలేనంత మాత్రాన అక్కడ కాంతి లేనట్టు కాదు. నిజానికి ఆ కాంతి లేకపోతే నేను నా చేతిని చూడనే లేను. కాని ఎవరైనా ఇక్కడ నువ్వేం చూస్తున్నావని అడిగితే చెయ్యి అనే చెప్తాను. ఎవరైనా కాంతివల్లే నువ్వు చేతిని చూడగలుగుతున్నావని వివరిస్తే, అప్పుడు కాంతిని కూడా చూడగలుగుతాను. కాంతి అప్పుడూ ఉంది, ఇప్పుడూ ఉంది. నాకు దాని గురించి తెలిశాకే, గమనించ గలుగుతున్నాను.

బ్రహ్మవిషయం కూడా అంతే. జగత్తంతా, అన్నివేళలా బ్రహ్మ ఉంది.

**యస్యైవ స్ఫురణం సదాత్మకమసత్ కల్పార్థకం భాసతే।**
**సాక్షాత్ తత్త్వమసీతి వేద వచసా యో బోధయ త్యయాశ్రితాన్॥**

నేను 'క్లిప్ ఈజ్' అంటున్నప్పుడు రెండు విషయాలు ఉన్నాయి అందులో. క్లిప్+ఉనికి. ఈ ఉనికి క్లిప్‌కి ఒక భాగం కాదు. అది స్వతంత్రమైనది, క్లిప్‌ను తీసేశాక కూడా ఉంటుంది. కాకపోతే ఉనికి ఉన్నట్టు తెలియదు. ఇందాక చూసిన ఉదాహరణలో చెయ్యిని చూస్తే కాంతి ఉన్నట్టు తెలుస్తుంది. చెయ్యిని తీసేసినా కాంతి ఉంటుంది కాని, దాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం ఉండదు కాబట్టి, తెలియదు. అలాగే క్లిప్పు లేకపోయినా ఉనికి ఉంటుంది, కాని తెలియదు. నిజానికి, ఇక్కడ ఏమీ లేదు అని చెప్పినప్పుడు కూడా ఉనికి గురించి చెప్పినట్లే. ఉనికి లేదని తెలుస్తోంది. అందుకని ఒక వస్తువు నామరూపాలే మనకు తెలుస్తున్నాయి కాని దానికి ఉనికి కూడా ఉందని తెలియటం లేదు.

**విభాతి బ్రహ్మసర్గయోః భేదః-** శ్రవణ, మననాలద్వారా నేను ఉనికికీ, నామరూపాలకూ మధ్య ఉన్న భేదాన్ని అర్థం చేసుకుంటాను. నామరూపాలకూ, ఉనికికీ మధ్య ఉన్న భేదాన్ని నేను విడదీయాలి. భౌతికంగా కాదు, నా బుద్ధితో. నా బుద్ధిని ఉపయోగించి బ్రహ్మ అంటే ఉనికి అని, బాహ్యవస్తువులు కేవలం నామరూపాలే అని తెలుసుకోవాలి.

వేదాంతం ఎన్నిసార్లు విన్నా అది ఆత్మానాత్మ వివేకం గురించే చెప్తుంది. అయినా ఎందుకు వేదాంతాన్ని పదే పదే వినాలి? ఎందుకంటే, ఎంత ఎక్కువ వింటే నా బుద్ధి అంత పదునెక్కి, అంత జటిలమైన విషయాన్ని అంతకంతకూ బాగా అర్థం చేసుకుంటుంది. శ్రవణ, మననాలు చేసిన కొద్దీ నిస్సంశయ జ్ఞానం కలుగుతుంది.

విభాతి బ్రహ్మసర్గయోః భేదః।

**తయోః** – వాటి రెండింటి మధ్య

**వికారః స్యాత్** – మార్పులు ఉంటే;

**సర్గే** – ప్రపంచానికి చెందుతాయి.

**న బ్రహ్మణి క్వచిత్** – బ్రహ్మకు వికారాలు(మార్పులు) లేవు. చెయ్యి జరిపినప్పుడు చెయ్యే జరుగుతుంది. కాంతి కదలదు. కాంతి కదిలినట్టు కనిపించినా అది సర్వవ్యాపకం కాబట్టి కదలదు. కాకపోతే ముందు చెప్పినట్టుగా ప్రతిబింబించే

మాధ్యమం కదిలింది కాబట్టి, అది కదిలినట్టుగా కనిపిస్తుంది. అలాగే శుద్ధసత్ అయిన బ్రహ్మ అంతటా ఉంది. 'వాట్ ఈజ్ గాడ్?' అని ఎవరైనా అడిగితే, 'వాట్ ఈజ్, ఈజ్ గాడ్' అని చెప్పాలి. ఉన్నదంతా సత్తే. 'వేర్ ఈజ్ గాడ్?' అని అడిగితే, దానికి జవాబు చెప్పకూడదు. ఎదురు ప్రశ్నించాలి, 'వేర్ ఈజ్ హి నాట్?' బ్రహ్మ సర్వవ్యాపకం. జగత్తంతా సద్రూపంలో ఉన్న బ్రహ్మ చిద్రూపంలో నాలో ఉన్నాడు. **ఈ సత్ చిత్ ఆనందమే బ్రహ్మ.**

**శ్లోకం -20**

**అస్తి భాతి ప్రియం రూపం నామ చేత్యంశపఞ్చకమ్।**
**ఆద్యత్రయం బ్రహ్మరూపం జగద్రూపం తతో ద్వయమ్॥**

ముందు శ్లోకంలో వచ్చిన అంశాన్నే యిక్కడ వివరంగా చూస్తాము. విచారణద్వారా సాధకుడు బ్రహ్మను, జగత్తునూ విడదీసి చూడటం నేర్చుకుంటాడని చూశాము. ఆ విడదీయటం భౌతికంగా కాదు, బుద్ధితో అని కూడా చూశాము. పుస్తకానికి పెట్టిన క్లిప్పును తీసేసి, పుస్తకాన్నీ, క్లిప్పునీ విడివిడిగా చూపించవచ్చు. ఎందుకంటే అవి పరిమితమైనవి. కాని అలా జగత్తును బ్రహ్మనుంచి విడిగా తీయలేము. బ్రహ్మ సర్వవ్యాపకం కాబట్టి బ్రహ్మనుంచి జగత్తును విడదీయలేము. బుద్ధితోనే విడదీయాలి. వ్యష్టిపరంగా సాక్షిచైతన్యాన్ని మూడు శరీరాలనుంచి భౌతికంగా విడదీయలేము. సుషుప్తిలో స్థూల, సూక్ష్మశరీరాలు వ్యవహారం నడపకపోయినా, కారణశరీరం ఉంటూనే ఉంటుంది. అందుకని శుద్ధసత్‌ను, శుద్ధచిత్‌ను, ఆత్మానాత్మవివేకంద్వారా అర్థం చేసుకోవాలి తప్ప అనుభవించలేము. శుద్ధచైతన్యం వచ్చి దర్శనం ఇవ్వదు. ఆ వివేకం ఎలా చూపాలి? అది ఎలా చూపాలో ఈ శ్లోకంలో వస్తుంది.

ఈ శ్లోకాన్ని అనేక సందర్భాలలో చెపుతూ ఉంటాము. మనం ఒక వస్తువును చూస్తున్నప్పుడు దానిలో ఐదు అంశాలను చూస్తున్నాము. అంటే ఏ వస్తువును చూసినా, ఐదు అంశాలూ ఉంటాయి. అందులో మూడు అంశాలు బ్రహ్మకు చెందినవి, రెండు అంశాలు సృష్టికి చెందినవి. అందులో మూడు వాస్తవం,

రెండు మాయికం. ఆ విధంగా మన అనుభవాలు వాస్తవం, మాయికాల మిశ్రమాలు. ఆ ఐదు అంశాలు యివి:

అస్తి –ఉనికి – బుక్ ఈజ్, మ్యాన్ ఈజ్, ఛెయిర్ ఈజ్ లాంటి పదాల్లోని ఈజ్‌నెస్సే ఉనికి. ఉనికి లేని వస్తువంటూ లేదు. నిజానికి 'అక్కడ ఏమీ లేదు,' అని చెప్పినప్పుడు కూడా ఉనికి పదం వాడినట్టే. దానికి ఉనికి లేదు అంటున్నాము.

అస్తికి ఇంకోపేరు సత్. అన్ని అనుభవాల్లోనూ సత్ ఉంది. శబ్దస్పర్శరూపరసగంధాలద్వారా మనం పొందే అనుభవాలు భిన్నమవచ్చు కాని వాటిలో సమానంగా ఉన్నది ఉనికి. కాని దాన్ని మనం పట్టించుకోవటం లేదు. బుక్ ఈజ్ అనే వాక్యంలో మనం బుక్‌నే చూస్తున్నాము కాని, ఈజ్‌నెస్‌ను పట్టించుకోవటం లేదు. నిజానికి వేదాంతం ఉనికి ఉందని చెప్పనక్కరలేదు, ఉనికిని అనుభవిస్తున్నాము కాని దాన్ని గ్రహించటం లేదు. అందుకని వేదాంతంయొక్క ఉద్దేశం ఏమిటంటే వస్తువుతోపాటు ఉన్న ఉనికిని గ్రహించేలా చేయటం. ఇక్కడేం ఉంది అంటే చెయ్యి అని చెప్పకుండా చెయ్యి+కాంతి అని చెప్పగలిగేలా చేయటం.

భాతి – ఎఱుక. ఒక వస్తువు ఉందని నాకు తెలుసు. నాకు తెలియని వస్తువుయొక్క ఉనికి గురించి నేను చెప్పలేను. ఉదాహరణకు, నాకు చైనాభాష తెలియకపోతే, చైనాభాష నాకు తెలియదని నాకు తెలుసు. అంటే ప్రతి వస్తువు గురించి నాకు ఎఱుక ఉండవచ్చు, ఎఱుక లేకపోవచ్చు. ఒక వస్తువు గురించిన ఎఱుక ఉందంటే, దాని ఉనికి గురించి కూడా మాట్లాడుతున్నట్టే. అస్తి అంటే సత్ సంబంధం, భాతి అంటే చిత్ సంబంధం. సత్‌చిత్‌లు రెండూ ప్రతివస్తువులోనూ ఉన్నాయి. సత్ ఉనికిగానూ, చిత్ ఎఱుకగానూ ఉన్నాయి.

ప్రియం – ఆనందం. ప్రతి వస్తువులోనూ ఆనందం అంశం కూడా ఉంది. నాకు ఒక వస్తువు ఆనందం కలుగజేయటం లేదు కాని, ఇంకొకరికి అది ఆనందహేతువు. అలాగే మనుష్యులు కూడా. అందరూ ఏదో విధంగా ఆనందం కలుగజేస్తారు. కొంతమంది మన దగ్గరకి వస్తే ఆనందం కలుగుతుంది. కొంతమంది మనను విడిచివెళ్ళాక ఆనందం కలుగుతుంది. అంటే వారు వెళ్ళిపోయాక, హమ్మయ్య అనుకుంటాము. 'నాకు మామిడిపండు యిష్టం' అనే

వాక్యంద్వారా ఆనందాన్ని ప్రకటిస్తాము. ప్రియం అంటే ఆనందం. అలా సృష్టిలో ఉన్న ప్రతిదానికీ సత్,చిత్, ఆనందం అంశాలు ఉన్నాయి.

నామం– పేరు. ప్రతివస్తువుకూ ఒక పేరు ఉంటుంది.

రూపం– లక్షణం. వాచ్యార్థం తీసుకుంటే ఆకారం లేదా రంగు. కాని ఇక్కడ వస్తువు లక్షణంగా తీసుకోవచ్చు.

**అస్తి భాతి ప్రియం రూపం నామ చేత్యంశపఞ్చకమ్** – ఆ విధంగా, మనం అనుభవించే ప్రతి విషయానికీ సత్, చిత్, ఆనందం, నామం, రూపం అనే ఐదు అంశాలు ఉంటాయి. అన్నీ ఒకేసారి అనుభవించవచ్చు.

**ఆద్యత్రయం బ్రహ్మరూపమ్** – అందులో మొదటి మూడూ బ్రహ్మకు చెందినవి;

**జగద్రూపం తతో ద్వయమ్** – మిగిలిన రెండూ జగత్తుకు చెందినవి.

ఈ ఐదింటిలో బ్రహ్మకు చెందిన మూడూ వికారం చెందవు. కాని సాధారణంగా ఏదైతే మార్పు చెందకుండా, ఎప్పుడూ ఉంటుందో దాన్ని పట్టించుకోము. ఉదాహరణకు చెయ్యి, కాంతి, ఉదాహరణలో కాంతి లేనిదే చెయ్యిని చూడలేము, కాని మనమేం చేస్తున్నాము? కాంతిని వదిలేసి చెయ్యినే చూస్తున్నాము. ఒకవేళ చెయ్యి దానంతట అదే కనిపిస్తే, చీకట్లో కూడా కనిపించాలి కదా. లేదే! అందువల్ల మనకు కాంతి అనుభవం ఉంది, కాని కాంతి గురించిన జ్ఞానం లేదు. మనకు తెలియకుండా అనుభవిస్తున్న దాని గురించి తెలుసుకునేలా చేయటమే ఈ బోధయొక్క ఉద్దేశం. అదే సూత్రం బ్రహ్మకు కూడా వర్తిస్తుంది. మనకు బ్రహ్మ అనుభవం ఉంది, కాని బ్రహ్మ అనుభవజ్ఞానం లేదు. అది కలగజేసేదే ఈ శ్లోకం.

ఇదే అంశాన్ని విద్యారణ్యులవారు పంచదశిలోని పదవ అధ్యాయంలో వివరిస్తారు. ఒక నాటకం జరిగి, అందులో వేసిన పాత్రధారులు లోపలికి వెళ్ళిపోయాక, ఎవరైనా స్టేజీమీద ఏం ఉందంటే, ఏమీ లేదు లేదా ఎవరూ లేరు అనేస్తాము. కాని నిజానికి అక్కడ ఒకటి ఉంది. ఏమిటది? కాంతి. ఆ కాంతి వల్లనే ఆ పాత్రధారుల నటనను చూడగలిగాము. ఆ కాంతివల్లనే ఇప్పుడు ఎవరూ అక్కడ లేరని చెప్పగలుగుతున్నాము. కాంతి అంత ప్రముఖపాత్ర వహిస్తున్నా,

దాన్ని ఎందుకు పట్టించుకోవటం లేదు? ఎందుకంటే అది మార్పులేకుండా, ఒకలాగే ఉంది. అలాగే గదిలో ఆకాశం ఉన్నా, గదిలో ఏముంది అంటే అన్నీ చెప్తాము కాని ఆకాశం ఉంది అనము. సైకాలజీ ఏమిటంటే కదలకుండా, మారకుండా ఉన్నదాన్ని పట్టించుకోము. కదిలే దాన్నే పట్టించుకుంటాము.

అస్తి, భాతి, ప్రియం అనేవి బ్రహ్మరూపం. అవి కదలకుండా, మారకుండా ఉంటాయి. నామరూపాల్లో ఎంతో విభిన్నత ఉంది. క్షణక్షణం అవి మారతాయి. వాస్తవం అయిన బ్రహ్మరూపాన్ని పట్టించుకోకుండా, మాయికం అయిన భిన్నత్వంలో మమేకం చెందుతాము. బ్రహ్మ, మాయల మధ్య ఫ్యాషన్ షో పెడితే మాయే గెలుస్తుంది. ఎందుకంటే మాయ (జగత్తు)లో భిన్నత్వం ఉంది, మనస్సును అలరిస్తుంది. అలా భిన్నత్వం ఉన్నా అది శాంతిని ఇవ్వలేదు. అది మాయికం అని గ్రహించాలి. కాని మాయికం ఆకర్షించినంతగా వాస్తవం ఆకర్షించదు. మాయ కార్డ్‌బోర్డు కుర్చీలాంటిదని మర్చిపోకూడదు. అది అన్నివిధాలా బాగుంటుంది కాని కూర్చోవటానికే పనికిరాదు. మాయకూడా అలాంటిదే. అన్నివిధాలా బాగుంటుంది కాని, దానిమీద ఆధారపడటానికి పనికిరాదు.

మాయని చూసి ఆనందించాలి కాని, బ్రహ్మమీద ఆధారపడాలి. నామరూప జగత్తుమీద ఆధారపడకుండా సచ్చిదానంద బ్రహ్మమీద ఆధారపడాలి.

సత్, చిత్, ఆనందం మూడూ బ్రహ్మరూపం, అవి మారవు అన్నాం కాని ఆనందం మారుతుంది కదా అని అడగవచ్చు ఎవరన్నా. ఇవాళ ఉన్న ఆనందం రేపు ఉండదు, ఒక వస్తువు ఇవాళ కలుగజేసిన ఆనందాన్ని రేపు కలుగజేయదు. మరెలా శాశ్వతం అని చెప్పగలం? ఆనందం రెండు రకాలు – కోశానందం, బ్రహ్మానందం. ఇప్పుడు ప్రశ్నించిన ఆనందం కోశానందం. అది మనస్సులో కలుగుతుంది. అది బాహ్యవస్తువులవల్ల మనస్సులో అనుభవించే ఆనందం. మనస్సు మారుతూ ఉంటుంది కాబట్టి, దానిలో కలిగే ఆనందం కూడా సహజంగానే మారుతుంది. దీన్ని ప్రతిబింబ ఆనందం అంటారు. ఇక్కడ మనం చెప్పే ఆనందం బ్రహ్మానందం, బింబ ఆనందం. నేను ఆనందస్వరూపాన్ని. అది మారదు. ఎలాగైతే శుద్ధసత్‌ను, శుద్ధచిత్‌ను అనుభవించలేమని అంతకుముందు

అన్నామో, అలాగే శుద్ధ ఆనందాన్ని కూడా అనుభవించలేము. దాని ప్రతిబింబిత ఆనందాన్ని కోశానందంగా అనుభవించగలము.

**శ్లోకం-21**

**ఖవాయ్వగ్నిజలోర్వీషు దేవతిర్యఙ్నరాదిషు।**
**అభిన్నాః సచ్చిదానన్దాః భిద్యేతే రూపనామనీ॥**

సాంఖ్యదర్శనంలో, ప్రతి జీవిలోనూ ఆత్మ, అనాత్మ రెండూ ఉంటాయి. ఆత్మను పురుషుడు అనీ అనాత్మను ప్రకృతి అనీ అంటారు. అంతవరకూ అద్వైత వేదాంతానికి దగ్గరగానే ఉంటుంది వారిది. అందుకే వేదాంతాన్ని సాంఖ్య అని కూడా అంటారు. కాని ఆత్మ దగ్గరకి వచ్చేసరికి, వారి వాదన మారుతుంది. వారు ఎన్ని శరీరాలు ఉంటే అన్ని ఆత్మలు ఉన్నాయంటారు, అంతేకాదు నీ ఆత్మ, నా ఆత్మ కూడా సర్వవ్యాపకం అంటారు.

ఈ శ్లోకంద్వారా ఆత్మ ఒకటే అనీ, అది సర్వవ్యాపకం అనీ తెలుస్తుంది. ఒకటే ఆత్మ అన్నప్పుడు నీ శరీరంలోనూ, నా శరీరంలోనూ ఉన్నది ఒకటే ఆత్మ అవుతుంది.

**అభిన్నాః సచ్చిదానందాః** – ఉన్నదొకటే సత్

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్ – ఛాందోగ్యమ్**

అలాగే చైతన్యం కూడా ఒకటే. ఆనందం కూడా ఒకటే. అంటే మూడు బ్రహ్మలు ఉన్నాయా అని అనుమానం రావచ్చు – ఒక సర్వవ్యాపకమైన సత్, ఒక సర్వవ్యాపకమైన చిత్, ఒక సర్వవ్యాపకమైన ఆనందం – మూడు అవుతాయా? వివరణకోసం అలా చెప్పబడింది అంతే – బహ్మకు సర్వవ్యాపకమైన మూడు గుణాలు విడివిడిగా లేవు. సత్తే చిత్, చిత్తే సత్, సత్తే ఆనందం, ఆనందమే చిత్.

సత్ = చిత్ = ఆనందం

సత్ = చిత్ అన్నప్పుడు ఒక సందేహం రావచ్చు. క్లిప్ ఈజ్ అన్నాము అంటే క్లిప్పులో సత్ ఉంటే, చిత్ కూడా ఉండాలి కదా! సత్తే చిత్, చిత్తే సత్ అంటున్నాము కదా. అవును చిత్ కూడా ఉంది. అప్పుడు యింకో ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఏమిటది? చిత్ కూడా ఉంటే అది జడవస్తువు ఎలా అయింది? దానికి జవాబు చైతన్యం ఉంది కాని, అది ప్రకటితమవటం లేదు.

దీనికి ఒక ఉదాహరణ చూద్దాము. రెండు బర్నర్లు ఉన్న ఒక స్టవ్‌మీద ఒకవైపు గిన్నెలో నీళ్ళు, ఇంకోవైపు ఒక ఇనుపరాడ్ పెట్టారనుకుందాము. అగ్నికి రెండు లక్షణాలు ఉన్నాయి. కాంతి, ఉష్ణం. కాని ఈ రెండు లక్షణాలు, రెండింటిలోనూ ప్రకటితమవవు. స్టవ్‌యొక్క మంట నీటినీ, రాడ్‌నూ రెండింటినీ వేడిచేస్తుంది కాని నీటిలో ఉష్ణం మాత్రమే తెలుస్తుంది, కాంతి తెలియదు. అదే రాడ్ విషయానికి వచ్చేసరికి దాంట్లో ఉష్ణమూ తెలుస్తుంది, ఎఱ్ఱటి కాంతీ తెలుస్తుంది. అంటే మాధ్యమంవల్ల లక్షణం ప్రకటితమవుతుంది. అందువల్ల క్లిష్టంలో సత్ ప్రకటితమవుతుంది కాని చిత్ ప్రకటితమవదు. అదే శరీరానికి వచ్చేసరికి సత్, చిత్ రెండూ ప్రకటితమవుతాయి. ఔపాదిక భేదః న తు వస్తుభేదః

**భిద్యేతే రూపనామనీ –** మామూలుగా నామరూపాలు అని వస్తుంది కాని ఇక్కడ రూపనామాని అని వచ్చింది. భిద్యేతే అంటే మారుతాయి. ఎక్కడ మారుతాయి? అది మొదటిపాదంలో వస్తుంది.

**ఖవాయ్వగ్నిజలోర్వీషు –** సచ్చిదానందం జగత్తులోని జడ వస్తువుల్లోనూ, చేతన వస్తువుల్లోనూ సమానంగా ఉంది. జడ వస్తువులు పంచభూతాలైన ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథ్వీద్వారా సూచించబడ్డాయి.

**దేవతిర్యఙ్నరాదిషు –** చేతన వస్తువులను మూడు స్థాయిల్లో చూస్తాము. ఉత్తమస్థాయిలో దేవతలు, అధమస్థాయిలో జంతువులు, మధ్యస్థాయిలో మనుష్యులు. వాటియొక్క నామరూపాలు వాటిని భిన్నంగా చేస్తున్నాయి. సచ్చిదానందం సత్యం, నామరూపాలు మిథ్య.

సత్యానృత భేదం స్పష్టంగా తెలియాలి కాని, భేదం తెలియకపోవటానికి కారణం– ఆవరణశక్తి పని చేయటమే. ఆవరణశక్తి పని చేస్తోందని ఎలా తెలుస్తుంది? ఎప్పుడైతే నేను నామరూపాల జగత్తునుంచి సహాయం కోరానో, అప్పుడే నేను సత్యం, మిథ్యలను కలిపినట్టు. నామరూపాల జగత్తువల్ల జరిగిన అనుభవాలు నన్ను కుదిపి వేసినా, దానినుంచి ఆధారం కోరితే తప్పు. అంటే నేను తప్పుగా ఆలోచించినట్టే! కాని నాకేం అభ్యంతరం లేదు అని నేను అంటే ఎవరూ నన్ను బాగుపరచలేరు. కార్డుబోర్డు కుర్చీమీద కూర్చుంటానంటే, నీ యిష్టం కూర్చో, కింద పడు అంటారు.

వీటిని మనం పొరపాటుగా చూస్తున్నాము కాబట్టే మిథ్యా జగత్తునుంచి భద్రత, శాంతి, ఆనందాలు కోరుతున్నాము. శాశ్వతమైన ఉనికే లేని జగత్తు మనకు శాశ్వతమైన భద్రతను కాని ఆనందాన్ని కాని ఎలా ఇవ్వగలదు? అది ఇవ్వలేదని తెలియక మనం కోరుకున్న భద్రత రాకపోయేసరికి అశాంతి పాలవుతున్నాము. ఇందులో జగత్తు తప్పు గాని, పరమాత్మ తప్పు గాని లేదు. ఏది శాశ్వతమో, ఏది అశాశ్వతమో తెలుసుకోలేని మనదే తప్పు. అందుకని ఆవరణశక్తిని తొలగించుకుని, సత్యం – మిథ్యల వివేకం పొంది, సంసారాన్ని తప్పించుకుని, శాంతి పొందాలి.

ఈ శ్లోకంతో దృక్దృశ్య వివేకంయొక్క ముఖ్యమైన అంశం ముగిసింది. సంసారానికి కారణం ఏమిటి, దాని పరిహారం ఏమిటి? సంసారానికి కారణం సత్యం – మిథ్యల అవివేకం, దానికి పరిహారం సత్యం – మిథ్యల వివేకం. అది వేదాంత శ్రవణమననంద్వారా జరుగుతుంది. వ్యష్టిపరంగా నేను ఆనందస్వరూపుడిని అని, సమష్టిపరంగా మిథ్యాప్రపంచం నాకు భద్రతనివ్వదని తెలుసుకుంటాను. ఇదే విషయాన్ని వివరించటానికి శ్రీకృష్ణపరమాత్మ రెండు విశేషణాలను ఉపయోగించాడు. వ్యష్టిపరంగా నిత్యతృప్తః అనీ సమష్టిపరంగా నిరాశ్రయః అనీ అన్నాడు.

**4. నిదిధ్యాసనం, దాని ఫలం – 22–31** ఈ శ్లోకాలలో తరువాత అంశం వస్తుంది. వేదాంత శిష్యులు ఎక్కువగా ఒక సమస్యను ఎదుర్కొంటారు. వారు వేదాంతాన్ని అధ్యయనం చేసి, వేదాంతాన్ని బాగానే అర్థం చేసుకుంటారు. మిథ్యను వదిలేసి సత్యాన్ని పట్టుకోవాలి అన్నది కూడా బాగానే ఆకళింపు చేసుకుంటారు. కాని, వచ్చిన చిక్కేమిటంటే బుద్ధికి సమస్య, దాని పరిష్కారం అర్థమయ్యాయి, కాని మనస్సు మాట విననంటోంది. దాన్ని ఆచరణలో పెట్టలేకపోతోంది. అందువల్ల తార్కిక బుద్ధి అర్థం చేసుకున్న జ్ఞానానికీ, భావోద్రేకానికి లోనయ్యే మనస్సు ప్రవర్తించే తీరుకూ హస్తిమశకాంతరం అంత తేడా ఉంది. బుద్ధిపరంగా అంతా బాగా అర్థమయింది. కాని తదనుగుణంగా అనుభవం కలగటం లేదు. మనస్సులో పేరుకుపోయిన రాగద్వేషాలు,

కామక్రోధాలు, చికాకులు, బెంగలు– ఏవీ ఏమాత్రమూ తగ్గటం లేదు. కొంతమంది, దానికి కారణం బ్రహ్మ అనుభవం పొందకపోవటంవల్ల అనుకుంటారు.

బ్రహ్మ అనుభవం పొందే బాహ్యవస్తువు కాదు, బ్రహ్మ నువ్వే అని నేర్చుకుంటాం నిజానికి.

**ఎవర్ ది ఎక్స్‌పీరియెన్సర్, నెవర్‌ది ఎక్స్‌పీరియన్స్‌డ్**

**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

సమస్య ఎక్కడంటే, మనం నేర్చుకున్న జ్ఞానాన్ని జీర్ణించుకోవటం లేదు. ఈ జీర్ణించుకోవటం ముఖ్యం. కాఫీలో పంచదార తక్కువయ్యిందని నాలుగైదు చెంచాల పంచదార వేసుకున్నా అది తియ్యగా ఉండదు. ఎందుకు? ఒక్క చెంచా వేసినా దాన్ని బాగా కాఫీలో కలిసిపోయేలా కలిపితేనే, పంచదార తియ్యదనం దానికి అంటుకుంటుంది. అలాగే బోధను అంతర్గతం చేసుకోకపోతే, అది కేవలం జ్ఞానం పెంపొందించుకున్నట్టు అవుతుంది.

అంతర్గతం చేసుకోవాలంటే నిదిధ్యాసనం చేయాలి. శ్రవణంలో జ్ఞానం కలుగుతుందనీ, మననంలో నిశ్చయజ్ఞానం కలుగుతుందనీ చూశాము. నిదిధ్యాసనంలో జ్ఞాననిష్ఠలో ఉంటాము. నేర్చుకున్న విషయంలోనే రమిస్తూ, దానికే సమయాన్నంతా కేటాయించాలి. నిదిధ్యాసనం అంటే మనస్సును శూన్యం చేయటమో, నిర్వికల్ప సమాధికి వెళ్ళటమో కాదు. ఇది ఒకలాంటి ధ్యానం కాని, మామూలు ధ్యానంలాంటిది కాదు. స్థిరసుఖ ఆసనంలో కూర్చోవటం, పద్మాసనం వేయటం, నిటారుగా కూర్చోవటం లాంటివి ముఖ్యమైన అంశాలు కావు. అలా కూర్చోవచ్చు కాని, అదే ముఖ్యం కాదు. ఇక్కడ మనస్సు ప్రధానపాత్ర వహిస్తుంది.

నేర్చుకున్న అంశాన్ని జీర్ణించుకోవాలి అనుకున్నాము కదా! అది ఎలాగన్నా చేయవచ్చు. సముద్రపుటొడ్డున నడుస్తూ కూడా నేర్చుకున్న విషయాన్నే తలచుకోవచ్చు. లేదా పదే పదే శ్రవణం చేయవచ్చు లేదా చదవవచ్చు లేదా ఎవరితోనన్నా చర్చించవచ్చు లేదా బోధ చేయవచ్చు. కాని నిదిధ్యాసనానికీ, శ్రవనానికీ భేదం ఉంది. శ్రవణంలో బ్రహ్మ లేదా ఆత్మ పదాలు వచ్చినప్పుడు, అవి బాహ్యవస్తువులనీ, వాటి సాక్షాత్కారం మనం ధ్యానంలోనో మరే సాధనలోనో

పొందాలనీ ఎదురుచూస్తాము. ఇన్నాళ్ళు మనం పొందిన లౌకికజ్ఞానం పద్ధతి ఇది. ఒక వస్తువు గురించి విని, దాని అనుభవం తర్వాత పొందాలనుకుంటాము. కాని ఆత్మ బాహ్యవస్తువు కాదు, అది మనమే. అందువల్ల ఆత్మజ్ఞానం పొందాక, ఆత్మసాక్షాత్కారం పొందాలనుకుంటే లాభం లేదు.

ఇప్పుడు ఒక అల, అలలన్నింటిలోనూ నీరు ఉంది, సముద్రంలోనూ నీరు ఉంది అనుకుంటే చాలదు. నాలోనూ అదే నీరు ఉంది అని తెలుసుకోవాలి. అలా తెలుసుకోకపోతే మిగతా అన్నింటిలోనూ నీరు ఉంది కాని నేను చిన్న అలనే అనుకుంటుంది. అలాగే ఆత్మ సర్వవ్యాపకం అని నేర్చుకుంటే చాలదు. నేను అల్పజీవినే అనుకుంటాను. నేను సర్వవ్యాపకమైన ఆత్మను అని జీర్ణించుకోవాలి. కాకపోతే ఆ నేను ఎవరన్నది మర్చిపోకూడదు. నేను దృక్ 3ని అంటే సాక్షిని.

ఇంకో విషయం కూడా అర్థం చేసుకోవాలి. నేను ఈ నిదిధ్యాసనంవల్ల ముక్తిని పొందబోవటం లేదు. నేను ముక్తి పొందుతాను అనుకుంటే నాకు బోధ సరిగ్గా అర్థం కానట్టే. మోక్షం సాధ్యవస్తువు కాదు. సిద్ధవస్తువు. నేను నిత్య, ముక్త, శుద్ధ సాక్షిచైతన్యాన్ని. నేను ఎప్పుడో బ్రహ్మను అవటం కాదు. నేను బ్రహ్మనే. అహం బ్రహ్మ అస్మి. ఇప్పుడు నేను ముక్తపురుషుడిని కాకపోతే ఎప్పటికీ కాను. నేను నిత్యముక్తుడిని అంటే ఎప్పటికీ స్వేచ్ఛాజీవినే. అంటే నిదిధ్యాసనంలో కూడా ముక్తపురుషుడినే. అందువల్ల నేను నిదిధ్యాసంలో కూర్చునప్పుడు, నేను నిదిధ్యాసనం చేస్తున్నది స్వేచ్ఛ పొందటానికి కాదు, నేను అంతకుముందూ, ఇప్పుడూ, ఇకముందు కూడా ముక్తపురుషుడినే అనే సత్యాన్ని స్వీకరించటానికి అని అనుకోవాలి. శ్రవణంలో నేను వేరు, ఆత్మ వేరు అనుకున్నా సమస్య లేదు కాని నిదిధ్యాసనంలో ఆత్మ=నేను అనేది సాధన చేయాలి. ఆత్మకు చెప్పిన లక్షణాలన్నీ నాకు ఆపాదించుకోవాలి.

**శ్లోకం- 22**

**ఉపేక్ష్య నామరూపే ద్వే సచ్చిదానన్దతత్పరః।**
**సమాధిం సర్వదా కుర్యాద్-హృదయే వాఽథవా బహిః॥**

నిదిధ్యాసనానికి ఉన్న అనేక రకాల్లో, ఇక్కడ ఒక పద్ధతి చూస్తాము. దాన్ని సమాధి అభ్యాస రూప నిదిధ్యాసనం అంటారు. సమాధి అభ్యాస అంటే బోధమీదే కొంచెం సమయాన్ని కేటాయించటం. ఆ సమయంలో ప్రయత్నపూర్వకంగా అన్ని వ్యవహారాలనుంచి తప్పించుకోవాలి. నేను వేసే అన్ని పాత్రలనుంచి దూరమవాలి. అన్నీ నేను తాత్కాలికంగా వేసే వేషాలే, నా ఆత్మస్వరూపం వేరు అని అందులో రమించాలి.

సమాధి అభ్యాసం చేసి తీరాలా? అది శిష్యుడిని బట్టి ఉంటుంది. శ్రవణం స్థాయిలోనే నేను ఆత్మను, నేను అకర్తా, అభోక్తను అనే విషయాన్ని జీర్ణించుకుని ఆ జ్ఞాననిష్ఠలో ఉండగలిగితే జీవితంలోని ఒడిదుడుకులకు చలించకుండా ఉండగలిగితే అవసరంలేదు. లేకపోతే కావాలి. 'నేను ఆత్మను' అనే నిష్ఠలోకి నిదిధ్యాసనంద్వారా రావాలి.

అంతకు ముందు శ్లోకంలో చూసిన ఐదు అంశాలను నిదిధ్యాసనంలో గుర్తుకు తెచ్చుకోవాలి. అస్తి, భాతి, ప్రియం (మారనివి), నామం, రూపం (మారేవి) కలిసి ఉంటాయి ప్రతి అనుభవంలోనూ. మారే నామరూపాలను పక్కన పెట్టి మారని, నిత్యమైన అస్తి,భాతి, ప్రియం గురించి ఆలోచించాలి. అస్తి భాతి ప్రియం అంటే సత్, చిత్ ఆనందం. అంటే అనంతమైన శుద్ధసత్తా, శుద్ధచిత్. అది నేనే. నేను అంటే దృక్ 3 (సాక్షిచైతన్యాన్ని) అని ఎన్నడూ మర్చిపోకూడదు. ఆ విధంగా నామరూపాలను పక్కన పెట్టి నా సచ్చిదానంద రూపంలో రమించాలి.

**సచ్చిదానన్దతత్పరః** – నిదిధ్యాసనం సచ్చిదానంద బ్రహ్మమీద చేయాలి. తత్పరః అంటే ఏకాగ్రత చూపాలి. అది ఎలా చేయాలి?

**ఉపేక్ష్య నామరూపే ద్వే** – సచ్చిదానందతో కలిసిన నామరూపాలను విడదీయాలి. విడదీయటమంటే ప్రత్యక్షంగా విడదీయలేము. కాంతిని చూడాలంటే స్వచ్ఛమైన కాంతిని చూడలేము. దాన్ని ప్రతిబింబించే చెయ్యి లాంటి మాధ్యమాన్ని తీసుకుని, మూడు దశల్లో విడదీయాలి. అవి –

1. ముందు చేతిని చూస్తాము.
2. చెయ్యిని చూడగలుగుతున్నామంటే కాంతి వల్లే అని తెలుసుకోవాలి.
3. చెయ్యిని చూడకుండా, దాన్ని ప్రతిబింబింపచేసే కాంతినే చూడాలి.

అలాగే ఒక వస్తువును చూస్తే 5 అంశాలు ఉంటాయి.

అస్తి, భాతి, ప్రియం, నామం, రూపం.

ఉపేక్ష్య – అందులోంచి రెండు – నామం, రూపాలను పట్టించుకోకూడదు.

**తత్పరః –** మిగిలిన మూడింటిమీద అంటే ఆస్తి, భాతి, ప్రియం (సత్, చిత్, ఆనందం)మీద ఏకాగ్రత చూపాలి.

**సమాధిం కుర్యాత్ –** నిదిధ్యాసనం చేయాలి. ఎన్నిసార్లు?

**సర్వదా –** ఎప్పుడూ చేయాలి. వ్యవహారం నడిపేటప్పుడు నామరూప ప్రధానంగా ఉంటుంది, సమాధిలో సచ్చిదానంద ప్రధానంగా ఉంటుంది.

**హృదయే వాఽథవా బహిః –** ఈ అభ్యాసరూప సమాధిని రెండు రకాలుగా చేస్తారు. హృదయే– ఒకటి హృదయంలో చేస్తారు. ఉదాహరణకు ఒక వృత్తిని (ఆలోచనని) తీసుకోవచ్చు. ప్రతి ఆలోచనకూ పైన చెప్పిన ఐదు అంశాలూ ఉంటాయి. దానిలో కూడా నామరూపాలను పక్కనపెట్టి, సచ్చిదానంద అంశాన్నే తీసుకోవాలి. దీనికి కళ్ళు మూసుకుని ధ్యానం చేయాలి.

అథవా బహిః – రెండో రకం ధ్యానం బాహ్యవస్తువుమీద. ఏదైనా బాహ్యవస్తువును తీసుకుని, దానిలో మారని అంశంమీద ధ్యానం చేయాలి. ఇది కళ్ళు తెరిచి చేసే ధ్యానం.

ఆ బాహ్యవస్తువుతో మీకు అనుబంధం లేనిది అయితే మంచిది. ఉదాహరణకు, మీరు మీ అమ్మాయిమీదో, అబ్బాయిమీదో కూడా చేయవచ్చు. కాని వారిమీద చేసేసరికి, వారిమీదకు ఆలోచనలు ఎక్కువగా వెళ్లిపోతాయి. నిదిధ్యాసనంలోకి రావటం కష్టమవుతుంది. అందుకని ఒక కుండో, ఒక వస్తువో తీసుకుంటే మంచిది. చాలా అందమైన సిద్ధాంతం ఇది.

దీనితో మొదటి స్థాయి ముగిసింది.

**అభ్యాసరూప నిదిధ్యాసనం – ఆంతరం, బాహ్యం.**

**శ్లోకం– 23**

**సవికల్పో నిర్వికల్పః సమాధిర్ద్వివిధో హృది।**
**దృశ్యశబ్దానువేధేన సవికల్పః పునర్ద్విధా॥**

ఆరు రకాల సమాధులను ఒక పట్టిక రూపంలో చూస్తాము ఇక్కడ. మొదట సమాధి బాహ్యంగా, ఆంతరంగా విభజింపబడింది. మళ్ళీ ఆంతర సమాధి

సవికల్పం, నిర్వికల్పంగా విభజించబడింది. మళ్ళీ అంతర సవికల్పం శబ్దపరంగా, దృశ్యపరంగా విభజింపబడింది. అలాగే బాహ్యసమాధి సవికల్పంగా, నిర్వికల్పంగా విభజింపబడింది. మళ్ళీ బాహ్యసవికల్పం శబ్దపరంగా, దృశ్యపరంగా విభజించబడింది.

ఈ ఆరు ఈ విధంగా వస్తాయి–

**1. ఆంతరదృశ్య అనువిద్ధ సవికల్ప సమాధిః**

**2. ఆంతరశబ్ద అనువిద్ధ సవికల్ప సమాధిః**

**3. ఆంతర నిర్వికల్ప సమాధిః**

**4. బాహ్యదృశ్య అనువిద్ధ సవికల్ప సమాధిః**

**5. బాహ్యశబ్ద అనువిద్ధ సవికల్ప సమాధిః**

**6. బాహ్యనిర్వికల్ప సమాధిః**

**సవికల్పో నిర్వికల్పః సమాధిర్ద్వివిధో హృది –** ఇక్కడ రెండో స్థాయి చూస్తాము. ఆంతరసమాధి రెండుగా విభజించబడింది. సవికల్పసమాధి, నిర్వికల్ప సమాధి. అలాగే బాహ్యసమాధి కూడా తీసుకోవాలి.

**సవికల్పఃపునర్ద్విధా –** ఆంతర సవికల్పసమాధి, బాహ్యసవికల్పసమాధి. ఇవి మళ్ళీ రెండుగా విభజించబడ్డాయి.

**దృశ్యశబ్దానువేధేన –** అవి దృశ్య సవికల్ప సమాధి, శబ్ద సవికల్ప సమాధి.

శబ్దసవికల్పసమాధి అంటే శ్రవణ, మననాల్లో నేర్చుకున్న వాటిలో, వ్యక్తిగతంగా చాలా శక్తివంతమైన పదాలు – సాక్షి, సత్యం, నిత్యం, అధిష్ఠానం లాంటివి– తీసుకుని వాటిమీద ధ్యానం చేయాలి. దృశ్య సవికల్ప సమాధిలో, ఏదైనా వస్తువును సహాయంగా తీసుకుంటారు. అంతకుముందు చెయ్యి చూపించి ఇక్కడేముంది అంటే చెయ్యి+కాంతి అని చెప్పగలగాలి అని చూశాము కదా. ఇప్పుడు ఆ కాంతిని చూడటానికి చెయ్యిని చూడాలి కాసేపు. తర్వాత చేతిని తీసేసినా, అక్కడే ఉండే, కనిపించని కాంతిమీద ఏకాగ్రత చూపాలి.

చెయ్యి తీసేసినా, కాంతిని చూడగలిగితే అది నిర్వికల్ప సమాధి అవుతుంది. అలాగే, ముందు ఒక ఆలోచన కాని, ఒక పదం గాని తీసుకుని

దానిమీద ధ్యానం చేస్తూ, నెమ్మదిగా దాని వెనుకనున్న కదలని సచ్చిదానంద బ్రహ్మమీద ధ్యానం చేయాలి. దీనితో రెండవ స్థాయి ముగిసింది.

## శ్లోకం– 24

**కామాద్యాశ్చిత్తగా దృశ్యాస్తత్సాక్షిత్వేన చేతనమ్।**
**ధ్యాయేద్దృశ్యానువిద్ధోఽయం సమాధిః సవికల్పకః॥**

ఇక్కడ్నుంచి ఆరు సమాధులను ఎలా సాధన చేయాలో చూస్తాము. 24,25,26 మొదటి మూడు సమాధుల గురించి చెప్తే 27,28,29 తక్కిన మూడింటి గురించి చెప్తాయి. ఈ సమాధి పేరు **ఆంతరదృశ్య అనువిద్ధ సవికల్ప సమాధి.** మనసులో అనేక ఆలోచనలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. వాటన్నింటినీ సాక్షీభూతంగా ఒకటి చూస్తుంది. ఆ కదిలే ఆలోచనలను, కదలకుండా చూసే సాక్షిమీదకు మన దృష్టిని మరలింపజేసే ధ్యానం ఇది.

దీన్ని సవికల్ప సమాధి అంటారు. అంటే ఆలోచనలు ఉంటాయి, ఆలోచనలను పారద్రోలనక్కరలేదు. ధ్యానం అంటే ఆలోచనలను పారద్రోలాలనుకుంటారు చాలా మంది.అది చాలా కష్టం. ఇక్కడ ఆలోచనలు ఉంటాయి. ఈ ధ్యానం గొప్పదనం అదే.

దీనికి ఒక ఉదాహరణను చూడండి. ఒక గదిని ఊహించుకోండి. ఆ గదిలో దేదీప్యమానంగా వెలిగే ఒక బల్బు ఉందనుకోండి. దాని కాంతి గదంతా పరచుకుని ఉంది. ఆగదిలో అనేకమంది మనుష్యులు వస్తున్నారు, వెళుతున్నారు. వారి చేతుల్లో ఏవో వస్తువులు తీసుకువస్తున్నారు. తీసుకు వెళుతున్నారు. గదిలో ఉన్న కాంతి సర్వవ్యాపకంగా ఉంది. అది వచ్చి పోయే మనుష్యులనూ, వస్తువులనూ ప్రకాశింపజేస్తోంది. ముందు ఆ వచ్చి పోయే మనుష్యులను చూడండి. వారిని చూపిస్తున్న కాంతిని పట్టించుకోకండి. ఇప్పుడు నెమ్మదిగా వస్తువులు, మనుష్యులనుంచి దృష్టిని కాంతికి మళ్ళించండి. కాంతి అనుభవం అంతకు ముందు కూడా ఉంది కాని, ఆ కాంతిని పట్టించుకోరు. ఇప్పుడు కాంతిని చూడటమే కాదు, కాంతికీ, మనుష్యులకూ మధ్య ఉన్న భేదాలను గమనించండి.

| **మనుష్యులు** | **కాంతి** |
|---|---|
| మనుష్యులు, వస్తువులు అనేకం | కాంతి ఏకం |
| మనుష్యులు వచ్చిపోతున్నారు | కాంతి శాశ్వతం |
| మనుష్యులు ఒకరికి భిన్నంగా ఒకరు ఉన్నారు | కాంతి అభిన్నం |
| మనుష్యులకు నామరూపాలు ఉన్నాయి | కాంతికి లేదు |
| గదిలో మట్టివల్ల మనుష్యులు అశుద్ధం అవుతారు | కాంతి శుద్ధం |
| మనుష్యులు సవికల్పం | కాంతి నిర్వికల్పం |

ఆ విధంగా కాంతిమీద దృష్టిపెడితే, కాంతి ప్రత్యేక లక్షణాలు తెలుస్తాయి. ఆ లక్షణాలను ఈవిధంగా వివరించవచ్చు.

- కాంతి పుస్తకంలో ఒక భాగం గానీ, లక్షణంగానీ, దానినుంచి ఉత్పత్తి అయిన వస్తువుగానీ కాదు.
- కాంతి స్వతంత్రవస్తువు. అది పుస్తకం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తుంది.
- కాంతి, పుస్తకం సరిహద్దులకే పరిమితమవలేదు.
- కాంతి, పుస్తకం నాశనమయితే నాశనమవదు. పుస్తక పతనానంతరం కూడా కాంతి ఉంటుంది.
- కాంతి, పుస్తకం లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమంలేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన కాంతి లేనట్టు కాదు.

ఇది కాంతి సమాధి.

ఇదే సూత్రాన్ని అంతర్గతంగా సాధన చెయ్యండి. గది, కాంతి, ఉదాహరణలో గది బదులు, మనస్సు. వచ్చిపోయే మనష్యులు, వస్తువులూ బదులు, సముద్రంలో ఎగసిపడే అలల్లాగా, మీ మనస్సులో ఎగసిపడే వృత్తులు లేదా ఆలోచనలు. అవి కోరికలు, కోపంలాంటి ఆలోచనలు. ఈ ఆలోచనలు జడం అయినా అవి తెలుస్తున్నాయంటే కారణం, వాటికి భిన్నంగా ఉండి, వాటిని చూస్తున్నది వేరే ఏదో ఉంది. అదే చైతన్యతత్త్వం లేదా సాక్షితత్త్వం. పై ఉదాహరణలో

లాగే ముందు వచ్చిపోయే ఆలోచనలను చూడండి. ఇప్పుడు నెమ్మదిగా ఆలోచనలనుంచి దృష్టిని చైతన్యానికి మళ్ళించండి. ఇప్పుడు చైతన్యానికీ, ఆలోచనలకూ మధ్య ఉన్న భేదాలను గమనించండి.

| **ఆలోచనలు** | **చైతన్యం** |
|---|---|
| ఆలోచనలు వచ్చి,పోతున్నాయి | చైతన్యం వచ్చిపోయేది కాదు. |
| ఆలోచనలు మనస్సంతా ఆక్రమించవు, అవి కేవలం అలల్లాంటివి | చైతన్యం సర్వవ్యాపకం |
| ఆలోచనలకు రూపం ఉంటుంది, | చైతన్యానికి రూపం లేదు |
| కుండ ఆలోచన, పుస్తకం ఆలోచన మొ॥ ఆలోచనలను విభజించవచ్చు | చైతన్యాన్ని విభజించలేము |
| ఆలోచనల్లో కాలుష్యం ఉంటుంది | చైతన్యానికి ఆ కాలుష్యం అంటదు. అది శుద్ధం. |

ఆ విధంగా సాక్షిచైతన్యం, దాని లక్షణాలమీద దృష్టి పెట్టాలి. ఏదైనా ఉదాహరణ తీసుకుంటే, అది ఎంత మేరకు సరిపోతుందో అంతమేరకే తీసుకోవాలి. కాంతి, చెయ్యి, ఉదాహరణలోని కాంతికీ, చైతన్యానికీ ఒకటే ముఖ్యమైన భేదం ఉంది. కాంతి మీకన్నా భిన్నంగా ఉన్న వస్తువు. కాని చైతన్యం మీకు భిన్నంగా లేదు. అది మీరే. అందుకని నిదిధ్యాసనం చేసేటప్పుడు ఈ చైతన్యాన్ని బాహ్యవస్తువుగా చూడకూడదు. అది నేనే అని మీరు తెలుసుకోవాలి. ధ్యానం చేసేటప్పుడు,'నేను ప్రతి ఆలోచనను ప్రకాశింపజేస్తున్నాను; ఆలోచన వచ్చిపోయినా నేను ఉన్నాను; రెండు ఆలోచనల మధ్య ఏర్పడే శూన్యం కూడా నాకు తెలుస్తోంది,' అనుకోవాలి. అంటే మూడు దశల్లో సాగాలి మీ నిదిధ్యాసనం. ముందు ఆలోచనలమీద దృష్టి పెట్టాలి, తర్వాత సాక్షికి రావాలి, తర్వాత 'నేను'కి రావాలి. నేను సాక్షిగా ఆలోచనలను చూస్తున్నాను అనుకోగలిగితేనే నిదిధ్యాసనం పూర్తి అయినట్టు.

**చిదానన్ద రూపః శివోఽహం శివోఽహమ్॥ – నిర్వాణషట్కమ్**

ఇది నిదిధ్యాసనానికి అత్యద్భుత శ్లోకం.

దీనికి ఇంకో ఉదాహరణ ఆకాశం. దీన్ని కూడా మూడు దశల్లో చూస్తాము.

1. ఈ గదిలో ఆకాశం ఉంది.
2. ఆకాశం ఈగదిలోనే కాదు, బయట కూడా ఉంది.
3. ఆకాశం అంతటా ఉంది. నిజానికి ఆకాశంలోనే గదులన్నీ ఉన్నాయి.

ఇప్పుడు ఇదే సూత్రాన్ని సాక్షిచైతన్యానికి ఆపాదిస్తాము.

1. నాలో సాక్షిచైతన్యం ఉంది.
2. చైతన్యం నాలోనే కాదు, అందరి మనస్సులోనూ ఉంది.
3. చైతన్యం అంతటా ఉంది. నిజానికి చైతన్యంలోనే అన్ని మనస్సులూ ఉన్నాయి.

అలా కాంతి ఉదాహరణనుంచి, ఆకాశం ఉదాహరణకు రావాలి. బ్రహ్మ, ఆత్మ, సాక్షి లాంటి పదాల చోట 'నేను' పదం చెప్పుకోవాలి. ఆత్మ నిత్యం, శాశ్వతం, శుద్ధం లాటి పదాల చోట నేను నిత్యం, శాశ్వతం, శుద్ధం అనుకోవాలి.

**యతో వా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి। యత్ప్రయన్త్యభిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మేతి। స తపోఽతప్యత స తపస్తప్త్వా।**

దీని బదులు ఇలా అనుకోవాలి

**మయ్యేవ సకలం జాతం । మయి సర్వం ప్రతిష్ఠితమ్ ।**
**మయి సర్వం లయం యాతి । తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్ ॥** కైవల్యం19

నిదిధ్యాసంలో అలా చైతన్యంతో లయమయితే, అహంకారం తగ్గుతుంది.

మనస్సులో వృత్తి (ఆలోచన) రూపంలో అనేక వస్తువులు ఉంటాయి. కోరిక, క్రోధం మొదలైనవి. శ్లోకం 4లో వాటిని చూశాము. అదే మనస్సులో చైతన్యతత్త్వం ఉంది. అది ఈ వృత్తులను ప్రకాశింపజేస్తుంది. చేతికీ, కాంతికీ మధ్య దూరం లేనట్టే, వృత్తులకూ, చైతన్యానికీ మధ్య దూరం లేదు. అవి అలా మిశ్రమంగా కనిపించటంవల్ల మారని చైతన్యాన్ని పట్టించుకోనివ్వకుండా, మారే ఆలోచనలు మీ దృష్టినాకర్షిస్తాయి. ఆ చైతన్యం, ఆ ఆత్మ, ఎప్పుడూ ఉంది, కాకపోతే మీరే దానిమీద శ్రద్ధ చూపటం లేదు.ఎప్పుడూ ఉన్న చైతన్యం వైపుకు మీ దృష్టిని మళ్ళిస్తోంది వేదాంతం.

సాక్షిచైతన్యంమీద దృష్టి పెట్టాలి. సాక్షిచైతన్యంమీద దృష్టి పెట్టాలి అంటే సాక్షిని గురించిన ఆలోచనలను చేయాలి. మనస్సు ఆలోచనలద్వారానే పనిచేస్తుంది. సాక్షి నా మనస్సులో ఉంది. సాక్షి నా ఆలోచనలను ప్రకాశింపజేస్తోంది నుంచి నేనే సాక్షిని లాంటి ఆలోచనలు చేయాలి, ఇలా సాక్షిమీద దృష్టి పెట్టి చేసే ధ్యానాన్ని ఆంతరదృశ్య అనువిద్ధ సవికల్ప సమాధిః అంటారు.

ఇప్పుడు శ్లోకం చూద్దాము–

**కామాద్యాశ్చిత్తగా దృశ్యాః** – మనసులో ఉన్న వస్తువులు, ఒక్కొక్క వృత్తి ఒక్కొక్క దృశ్యం.

**పుత్ర వృత్తి** – దృశ్యం – 1

**పుత్రిక వృత్తి** – దృశ్యం – 2

ఎటువంటి దృశ్యాలు? కామం; సంకల్పం లాంటివి.

**కామః సఙ్కల్పసన్దేహౌ శ్రద్ధాఽశ్రద్ధే ధృతీతరే**
**హ్రీర్ధీర్భీరిత్యేవమాదీన్ భాసయత్యేకధా చితిః 4**

**తత్సాక్షిత్వేన చేతనమ్**– అదే మనస్సులో సాక్షిచైతన్యం కూడా ఉంది. తత్ అంటే ఆ వృత్తిలో. ఈ రెండింటికీ మధ్య ఎంత దూరం ఉంది?

చేతికీ, కాంతికీ మధ్య ఎంత దూరం ఉంది? అంటే అసలు లేదు అని అర్థం. కాకపోతే ఉదాహరణలో చేతిని చూసి, కాంతిని పట్టించుకోనట్టుగా, మనస్సును చూసి, చైతన్యాన్ని పట్టించుకోవటం లేదు. పైగా మనకు బ్రహ్మానుభవం కలగటం లేదనుకుంటున్నాము.

వేదాంతం, ఆ సాక్షి ఎప్పుడూ ఉంది అని చెప్తోంది.

**ధ్యాయేత్** – ఆ సాక్షిచైతన్యంమీద ధ్యానం చేయండి. ఎలా?

**దృశ్యానువిద్ధః** – మనసులో అనేక వృత్తులు లేస్తాయి అని చూశారు కదా. ఇప్పుడు సాక్షి ఆకారవృత్తి ఏర్పరచుకోవాలి. అంటే సాక్షిమీద ఆలోచనలు చేయాలి.

**అయం సమాధిః సవికల్పః** – ఈ ధ్యానం –

**1. ఆంతరదృశ్య అనువిద్ధ సవికల్ప సమాధిః**

## శ్లోకం - 25

**అసఙ్గః సచ్చిదానన్దః స్వప్రభో ద్వైతవర్జితః।**
**అస్మీతి శబ్దవిద్ధోఽయం సమాధిః సవికల్పకః॥**

ఇప్పుడు ధ్యానంలో రెండో రకంలో అడుగుపెడుతున్నాము. దాన్ని **ఆంతరశబ్ద అనువిద్ధ సవికల్ప సమాధి** అంటారు. ముందు దానికీ, దీనికీ మధ్య భేదం ఏమిటి? ఆంతరదృశ్య అనువిద్ధ సవికల్ప సమాధిలో సాక్షిగా ఆలోచనలను చూస్తున్న చైతన్యంమీద దృష్టి పెట్టాలి. చెయ్యి , కాంతి ఉదాహరణలో చెయ్యిద్వారా దాన్ని ప్రకాశింపజేసే కాంతిని చూడటానికి ఎలా వెళ్తామో, అలా ఆలోచనలద్వారా, వాటిని ప్రకాశింపజేసే చైతన్యానికి వెళతాము. చైతన్యానికి ప్రతిబింబ మాధ్యమం ఆలోచన. ఆలోచనలనుంచి, ఆ ఆలోచనలను మనకు తెలియజేసే సాక్షిచైతన్యం వైపుకు పదే పదే దృష్టి నిలపటంద్వారా, మనస్సు ఆలోచనలవల్ల చెదరకుండా, చైతన్యతత్త్వంమీదే నిలబడే శక్తి పొందుతుంది. ఆంతరశబ్ద అనువిద్ధ సవికల్ప సమాధిలో మనస్సును సాక్షిమీద నిలబెట్టాక, సాక్షిలక్షణాలను గుర్తు తెచ్చుకోవాలి. చివరి అంశం ఆ సాక్షిని నేనే అనేది. సాక్షి లక్షణాలేమిటి?

**శబ్ద అనువిద్ధ సమాధిః –** సాక్షి లక్షణాలు చాలానే ఉన్నాయి. ఉపనిషత్తు, భగవద్గీత లేదా ప్రకరణ గ్రంథంలోంచి ఏదైనా పదం తీసుకోవాలి. ఒక్కొక్కరోజు నిదిధ్యాసనంలో ఒక్కొక్క పదం తీసుకోవచ్చు. ఉపనిషత్తుల్లోని పదాలను తీసుకుని సాక్షిమీద దృష్టిని పెట్టాలి కాబట్టి, ఈ ధ్యానాన్ని ఆంతరశబ్ద అనువిద్ధ సవికల్ప సమాధి అంటారు. అంతకు ముందు సమాధిలో సాక్షిని చేరటానికి ఆలోచనలను తీసుకుంటే, ఇక్కడ సాక్షి లక్షణాలను తీసుకుంటాము. అంటే చెయ్యి ప్రమేయం లేకుండా, కాంతిమీద ధ్యానం చేసినట్టన్నమాట.

**అసఙ్గః సచ్చిదానన్దః స్వప్రభః –** మొట్టమొదటిది, ఎంతో శక్తివంతమైన పదం అసంగః. సంగత్వం లేనిది. బృహదారణ్యక ఉపనిషత్తులోని స్వయంజ్యోతి బ్రాహ్మణం లోంచి తీసుకోబడింది ఈ పదం. దుఃఖానికి హేతువు కేవలం రెండు పదాలు– అహం, మమ– నేను, నావారు. ఈ బంధాలు ఏదో ఒకవిధంగా దుఃఖాన్ని కలుగజేస్తాయి. వీటినుంచి మానసికంగా సన్యసించాలి.

నేను సచ్చిదానంద చైతన్యాన్ని అనుకోవాలి. నేను సాక్షిని, నేను సర్వవ్యాపకమైన శుద్ధసత్‌ను, శుద్ధచిత్‌ను, నేను ఆనంద స్వరూపుడను అనుకోవాలి. నేను అనుభవించే ఆనందమంతా నా ప్రతిబింబ ఆనందం లేదా కోశానందం. అది బయటనుంచి వచ్చేదికాదు. నేను బింబ ఆనందాన్ని.

ఈ విషయం పదేపదే అనుకోవాలి. ఎందుకంటే బాహ్యవస్తువుల వెంట పరుగులు తీస్తూ, వాటిలో ఆనందాన్ని వెతుక్కోవాలనుకోవటం సంసారం. ఆనంద స్వరూపుడనైన నేను, కోశానందాన్ని కాను. ఎందుకంటే నేను, ఆనందాన్ని, నేను శాశ్వతం. కోశానందం తాత్కాలికం, బ్రహ్మానందం శాశ్వతం. బింబానందమైన నేను అనుభవంలోకి రాను, నా ప్రతిబింబిత ఆనందం, తాత్కాలికం.

నా ముఖాన్ని నేను చూసుకోలేనట్టే, నా ఆనందాన్ని నేను అనుభవించలేను. నా ముఖాన్ని అద్దంలో ప్రతిబింబంలా చూసుకున్నట్టు, నా ప్రతిబింబిత ఆనందం అనుభవంలోకి వస్తుంది.

జాగ్రదావస్థలోనూ, స్వప్నావస్థలోనూ, సుషుప్తిలోనూ మనస్సును చైతన్యం చూస్తూ ఉంటుంది. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిభూతంగా చూస్తుంది సాక్షిచైతన్యం. మళ్ళీ దాన్ని చూడటానికి ఇంకో అనుభవం అవసరము లేదు. అది స్వయం ప్రకాశకం.

**ద్వైతవర్జితః–** చైతన్యం అనే నేను ఏకం, ద్వైతంలేదు. నేను మనస్సును చూసే సాక్షిని. చూడబడే ఆలోచనలు సాక్ష్యం. నేను సాక్షిని అంటేనే, సాక్ష్యం ఒకటి ఉన్నట్టే. సాక్షి, సాక్ష్యం అని రెండు వస్తువులు చెప్పేసరికి, అది అద్వైతం ఎలా అవుతుందన్న ఆలోచన రావచ్చు.

ఈ ప్రకరణ గ్రంథం పేరు **దృగ్ దృశ్య వివేకము.** సాక్షి, సాక్ష్యం; దృక్, దృశ్యం అలా రెండు ఉంటే ద్వైతవర్జితం ఎలా చేయాలి?

అద్వైతం అర్థం చేసుకోవాలంటే, సాక్ష్యం లేదా దృశ్యం అనుభవంలోకి వచ్చినా, అది మిథ్య అని తెలుసుకోవాలి.కనబడే జగత్తు అన్ని వేళలా ఉండదు కాబట్టి అది మిథ్య. **సత్ అసత్భ్యాం అనిర్వచనీయం మిథ్యా.** ఒక వస్తువు అనుభవంలోకి వచ్చినంత మాత్రాన అది సత్యం అనటానికి లేదు.

స్వప్నంలో ఉన్నంతసేపూ స్వప్నం నిజంగా అనిపిస్తుంది.స్వప్నంలోకి వచ్చి ఎవరైనా ఇది స్వప్నం అంటే నమ్మము. స్వప్నంనుంచి లేచాకే, అది మిథ్య అని తెలుస్తుంది. అలాగే జగత్తు సత్యంగా అనిపిస్తుంది కాని అది మిథ్య. దృశ్యం సాక్ష్యం మిథ్య; దృక్ సాక్షి సత్యం.

ధ్యానంలో సాక్షి బదులు అహం అనుకోవాలి. అప్పుడేమవుతుంది? అహం సత్యం, జగత్తు మిథ్య అవుతుంది. అలా ధ్యానం చేయాలి. నేను, జగత్తూ రెండూ సత్యం అయితే, జగత్తు శక్తివంతమైనది కాబట్టి నన్ను భయపెట్టవచ్చు. జగత్తు సత్యం కాదు మిథ్య అని స్పష్టంగా అర్థమయితేనే, జగత్తు నన్ను భయపెట్టదు. ముఖ్యంగా కాలం, కాలంలో వచ్చే మార్పులూ నన్ను భయపెట్టవు. మిథ్యా ప్రపంచం ఉన్నా లేనట్టే. ఇటువంటి ఉపనిషద్ వాక్యాలను, వాటి అర్థాలను నాకు అన్వయించుకోవాలి. నేను అసంగుడిని,నేను సచ్చిదానంద ఆత్మను అని పదే పదే ధ్యానం చేయాలి. ఈ నిదిధ్యాసనంలో ఆలోచనలు ఉండి తీరుతాయి. ఆలోచనలను ఆపటం ధ్యానయోగం, వేదాంత ఆలోచనలను చేయుటం నిదిధ్యాసనం.

**అస్మీతి శబ్దవిద్ధోఽయం సమాధిః సవికల్పకః** – ఇటువంటి శబ్దాలు అంటే అసంగః, సచ్చిదానంద లాంటి శబ్దాలమీద హృదయంలో ధ్యానం చెయ్యాలి. ఈ ధ్యానం – **2. ఆంతరశబ్ద అనువిద్ధ సవికల్ప సమాధిః.**

**శ్లోకం – 26**

**స్వానుభూతిరసావేశాద్దృశ్యశబ్దావుపేక్ష్య తు।**
**నిర్వికల్పః సమాధిః స్యాన్నివాతస్థితదీపవత్॥**

**ఆంతర నిర్వికల్ప సమాధి** వర్ణన వస్తోంది ఇందులో. 'అహం బ్రహ్మ అస్మి' లాంటి వేదాంత వాక్యాలను నేను ఆలోచనల్లోకి తెచ్చుకుంటున్నప్పుడు, ఆ ఆలోచనను ఆత్మాకారవృత్తి, బ్రహ్మాకారవృత్తి లేదా అఖండాకార వృత్తి అంటారు. సవికల్ప సమాధిలో ఇంతకుముందు చూసిన రెండు దశల్లోనూ, ఈ ఆలోచనలను నేను ప్రయత్నపూర్వకంగా తెచ్చుకుంటాను. ఈ రెండు దశల్లోనూ, ధ్యానం చేసే

వ్యక్తిగా నేను ఉన్నాను. అప్పుడు నేను అక్షరాలా ఉన్నాను, పైగా నా సంకల్పం, నా ప్రయత్నం కూడా అవసరం. ఒక ఆలోచనను కొంతసేపు పోషించాక, మనస్సు ఒక ఒరవడిలో పడిపోతుంది. ఒక సైకిలును కొంతసేపు తొక్కాక, పెడలు దానంతట అదే కొంతసేపు తిరిగినట్టుగా, మనస్సుకు అది చేస్తున్న పనిని దృష్టిలో పెట్టుకుని, తర్వాత దాన్ని మళ్ళీ చేసే సామర్థ్యం ఉంది.

ఉదాహరణకు, ఒక పేరు గుర్తు తెచ్చుకోవటానికి ప్రయత్నపూర్వకంగా, శాయశక్తులా ప్రయత్నించినా గుర్తు రాకపోతే, దాన్ని వదిలేస్తాను.కాని మనస్సు దానిమీద పనిచేస్తూనే ఉంటుంది. తర్వాత ఆ పేరు దానంతట అదే గుర్తుకొస్తుంది. మనస్సుకు ఆ ప్రత్యేకమైన సామర్థ్యం ఉంది. అలా దానంతట అదే ప్రయత్నం చేయటాన్ని, సూక్ష్మవృత్తి అంటారు. ఈ సూక్ష్మవృత్తి, సుప్తచేతన మనస్సులో జరిగే ఆలోచనా విధానం.

మనస్సులో రెండు వృత్తులు ఉన్నాయి. స్థూల వృత్తి, సూక్ష్మవృత్తి. స్థూలవృత్తిలో సంకల్పం, అహంకారం పాత్ర వహిస్తాయి. సూక్ష్మవృత్తి సుప్తచేతనంలో జరుగుతుంది. ఉదాహరణకు, ఇప్పుడు ఇక్కడ నా పక్కన వేరే ఎవరూ లేరు – ఆ విషయం నా మనస్సు కూడా గ్రహించింది. నా పక్కన రెండో వ్యక్తి లేరు అనే విషయాన్ని మనస్సు ఎక్కువ ప్రయత్నం చేయకుండానే రిజిస్టర్ చేసుకుంది. తర్వాతెప్పుడో, నా పక్కన ఎవరన్నా ఉన్నారా అని అడిగితే లేరంటుంది. అలా ఎలా చెప్పగలిగింది? అంటే అహంకారం లేదా సంకల్పం కలుగజేసుకోనవసరం లేకుండానే ఆలోచనలను, నిక్షిప్తం చేసుకునే శక్తి మనస్సుకు ఉంది.

ధ్యానంలో, అహంకారం ప్రయత్నపూర్వకంగా వేదాంత వాక్యాలను మనస్సులో పెట్టి, అది ఒక ఊపు అందుకునేదాకా వాటిమీదే ధ్యానం చేస్తుంది. అది ఒక ఊపు అందుకున్నాక, దానికి సంకల్పంగానీ, అహంకారం గానీ అవసరం లేదు. ఉపాసకుని ప్రమేయం లేకుండానే ఆలోచన కొనసాగుతుంది. సుప్తచేతనంలోని ఆ వృత్తిని **సూక్ష్మ అఖండాకార వృత్తి** అంటారు. అహంకారం ప్రాముఖ్యంగా లేనప్పుడు, ద్వైతం కూడా ఉండదు. సుషుప్తిలో అహంకారం

పడుకున్నప్పుడు ఎలాగైతే ద్వైతం ఉండదో, ఇక్కడ కూడా, అహంకారం ఉండదు. వృత్తి మాత్రం కొనసాగుతుంది. ఇది సుషుప్తిని పోలి ఉన్నట్టు ఉంటుంది కాని నిజానికి లేదు. సుషుప్తిలో, అజ్ఞానవృత్తి ఉంది. 'నాకు ఏమీ తెలియలేదు,' అంటుంది అది. అందులో అహంకారం ఉండదు. కాని ఈ ధ్యానంలో, అహంకారం ప్రముఖంగా లేకపోయినా, **'అహం బ్రహ్మ అస్మి,'** వృత్తి కొనసాగుతుంది. ఈ వృత్తి జ్ఞానవృత్తి. దీన్ని నిర్వికల్ప సమాధి అంటారు.

నిర్వికల్ప సమాధికి వేదాంత ఆలోచన కాని, వేదాంత పదాలు కాని అవసరం లేదు. ముందు చైతన్యానికి రావటానికి ఆలోచన వాడాను. తర్వాత ఆ చైతన్యంమీద నిలబడటానికి వేదాంత పదాలు వాడాను. కాని నిర్వికల్ప సమాధిలో సబ్జెక్టు – ఆబ్జెక్టు విభజన లేకుండా నేను చైతన్యాన్ని అనే భావన కొనసాగుతుంది. వికల్పం అంటే ప్రమాత–ప్రమాణ–ప్రమేయ రూపంలో విభజన. నిర్వికల్పం అంటే ఈ విభజన లేని మనస్సు. నాకు తెలియకుండానే ఆలోచన కొనసాగుతుంది. ఒక దీపాన్ని ఒక గాజు చిమ్నీతో మూస్తే – అది గాలికి రెపరెపలాడకుండా, నిశ్చలంగా ఎలా వెలుగుతుందో, అలా ఈ నిర్వికల్ప సమాధిలో ఈ వృత్తి నిశ్చలంగా, నిరాటంకంగా కొనసాగుతుంది.

ఈ సమాధి గురించి భగవద్గీత ఆరవ అధ్యాయంలో శ్రీకృష్ణపరమాత్మ వివరిస్తాడు. పంచదశి మొదటి అధ్యాయంలో విద్యారణ్యులవారు కూడా దీని గురించే చెప్తారు. అక్కడ, విద్యారణ్యులవారు ఒక విషయాన్ని అదనంగా చెప్తారు. నిర్వికల్ప సమాధిలో 'అహం బ్రహ్మ అస్మి,' వృత్తి ఉన్నట్టు ధ్యానం చేసే వ్యక్తికి తెలియదు. ఎందుకు? అతని సంకల్పం పడుకుంది, ప్రయత్నం లేదు. అది సుషుప్తిలాంటి శూన్యస్థితి. అలాంటప్పుడు, అక్కడ వృత్తి ఉందని ఎలా చెప్పగలము? నిర్వికల్ప సమాధిని ఆలోచనారహిత స్థితి అనవచ్చు కదా? ఈ ప్రశ్నలు లేవదీసి, వీటికి సమాధానాలు చెబుతారు విద్యారణ్యులవారు. మొదటి జవాబు ఆలోచనారహిత స్థితి అనేది లేదు. ఒకవేళ సమాధి స్థితిని ఆలోచనారహిత స్థితి అనుకుందామన్నా కూడా, అది లాభం లేదు. అందువల్ల ఆలోచనారహిత శూన్యస్థితికి వేదాంతంలో విలువ లేదు.

అందుకని దీన్ని అఖండాకారవృత్తి, అనువృత్తి దశ అంటాము. అలాగయితే నిర్వికల్ప సమాధిలో వృత్తి ఉందని ఎలా తెలుస్తుంది? విద్యారణ్యులవారు దీనికి జవాబుగా సుషుప్తికీ, దీనికీ దగ్గర పోలికలు ఉన్నాయని చెబుతారు. సుషుప్తి నుంచి లేచాక, ఏమంటాము? 'నేను గాఢనిద్రపోయాను, నాకు ఏమీ తెలియలేదు,' అంటాము. ఆ వాక్యం చెప్పాలంటే, నాకు ఏమీ తెలియటం లేదు అనే విషయం నా మనస్సుకు ఒకటి తెలియజేయాలి కదా. అది కూడా ఒక ఆలోచనే. దాన్ని సూక్ష్మవృత్తి అంటారు. దానివల్ల లేచాక ఏమీ తెలియలేదు అనేది తెలిపే ఆలోచనను గుర్తు తెచ్చుకోగలుగుతున్నాము. ఈ గుర్తు తెచ్చుకోవటమే, సుషుప్తిలో వృత్తి లేదా ఆలోచన ఉంది అని చెప్పటానికి నిదర్శనం. అలాగే సమాధి నుంచి బయటకు వచ్చాక, 'అహం బ్రహ్మ అస్మి.' వృత్తి గుర్తుకు రావటమే, నిర్వికల్ప సమాధిలో ఈ వృత్తి ఉందని చెప్పటానికి నిదర్శనం.

**వృత్తయస్తు తదానీమజ్ఞాతా అప్యాత్మగోచరాః।**
**స్మరణాదనుమీయంతే వృత్తిః తస్య సముత్థితాత్ ॥ పంచదశి 56**

నిర్వికల్ప సమాధిలో ఉండగా ఆలోచనా ప్రవాహం తెలియదు, కాని తరువాత గుర్తుకు వచ్చినదాన్ని బట్టి అప్పుడు ఆలోచన ఉందని తెలుస్తుంది. అందువల్ల నిర్వికల్ప సమాధిలో ఆలోచనలు సూక్ష్మరూపంలో ఉంటాయి.

ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**రసావేశ –** మనస్సును శ్రద్ధ ఆవేశిస్తుంది. రసం అంటే రుచి. దేనిమీద?

**స్వానుభూతి–** స్వ అంటే సాక్షి. నేను సాక్షిని అనే అఖండాకారవృత్తి ఏర్పడుతుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే మనస్సు గుప్పెటలో వేదాంత ఆలోచన ఉంటుంది.

**దృశ్యశబ్దావుపేక్ష్య తు–** మొదటి రెండు దశలు ఇంక అవసరం లేదు. ఇందులో ప్రమాతా, ప్రమాణం, ప్రమేయం భేదం ఉండదు.

**నివాతస్థితదీపవత్ –** గాలికి రెపరెపలాడకుండా, నిశ్చలంగా వెలిగే దీపంలా ఉంటుంది మనస్సు.

**నిర్వికల్పః సమాధిః –** ఈ సమాధి –**3. ఆంతర నిర్వికల్ప సమాధిః.**

## శ్లోకం - 27

**హృదీవ బాహ్యదేశేఽపి యస్మిన్ కస్మింశ్చ వస్తుని।**
**సమాధిరాద్యః సన్మాత్రాన్నామరూపపృథక్కృతిః॥**

ముందు శ్లోకంతో మొదటి మూడు సమాధులు అయిపోయాయి. ఇవన్నీ మనస్సులో ఉన్న సాక్షిచైతన్యంమీద దృష్టి నిలిపే ఆంతర్గత ధ్యానాలు. సాక్షిచైతన్యంమీద దృష్టి నిలపాలంటే అది తప్పనిసరిగా అంతర్గతంగా సాగాలి. ఎందుకంటే చైతన్యాన్ని అంతర్గతంగానే గుర్తించగలము. చైతన్యాన్ని బాహ్యంగా అనుభవించలేము. నేను మీతో మాట్లాడితే, మీరు వింటారు. మీరు చేతనవ్యక్తి అని నాకు తెలుసు కాని, మీలోని చైతన్యం నాకు అనుభవంలోకి రాదు. నా ఇంద్రియాలు జడస్వరూపమైన మీ శరీరాన్నే చూస్తాయి. నాలోని చైతన్యాన్ని నేను అనుభవించగలను గాని, మీలోని చైతన్యాన్ని నేను అనుభవించలేను. చైతన్యం అంతటా ఉన్నా, దాన్ని నా శరీరంలోనే నేను గుర్తించగలను. ఆత్మబోధలో ఇదే విషయం వస్తుంది.

ఆత్మ సర్వవ్యాపకమైనా అన్నింటిలోనూ ప్రకాశించదు. అది కేవలం అంతర్గతమైన దానిలోనే, బుద్ధిలోనే ప్రకటితమవుతుంది, స్పష్టమైన అద్దంలోని ప్రతిబింబంలాగా.

ఇక్కడ్నుంచీ బాహ్యసమాధుల గురించిన చర్చ వస్తుంది. బాహ్యదృశ్య అనువిద్ధ సవికల్ప సమాధి, బాహ్యశబ్ద అనువిద్ధ సవికల్ప సమాధి, బాహ్యనిర్వికల్ప సమాధి.

ఈ శ్లోకంలో **బాహ్యదృశ్య అనువిద్ధ సవికల్ప సమాధి**ని చూస్తాము. పద్ధతి ఒకటే. అంతర్గత సమాధిలో, ముందు ఆలోచనలమీద దృష్టి పెట్టి, దాన్నుంచి సాక్షివైపుకు మారాలి. అలాగే, ఈ సమాధిలో కూడా, ముందు ఏదైనా బాహ్యవస్తువుమీద దృష్టి పెట్టి, దాన్నుంచి ఆత్మ లేదా బ్రహ్మమీద దృష్టి నిలపాలి. సినిమా చూస్తూ సినిమా తెరమీద దృష్టి పెట్టినట్టు ఉండాలి. ఆ వస్తువుమీద మీకు యిష్టాయిష్టాలు లేకపోతే మంచిది. అందుకని ఒక క్లిప్పును తీసుకోండి.

క్లిప్పుకు ఐదు అంశాలు ఉన్నాయి. అస్తి, భాతి, ప్రియం, రూపం, నామం. నామరూపాలు మాత్రమే క్లిప్పుకు చెందినవి. క్లిప్పుఉంది అంటే క్లిప్పు ఉనికి క్లిప్పు అంతటా వ్యాపించి ఉంది. అంటే క్లిప్పు + ఉనికి ఉన్నాయి. ఇప్పుడు మీ దృష్టిని క్లిప్పు (క్లిప్-నెస్)నుంచి, దాని ఉనికికి (ఈజ్-నెస్) మార్చండి. అంటే క్లిప్పును పక్కనపెట్టేసి, ఉనికిని మాత్రమే చూడండి. క్లిప్పులో చైతన్యం కూడా ఉన్నా, అది ప్రకటితమవదు కాబట్టి చైతన్యంమీద ధ్యానం చేయలేరు. అందులో ఉనికి మాత్రమే తెలుస్తుంది.

అంతర్గత సమాధిలో ఆలోచనలను చూడటం మాని, వాటిని సాక్షిగా చూసే చైతన్యాన్ని ఏకాగ్రతతో చూసినట్టుగా, బాహ్యసమాధిలో బాహ్యావస్తువును చూడటం మాని, వాటికి ఉనికినిచ్చే శుద్ధసత్‌ను చూడాలి.నామరూపాలనుంచి శుద్ధ సత్‌ను బుద్ధితో విడదీయాలి. సత్, క్లిప్పులో ఒక భాగం కాని, దాని లక్షణం గాని,దానిలోంచి ఉత్పత్తి చెందినది గాని కాదు. ఈ విధమైన జ్ఞానం పొందటాన్ని బాహ్యదృశ్య అనువిద్ధ సవికల్ప సమాధి అంటారు. నామరూపాలను వస్తువునుంచి విడదీశాక, శుద్ధసత్‌మీద ధ్యానం చేయాలి. ఇది కన్ను తెరుచుకుని చేసే ధ్యానం. ఉనికి, శుద్ధసత్, తెరలాంటిది. జీవితంలో జరిగేవన్నీ, ఆ తెరమీద కదిలే సినిమా లాంటివి.

ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**హృదీవ** – ఆంతరసమాధిలో లాగే;

**బాహ్య దేశేఽపి** – బాహ్యప్రపంచం విషయంలో కూడా;

**సమాధి** – దృశ్య అనువిద్ధ సవికల్ప సమాధి చేయాలి;

**ఆద్య** – ఇది మొదటి సమాధి.

**యస్మిన్ కస్మింశ్చ వస్తుని** – ఏదైనా ఒక వస్తువును తీసుకుని, దానిమీద చేయాలి. ఏదైనా వస్తువు ఎందుకంటే అన్ని వస్తువుల్లోనూ ఉనికి ఉంది.

**నామరూప పృథక్కృతిః** – నామరూపాలను విడదీయాలి. దేన్నుంచి?

**సన్మాత్రాః** – ఉనికినుంచి. ఎలా చేయాలి?

బుద్ధితో విడదీయాలి. నామరూపాలను విడదీశాక, ఉనికిమీద దృష్టి పెట్టాలి. సినిమా చూస్తున్నప్పుడు, సినిమానుంచి తెరమీదకు దృష్టి మార్చినట్టుగా

వస్తువుమీదనుంచి, వస్తువు ఉనికిమీదకు దృష్టి మార్చాలి. ఈ ధ్యానం –

**4. బాహ్యదృశ్య అనువిద్ధ సవికల్ప సమాధిః.**

**శ్లోకం– 28**

**అఖణ్డైకరసం వస్తు సచ్చిదానన్ద లక్షణమ్।**
**ఇత్య విచ్ఛిన్నచిన్తేయం సమాధిర్మధ్యమో భవేత్॥**

**బాహ్యశబ్ద అనువిద్ధ సవికల్ప సమాధిః** బాహ్యసమాధిలో రెండవ స్థాయి సమాధి ఇది. అంతర్గతంగా చేసేటప్పుడు ఆలోచననూ, చైతన్యాన్నీ విడదీస్తే, బాహ్యంగా వస్తువునూ దాని ఉనికినీ విడదీస్తాము. రెండింటిలోనూ ఇది మొదటి దశ. రెండో దశలో ఉపనిషత్తులోని వాక్యాలను తీసుకుని, ఆత్మలక్షణాలమీద దృష్టి నిలుపుతాము. అంతర్గతసమాధిలో సాక్షిలక్షణాల మీద దృష్టి పెడితే, ఇక్కడ ఉనికి లేదా సత్ లక్షణాలమీద దృష్టి నిలుపుతాము. శుద్ధ సత్ లక్షణాలు యివి–

- శుద్ధ సత్, ఒక వస్తువుయొక్క భాగం గానీ, దాని లక్షణం గానీ, దాన్నుంచి ఉత్పత్తి చెందింది గానీ కాదు.
- వస్తువుకు సరిహద్దులు ఉంటాయి కానీ, సత్‌కు లేవు.
- వస్తువు లేకపోతే, సత్ ఉన్నట్టు తెలియదు. అంతమాత్రాన సత్ లేనట్టు కాదు. దాన్ని ప్రకటించే మాధ్యమం లేదు కాబట్టి ప్రకటితమవదు అంతే.
- సత్ సర్వవ్యాపకం. వస్తువులు అనేకం, సత్ ఏకం.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్ – ఛాందోగ్యమ్**

వీటిలో కొన్ని లక్షణాలను తీసుకుని, ధ్యానం చేయాలి.

సర్వవ్యాపకత్వం, నిర్వికారత్వం, అఖండత్వం, సర్వ అధిష్ఠానత్వం మొదలైనవి. ఉపనిషత్తులలోని వాక్యాలు (శబ్దాలు) వాడతాము కాబట్టి దీన్ని శబ్ద అనువిద్ధ సవికార సమాధి అంటారు. ఆకాశంలాగా శుద్ధ సత్ కూడా అఖండం.

ఆంతరశబ్ద అనువిద్ధ సమాధిలో కూడా శాస్త్రవాక్యాలను వాడతాము. కాకపోతే భేదం ఏమిటంటే, అంతకు ముందు వాక్యాలు లోపలనున్న చైతన్యానికి వర్తిస్తే, ఇప్పటి వాక్యాలు బాహ్యంగా ఉన్న సత్‌కు చెందినవి. ఉనికి ఒక్కటే, ఏకమేవాద్వితీయం. ప్రపంచం అంతా ప్రళయంలో లయం చెందినా కూడా, శుద్ధసత్ ఉంటుంది. నామరూపాత్మక జగత్తు సత్‌నుంచి పుట్టి, సత్‌లో స్థితి

చెంది, సత్‌లో లయమవుతుంది. ఈ విధంగా ప్రయత్నపూర్వకంగా సత్ గురించిన ఆలోచనలమీదే దృష్టి పెట్టాలి.

ఈ ధ్యానంలో ఒక అంశానికి రావాలి. అది చాలా ముఖ్యమైన అంశం కూడా. ఆంతరధ్యానంలో చిత్ గురించి, బాహ్యధ్యానంలో సత్ గురించీ చెపుతున్నాం. ఇప్పుడు ఒక సందేహం రావచ్చు. ఏమిటది? లోపల చిత్‌నూ, బాహ్యంగా సత్‌ను సాధన చేయాలంటే సత్ వేరూ, చిత్ వేరా? కానే కాదు. సదేవచిత్, చిదేవ సత్; సత్, చిత్‌లు ఒకటే బ్రహ్మకు ఉన్న లక్షణాలు. 'అంతటా సత్ రూపంలో ఉన్న బ్రహ్మ నాలో చిత్ రూపంలో ప్రకటితమవుతుంది, అందుకని బాహ్యంగా సత్‌మీద ధ్యానం చేశాక, ప్రతి ఆలోచన వెనకా చిత్‌గా ఉన్న నేనే సత్‌ను కూడా,' అని మీకు మీరే చెప్పుకోవాలి. బయట ఉన్న సత్‌కూ,లోపల ఉన్న చిత్‌కూ భేదం లేదు. సత్‌చిత్‌లు నామంలో భేదం గాని, రెండూ నిర్గుణబ్రహ్మే. ఈ నిరంతర ఆలోచన ఏ ఆటంకం లేకుండా ప్రవాహంలా సాగాలి. ఇది బాహ్యాశబ్ద అనువిద్ధ సవికల్ప సమాధి. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**అఖణ్డైకరసం వస్తు –** వస్తువు అంటే శుద్ధసత్. అది అఖండం. స్వజాతీయ, విజాతీయ, భేద రహితం. ఏక రసం అంటే స్వగత భేదరహితం.

**సచ్చిదానన్ద లక్షణమ్ –** సత్, చిత్ ఒకటే.

**అవిచ్ఛిన్నచిన్తేయం –** చింత అంటే బెంగ కాదు. ప్రయత్నపూర్వకంగా చేసే ఆలోచన. అవిచ్ఛిన్న అంటే నిరాటంకంగా సాగే ప్రవాహం. దాన్ని సజాతీయ వృత్తి ప్రవాహం అంటారు. నెయ్యి ప్రవహించినట్టుగా ప్రవహించాలి. ఎటువంటి వృత్తి?

**ఇతి –** మొదటి పాదంలో చెప్పినట్టుగా – అంటే అఖణ్డైకరసం.

**సమాధిర్మధ్యమో భవేత్ –** ఈ సమాధి రెండవ సమాధి. మొత్తం ఆరూ తీసుకుంటే ఐదవ సమాధి. ఈ ధ్యానం– **5. బాహ్యాశబ్ద అనువిద్ధ సవికల్ప సమాధిః**

**శ్లోకం– 29**

**స్తబ్ధీభావో రసాస్వాదాత్తృతీయః పూర్వవన్మతః।**
**ఏతైః సమాధిభిః షడ్భిర్నయేత్ కాలం నిరన్తరమ్॥**

**బాహ్యనిర్వికల్ప సమాధి** అంటే ఏమిటి? చేతనమనస్సు సత్‌బ్రహ్మ గురించి ప్రయత్నపూర్వకంగా ఆలోచనా ప్రవాహాన్ని కొనసాగిస్తే, అలాగే ఆ సత్‌బ్రహ్మను నేనే అని దానితో ఐక్యం గురించి ఆలోచిస్తే, సుప్తచేతన మనస్సు కూడా అదే ఆలోచనను అందుకుంటుంది. అందుకున్నాక, సుప్తచేతన మనస్సు అదే ఆలోచనలో నిరంతరం ఉంటుంది. దానికింక ప్రయత్నపూర్వక సంకల్పం కాని, కృషి కాని అవసరం లేదు. ఎలాగైతే మన ప్రమేయం లేకుండానే దిగులుపడుతూ ఉంటామో, అలాగే ధ్యానం చేసే అతని ప్రమేయం లేకుండానే, అఖండాకారవృత్తి కూడా సాగుతుంది. ఇది నిర్వికల్ప సమాధికి దారితీస్తుంది. అందులో సబ్జెక్టు–ఆబ్జెక్టు భేదం ఉండదు, ఎందుకంటే చేతన మనస్సు ఉండదు.

అలాగని ద్వైతం కూడా పూర్తిగా లేకుండా పోదు. ద్వైతం అనుభవించాలంటే చేతన మనస్సు ఉండాలి. సుప్తచేతన మనసులో ఏర్పడే ఆలోచనను అందుకే సూక్ష్మవృత్తి అంటారు. ఆ సూక్ష్మవృత్తి ఉండగా, మనకు తెలియదు. సుషుప్తిలో కూడా నిర్వికల్పక స్థితి ఉంటుంది. ప్రమాతా, ప్రమేయం భేదం ఉండదు గాని, 'నాకేమీ తెలియటం లేదు. అంతా శూన్యంగా ఉంది,' అనే వృత్తి ఉంది మనస్సులో. ఈ వృత్తి చాలా సూక్ష్మంగా ఉంటుంది. దీనిని కారణశరీరవృత్తి అనీ, అవిద్యావృత్తి అనీ, సుప్తచేతనవృత్తి అనీ అంటారు.

ఈ వృత్తి నిద్రలో ఉందని ఎలా తెలుసు? నిద్రలేచాక, నిద్రలో నాకేమీ తెలియలేదు అని గుర్తు తెచ్చుకోగలుగుతున్నాను. అనుభవం లేకపోవటం కూడా ఒక విధమైన అనుభవమే. ఆ అనుభవం నిర్వికల్పక సుషుప్తి అవస్థలో సుప్తచేతన మనస్సులో ఒక వృత్తిలా ఏర్పడింది. అలాగే నిర్వికల్పక సమాధిలో కూడా, మనస్సులో ఆలోచనలు నిలిచి ఉంటాయి కాని సమాధి స్థితిలో తెలియదు. తర్వాత గుర్తుకు వస్తుంది. నిర్వికల్ప సమాధిలో వేదాంతవాక్యాలు సూక్ష్మమైన వృత్తిరూపంలో మనస్సులో కొనసాగుతాయి. అంతర్గతధ్యానం విషయంలోలాగానే ఇక్కడ కూడా రెండు సవికల్ప సమాధులు అయ్యాక అది నిర్వికల్పసమాధితో ముగుస్తుంది. వేదాంతధ్యానం పదే పదే చేయటంవల్ల సుప్తచేతనంలో అది జీర్ణించుకుపోయి, అఖండాకారవృత్తి రూపంలో కొనసాగుతుంది.

**తృతీయః పూర్వవన్మతః–** ఆంతర నిర్వికల్ప సమాధిలాగే, ఈ మూడవ సమాధి బాహ్యంగా చేయాలి. ఎలా?

**రసాస్వాదాత్–** ఆనందాన్ని అనుభవిస్తూ, ఆనందం అంటే ఇక్కడ ఆత్మానందం.

**స్తబ్ధీభావః–** మనస్సును అఖండాకారవృత్తిమీద నిలపటంవల్ల, నిశ్చలంగా అవుతుంది. గాలికి రెపరెపలాడని దీపంలా మనస్సు చలించకుండా ఉంటుంది.

**రసాస్వాద, స్తబ్ధీభావ** పదాలను వేరే సందర్భంలో పూర్తిగా భిన్న అర్థాలతో చూస్తాము. మాండూక్య కారికల్లో వస్తాయి ఇవి. అందులో నిదిధ్యాసనం గురించి మాట్లాడేటప్పుడు, ధ్యానంలో ఆనందాన్ని అనుభవించటం, (రసాస్వాదం) ధ్యానానికి ఆటంకం కింద వర్ణించబడింది. ఈ శ్లోకంలోనేమో, రసాస్వాదం వల్లే నిదిధ్యాసనం అవుతుంది అని వస్తుంది. నిర్వికల్ప సమాధికి ఆనందమే కారణం అంటోంది. అయితే ఏది కరెక్ట్? రెండూ కరక్టే. ఎందుకంటే రసం పదానికి రెండు అర్థాలు ఉన్నాయి.

ఆనందం రెండురకాలు. అందులో ఒకటి ప్రతిబింబ ఆనందం. ఈ ప్రతిబింబ ఆనందం, కోశానందం. మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు ఈ ప్రతిబింబ ఆనందం ప్రకటితమవుతుంది. ధ్యానం అయిపోగానే, ప్రతిబింబ ఆనందం వెళ్ళిపోతుంది. ఈ ప్రతిబింబ ఆనందానికి అలవాటు పడితే అది బంధకత్వానికి దారితీయవచ్చు. అందుకని, గౌడపాదాచార్యులవారు మాండూక్య కారికల్లో ఈ రసాస్వాదాన్ని విమర్శించారు.

ఇక్కడ ఈ శ్లోకంలో వచ్చే రసాస్వాదం ప్రతిబింబ ఆనందం కాదు. బింబ ఆనందం. అది అనుభవంలోకి వచ్చేది కాదు. ఈ బింబానందం నా స్వస్వరూపం, అది ఎప్పుడూ ఉంటుంది. ఆ ఆనందం అనుభవించేది కాదు, తెలుసుకునేది. ప్రతిబింబానందంలో స్థాయీభేదాలు ఉంటాయి. వాటిని ప్రియం, మోదం, ప్రమోదం అంటారు. కాని బింబానందం ఎప్పటికీ ఒకేలాగా ఉంటుంది. మనస్సు ఆనందంగా ఉన్నా లేకపోయినా బింబానందం ఎప్పుడూ ఉంటుంది. దీన్ని ఆత్మానందం లేదా బ్రహ్మానందం అని కూడా అంటారు. ఈ శ్లోకంలో రసాస్వాదం అంటే ఈ ఆత్మానందాన్ని తెలుసుకునేది.

స్తబ్ధీభావనను ధ్యానానికి ఆటంకంగా వర్ణించారు– వేదాంతసారంలోనూ, మాండూక్యకారికలోను. ఈ రెండింటిలోనూ స్తబ్ధీభావం అంటే మనస్సును స్తబ్ధంగా చేయటంగా తీసుకున్నారు. సుప్తచేతన మనస్సులో అశుద్ధాలు ఉండటంవల్ల మనస్సు స్తబ్ధం అవుతుందనీ, దానివల్ల నిదిధ్యాసనంలో ఏకాగ్రత చూపలేమనీ అన్నారు. ఈ స్థితిలో ఆత్మవృత్తి గాని, అనాత్మవృత్తి గాని ఉండవు. ఎందుకంటే మనస్సు స్తబ్ధంగా అవుతుంది. అందువల్ల ఇది ధ్యానానికి ఆటంకం కలిగిస్తుంది అంటారు ఈ రెండింటిలోనూ. కాని ఇక్కడ, ఈ శ్లోకంలో స్తబ్ధీభావం అంటే మనస్సును వేదాంతవాక్యాలమీదే నిలిపి ఉంచి, కదలకుండా నిశ్చలంగా ఉండటం లేదా వేరే ప్రాపంచిక విషయాలమీదకు ఆలోచనలను మళ్ళించకపోవటం.

**ఏతైః సమాధిభిః** – ఈ ధ్యానం – **6. బాహ్యానిర్వికల్పసమాధిః.** ఈ శ్లోకంతో ఆరుసమాధి అభ్యాసాలు ముగింపుకు వస్తున్నాయి. ఈ అభ్యాసాలు ఎంతకాలం చేయాలి?

**షడ్భిర్నయేత్ కాలం నిరన్తరమ్** – సమాధి అభ్యాసంతో ఎంతగా లీనమవ్వాలంటే అవి సహజసమాధిగా మారాలి. అంటే ఏ ప్రాపంచిక వ్యవహారం చేస్తున్నా కూడా ఈ వేదాంత వాక్యాలు మనస్సులో రాత్రింబవళ్ళు నా వెంటే ఉండాలి. అహంకారం నేను వేసుకునే వేషం మాత్రమే. జీవితం ఒక నాటకం. నా కర్మ ప్రకారం నాచేత ఈ వేషం వేయిస్తున్న సూత్రధారి ఈశ్వరుడు. నేను వేసే పాత్రలు ఎప్పుడు, ఏ విధంగా వేయాలని రాసి ఉంటే అప్పుడు, అలా వేయాలి. ఇటువంటి వేషధారణ నాకు సహజం అవ్వాలి. అది అలా సహజం అయితే దాన్ని సహజ సమాధి అంటారు.

**నైవ కిఞ్చిత్ కరోమీతి యుక్తో మన్యేతతత్త్వవిత్।**
**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్॥**
**ప్రలపన్ విసృజన్ గృహ్ణన్నున్మిషన్ నిమిషన్నపి।**
**ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంత ఇతి ధారయన్॥ గీత 5–8,9**

తత్త్వజ్ఞుడైన సాంఖ్యయోగి చూస్తూ, వింటూ,స్పృశిస్తూ, ఆఘ్రాణిస్తూ, తింటూ, నడుస్తూ, నిద్రిస్తూ, శ్వాసక్రియను నడుపుతూ, మాట్లాడుతూ, త్యజిస్తూ,

గ్రహిస్తూ, కళ్ళను తెరుస్తూ, మూస్తూ ఉన్నా కూడా ఇంద్రియాలు తమ పనులను చేస్తున్నాయి కాని, తానేమీ చేయటం లేదని భావిస్తాడు.

ఇలా నా స్వస్వరూపంలో నిలిచాక, నాకు నిదిధ్యాసనం ఒకసాధనగా అవసరం లేదు. ఎందుకంటే నేను ఇంక సాధకుడిని కాను.

**ముఖ్యాంశాలు –** ముందుకు సాగేముందు కొన్నిముఖ్యాంశాలు చూద్దాం. ఆరు సమాధుల్లో, నాలుగు సమాధులను సాధకుడు ప్రయత్నపూర్వకంగా సాధన చేయాలి. అవి రెండురకాల ఆంతర సవికల్పసమాధి, రెండురకాల బాహ్యసవికల్పసమాధి. వేదాంతవాక్యాల ఆధారంగా చేసే సాధనలు అవి.

1.నిర్వికల్పసమాధిని ప్రయత్నపూర్వకంగా చేయలేరు. అది సవికల్ప సమాధి అభ్యాసవల్ల ఏర్పడే పర్యవసానం. ఒక వ్యక్తి ఒక విషయంమీద కాసేపు ధ్యానం చేస్తే, ఆ ఆలోచనా విధానం సుప్తచేతన మనస్సులోకి వెళుతుంది. దాని తరువాత సంకల్పం ఆగిపోయినా, వృత్తి కొనసాగుతుంది. సాధకుని ప్రయత్నం లేకుండానే వృత్తి కొనసాగటాన్ని నిర్వికల్పసమాధి అంటారు. నిర్వికల్పసమాధిలో సంకల్పం పనిలేదు కాబట్టి, అది ధ్యానం చేసే వ్యక్తి కోరికమీద ఆధారపడి లేదు. అది కేవలం ఒక పర్యవసానంగా జరగవచ్చు అంతే. ఈ సమాధికోసం ధ్యానం చేసే వ్యక్తి ప్రత్యక్షంగా ప్రయత్నించలేడు. అతను కేవలం సవికల్ప సమాధికోసం ప్రయత్నించగలడు. అంతే. నిర్వికల్ప సమాధి అతని కోరిక లేదా సంకల్పంమీద ఆధారపడి లేదు.

పంచదశిలో, విద్యారణ్యులవారు నిర్వికల్ప సమాధి కూడా సాధకుని కర్మమీద ఆధారపడి ఉంది అంటారు. నిర్వికల్పసమాధి స్థితి ఏర్పడటానికి అనేక అంశాలు కారణం. అందులో కొన్ని, అంటే సంస్కారం,అభ్యాస లాంటివి మన చేతిలో ఉంటాయి కాని, సంచిత కర్మలలాంటివి మన చేతిలో లేవు. అందువల్ల నిర్వికల్ప సమాధి సవికల్ప సమాధియొక్క పర్యవసానం మాత్రమే.

2. జ్ఞానం పొంది, మోక్షం పొందటానికి నిర్వికల్ప సమాధి అభ్యాసం చేసి తీరాలా? ఏమాత్రం అవసరం లేదనేది నిస్సందేహంగా చెప్పవచ్చు. ధ్యానంద్వారా లేదా సమాధి సవికల్పం లేదా నిర్వికల్పంద్వారా పొందేది కాదు

జ్ఞానం. జ్ఞానం ఒక ప్రమాణంనుంచి వస్తుంది. ధ్యానం లేదా సమాధి, ఆరు ప్రమాణాలలో లేదు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని శాస్త్రవాక్యంనుంచి, ముఖ్యంగా మహావాక్య విచారణనుంచి, అది కూడా గురువు సహాయంతోనే పొందగలము. గురుశాస్త్ర ఉపదేశంద్వారానే జ్ఞానాన్ని పొందగలము.

శ్రవణం పుస్తకజ్ఞానం మాత్రమే యిస్తుంది, నాకు ప్రత్యక్షజ్ఞానం లేదా ఆత్మసాక్షాత్కారం కావాలి అనుకునేవారికి, విద్యారణ్యులవారు పంచదశిలో జవాబు ఇస్తున్నారు. మోక్షాన్నిచ్చే ప్రత్యక్షజ్ఞానం మహావాక్య శ్రవణం లేదా విచారణనుంచి వస్తుంది. ఒకవేళ నాకు ప్రత్యక్షజ్ఞానం లేదు అనుకుంటే, నాకు కావాల్సింది నిజంగా ప్రత్యక్షజ్ఞానం కాదు. నాకు కావాల్సింది మరింత శ్రవణం లేదా మరింత మహావాక్య విచారణ. నాకు ప్రత్యక్షజ్ఞానం లేదు అనుకున్నానంటేనే నేను చేసిన శ్రవణం చాలదన్నమాట. మరింత మెరుగ్గా శ్రవణం చేయటానికి, మననానికి, నిదిధ్యాసనానికి నా మనస్సును సంసిద్ధం చేయాలి.

అందువల్ల నిదిధ్యాసనం జ్ఞానాన్ని ప్రత్యక్షంగా ఇవ్వదు. అది శ్రవణానికి రావటానికి తోడ్పడుతుంది. ఆత్మజ్ఞానం శ్రవణంలో చేసే మహావాక్య విచారణవల్లే కలుగుతుంది. **మహావాక్యాన్ని** స్పష్టంగా అర్థం చేసుకోవటమే ఆత్మజ్ఞానం. స్పష్టంగా అర్థం చేసుకోవటమంటే, **మహావాక్యాన్ని** స్పష్టంగా అర్థం చేసుకోవటం తప్ప వేరే మార్గం లేదని స్పష్టంగా అర్థం చేసుకోవటం.

ఇదే విషయాన్ని పంచదశిలో వివరించారు విద్యారణ్యులవారు. బుద్ధికి కొన్ని ఆటంకాలు కలగటంవల్ల ఒక్కోసారి సరిగ్గా వినలేదు. సమాధి అభ్యాస, నిర్వికల్పసమాధితో సహా, బుద్ధిని శ్రవణం బాగా చేసేటందుకు సంసిద్ధం చేస్తుంది. అందువల్ల నిర్వికల్ప సమాధి చేసి తీరనవసరం లేదు. శ్రవణం చేసి తీరాలి. ఎవరైనా నేను చాలా శ్రవణం చేశాను, అయినా నాకు పుస్తకజ్ఞానం మాత్రమే అబ్బింది అంటే, అంటే అతను ఇప్పుడే కాదు వచ్చే జన్మలో కూడా శ్రవణం చేయాలి.

ఆ విధంగా సమాధి అభ్యాస బుద్ధిని పదును పెడుతుంది. నిర్వికల్ప సమాధి అభ్యాసం జరుగవచ్చు, జరుగకపోవచ్చు. కాని దానికీ మోక్షానికీ సంబంధం

లేదు. మోక్షానికి కావాల్సింది ముఖ్యంగా శ్రవణం. సమాధి అభ్యాసం దానికి తోడ్పడుతుంది.

## శ్లోకం- 30

**దేహాభిమానే గలితే విజ్ఞాతే పరమాత్మని।**
**యత్ర యత్ర మనో యాతి తత్ర తత్ర సమాధయః॥**

శ్రవణ మనన నిదిధ్యాసన అభ్యాస సాధనను నేను పదేపదే చేయటంవల్ల, అందులోనూ ముఖ్యమైన శ్రవణాన్ని పదే పదే చేయటంవల్ల, అహం బ్రహ్మ అస్మి మహావాక్యాన్ని స్పష్టంగా అర్థం చేసుకున్నాను. బ్రహ్మ ఎక్కడో దూరంగా లేదు. నేను తర్వాత ఎప్పుడో పొందే అనుభవమూ కాదు. బ్రహ్మ చైతన్యం. ఆ చైతన్యాన్ని నేను ఎల్లవేళలా అనుభవిస్తున్నాను. చైతన్యం ఎవరో కాదు, నేనే. నేను అంతకుముందూ, ఇప్పుడూ, ఇక ముందు కూడా సర్వవ్యాపకమైన బ్రహ్మచైతన్యాన్ని. ఇలా అనుకోకుండా, ఒకవేళ 'బ్రహ్మ నాలో ఉన్నాడంటే, బ్రహ్మ నా శరీరానికి పరిమితమవుతుందా, బ్రహ్మ సర్వవ్యాపకమవాలంటే ఈ శరీరం పడిపోవాలా,' అనిపిస్తే మాత్రం, నా శ్రవణం పూర్తి అయినట్టు కాదు లెక్క. ఆకాశంలో ఒక కుండ పెడితే, కుండ పెట్టినంత మాత్రాన ఆకాశంయొక్క సర్వవ్యాపకత్వం, అఖండత్వం పోదు, కుండ ఉన్నా,లేకపోయినా దానికేం పరిమితి ఉండదు. అలాగే నేను చైతన్యం, సర్వవ్యాపకం, అఖండం. ఈ శరీరం ఉన్నా లేకపోయినా ఉంటాను. ఈ స్పష్టమైన అవగాహన చాలా ముఖ్యం.

**దేహాభిమానే గలితే విజ్ఞాతే పరమాత్మని–** నేను శరీరాన్ని, నాలో చైతన్యం ఉంది అనే దశనుంచి నేను చైతన్యాన్ని, నేను తాత్కాలిక వేషం వేయటానికి ఈ శరీరం ఉంది అనే విషయం స్పష్టమవుతూ వస్తున్న కొద్దీ, నేను పరమాత్మను, నేను శరీరాన్ని కాను అని ఒప్పుకుంటాను. గదిలో ఒక గోడ దగ్గరకు వెళ్ళానంటేనే, ఇంకో గోడకు దూరంగా వెళ్ళానని అర్థం. అలాగే ఆత్మలో రమించానంటేనే, దేహాభిమానాన్ని విడిచిపెట్టినట్టు లెక్క. నేను ఆత్మను అనుకొంటున్న కొద్దీ, నేను శరీరాన్ని అనే అపోహ తొలగుతూ వస్తుంది. ఈ అపోహ అజ్ఞానంవల్ల ఏర్పడింది.

అజ్ఞానం పోతే, దేహాభిమానం కూడా పోతుంది. ఈ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

దేహాభిమానం రెండు రకాలు

**1. సామాన్య అభిమానం –** అది ప్రారబ్ధకర్మవల్ల ఏర్పడుతుంది. ప్రారబ్ధకర్మవల్లే నేను శరీరంతోనూ, మనస్సుతోనూ అనుబంధం పెంచుకుంటాను. అందువల్ల శరీరానికి ఏర్పడే ఆకలిదప్పులు, వృద్ధాప్యం, నొప్పిలాంటి సుఖదుఃఖాలు ప్రారబ్ధకర్మవల్ల ఏర్పడుతాయి. అవి పోవు. ఆత్మజ్ఞానం పొంది, బ్రహ్మనిష్ఠలో ఉన్నా కూడా ఆ అనుభవాలు పోవు. శరీరపరమైన అనుభవాలు ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకూ ఉంటాయి.

**2. విశేష అభిమానం –** అజ్ఞానజనిత అభిమానం ఇది. అజ్ఞానంవల్ల నేను శరీరాన్ని, శరీరం పుట్టటంతో నేనుపుట్టాను. శరీరం రాలిపోతే, నేను రాలిపోతాను. ఇక్కడితో నా జీవితం అయిపోతుంది అనుకుంటాము. బుద్ధిలో ఏర్పడిన యిలాంటి అపోహలు సంసారానికి కారణం. వేదాంతం ఈ అపోహలను తొలగిస్తుంది. అజ్ఞానంవల్ల ఏర్పడిన భావోద్రేకాలు తొలగిపోతాయి. ఒక చిన్న పిల్లవాడికి ఏదైనా శారీరకబాధ కలిగితే, ఆ బాధవల్ల ఏడుస్తాడు కాని నాకే ఎందుకు వచ్చింది, నేను ఎందుకు ఇంత బాధ పడాలి అని దాన్ని గోరంతలు కొండంతలుగా చేసుకుని బాధపడడు. జ్ఞాని కూడా ఆ పిల్లవాడిలాంటివాడే. జ్ఞానికి కూడా శారీరక బాధ తప్పదు కాని తను శరీరం కాదు అనుకుంటాడు కాబట్టి, మనస్సుపరంగా తెచ్చిపెట్టుకునే బాధలు ఉండవు.

అలా జ్ఞాని తాను శరీరం కాదు, తాను మనస్సు కాదు అని తెలుసుకుంటాడు కాబట్టి శరీర బాధలు కాని, రాగద్వేషాలు కాని బాధించవు. అందువల్ల అతనికి సాధనలు కూడా అవసరం లేదు, కావాలంటే చేయవచ్చు. ఎప్పుడైతే అతనికి నిస్సంశయ జ్ఞానం కలుగుతుందో, అప్పుడే అతను సహజ సమాధిస్థితిలో ఉంటాడు. అంటే అతను ఎప్పుడూ ఆత్మనిష్ఠలోనే ఉంటాడు. ఇలా ఉండటం అతనికి సహజంగానే అవుతుంది. దీన్ని సహజ సమాధి అనీ, ఆత్మనిష్ఠ అనీ, స్థితప్రజ్ఞత అనీ, బ్రహ్మనిష్ఠ అనీ అంటారు. ప్రారబ్ధకర్మవల్ల జీవితంలో

ఏ ఒడిదుడుకులు ఏర్పడినా, **బ్రహ్మసత్యం జగత్ మిథ్యా జీవో బ్రహ్మైవ నా పరః** అనే సత్యం ఎన్నడూ మర్చిపోడు.

**యత్ర యత్ర మనోయాతి తత్ర తత్ర సమాధయః** – అతని మనసు ఎటు వెళ్ళినా, అతని అనుభవం ఏదైనా, ఎప్పుడూ అంతరసమాధిలోనో, బాహ్యసమాధిలోనో ఉంటాడు. బాహ్యవస్తువుల్లో సత్‌నూ, అంతర్గత ఆలోచనల్లో చిత్‌నూ చూస్తాడు. ఆ అనంతమైన సత్, చిత్‌లు తనే అనే జ్ఞానంతో చూస్తాడు.

## శ్లోకం – 31

**భిద్యతే హృదయగ్రన్థిశ్ఛిద్యన్తే సర్వ సంశయాః।**
**క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే॥**

ఈ శ్లోకంలో జ్ఞానఫలం వస్తోంది. ముండక ఉపనిషత్తుల్లో కూడా అక్షరాలా ఇదే మంత్రాన్ని చూస్తాము.

| | | | |
|---|---|---|---|
| **పరావరే** | – పరావరం అంటే ఏకాత్మ లేదా బ్రహ్మ. | | |
| **పరం** | – ఉన్నతమైనది | – కారణం | – సముద్రం |
| **అవరం** | – తక్కువస్థాయిది | – కార్యం | – అల |

రెండింటి నామరూపాలు తీసేస్తే ఉన్నది ఒకటే నీరు. అది ఏకాత్మ. బ్రహ్మే కారణ ఈశ్వరుడు, కార్య జీవుడు.

**తస్మిన్ దృష్టే పరవరమ్ –** పరావరం అయిన బ్రహ్మను చూస్తే అంటోంది శ్లోకం. చూస్తే అంటే అర్థం చేసుకుంటే – 'తెలుసుకుంటే' అనే బదులు 'చూస్తే' అని ఎందుకు అంది అంటే, చూపు ప్రత్యక్ష ప్రమాణం. దానిలో సందేహం ఉండదు. ఈ పరావరం ఏకాత్మను స్పష్టంగా నేను అని అర్థం చేసుకుంటే ఏమవుతుంది?

**భిద్యతే హృదయగ్రన్థిః –** హృదయంలో ఉన్న ముడులు విడిపోతాయి. ముడి అనేది రెండు వస్తువులను కలుపుతుంది. అజ్ఞానంవల్ల అనేక ముడులు మనమే వేసుకుంటున్నాము. గ్రంథి అంటే ఇక్కడ కోరిక. కోరికల మూలాన ఎప్పుడూ అసంతృప్తే, ఎప్పుడూ బాధే. జ్ఞానంవల్ల కోరికలు పోతాయి.

**ఛిద్యన్తే సర్వసంశయాః –** అన్ని అనుమానాలూ సమసిపోతాయి.

**బ్రహ్మసత్యం జగత్ మిథ్యా జీవో బ్రహ్మైవ నా పరః**

**క్షీయన్తే చాస్య కర్మాణి –** అన్ని కర్మలూ నాశనమవుతాయి. సంచితకర్మలు దగ్ధమవుతాయి. ఆగామికర్మలు అంటవు. ప్రారబ్ధకర్మ కొనసాగుతుంది. కాని, అతను శరీరంతో మమేకం చెందడు కాబట్టి, దానికి ప్రాముఖ్యత నివ్వడు. వాటి గురించి అతని దృక్పథం మారుతుంది కాబట్టి అవికూడా ఉన్నా లేనట్టే. పగలు నక్షత్రాలు ఉన్నా సూర్యకాంతిలో అవి తెలియనట్టే, అతని శరీరానికి బాధ కలిగినా, ఆత్మనిష్ఠలో ఉన్న అతన్ని బాధించవు.

ఈ శ్లోకంతో దృక్‌దృశ్య వివేకంలోని మొదటి భాగం అయిపోయింది.

టూకీగా – ఒక వ్యక్తిలో మూడు దృక్కులు ఉన్నాయి– సాక్షి, మనస్సు, ఇంద్రియాలు. సంసారానికి కారణం ఆత్మానాత్మ వివేకం చేయకపోవటం.

1. ఆధ్యాత్మిక స్థాయిలో దృక్‌దృశ్య వివేకం చూపాలి.
2. బాహ్యస్థాయిలో జగత్ బ్రహ్మల వివేకం చూపాలి.

బాహ్యంగా అంతటా ఉన్న సత్తే, నాలో చిత్‌గా ప్రకటితమవుతోంది. ఆ సత్ చిత్ ఆత్మను నేనే. మనశ్శరీరాలు, బాహ్యప్రపంచం మిథ్య.

ఇన్నాళ్ళూ అహంకారంతో మమేకం చెంది ఉన్నాము కాబట్టి, దాన్ని మార్చుకోవటానికి నిదిధ్యాసనం చేయాలి.

ఆరు రకాల నిదిధ్యాసనం ఉన్నాయి. వీటి ఫలం జీవన్ముక్తి, విదేహముక్తి.

**5. వేదాంత బోధ సారాంశం – 32–46**

ఇక్కడ వేదాంతబోధలో కొత్త పంథా కనపడుతుంది. అది ప్రత్యేకంగానూ, సృజనాత్మకంగానూ ఉంది. అంతకు ముందు భాగంలో మూడు దృక్కులు, మూడు దృశ్యాలు చూశాము.

**విజ్ఞేయస్త్రివిధో జీవః–** ఈ భాగంలో, ఒక వ్యక్తిలో ముగ్గురు జీవులను చూస్తాము. నేను అనే పదం వాడినప్పుడు, అది ఈ ముగ్గురు జీవులలో ఎవరినైనా సూచించవచ్చు. వారికి మూడు పేర్లు ఉన్నాయి.

1. పారమార్థిక జీవుడు – ఒక వ్యక్తిలో ఉండే బింబ చైతన్యం (చిత్)

2. వ్యావహారిక జీవుడు – చిదాభాస 1

3. ప్రాతిభాసిక జీవుడు – చిదాభాస 2

ఆ విధంగా ఒక జీవిలో ఒక చిత్, రెండు చిదాభాసలు ఉన్నాయి.

**1. బింబచైతన్యం** – బింబచైతన్యం సర్వవ్యాపకం, అంతటా ఉంది అని చూశాము. దాని ఐదు లక్షణాలు మళ్ళీచూద్దాము.

- చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దానినుంచి ఉత్పత్తి అయిన వస్తువు కాని కాదు.
- అది స్వతంత్రవస్తువు. అది శరీరం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తుంది.
- చైతన్యం శరీరం హద్దులకే పరిమితమవదు.
- చైతన్యం శరీరం నాశనమయితే నాశనమవదు. తదనంతరం కూడా ఉంటుంది.
- చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది కాని కనపడదు. దాన్ని ప్రతిబింబింపజేసే మాధ్యమం లేదు కాబట్టి అది తెలియదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

శుద్ధచైతన్యం అనుభవంలోకి రాదు. వ్యవహారం నడపదు. జ్ఞాని, 'అహం బ్రహ్మ అస్మి,' అన్నప్పుడు, నేను అంటే శుద్ధచైతన్యం లేదా బింబచైతన్యం.

మయ్యేవ సకలం జాతం అన్నప్పుడు కూడా, నేను అంటే శుద్ధచైతన్యం.

**2. చిదాభాస 1** – మనస్సు సూక్ష్మపంచభూతకార్యం. అందువల్ల జడం. కాని అది జడమైనా ప్రతిబింబింపచేయగలదు. అందువల్ల శుద్ధచైతన్యాన్ని ప్రతిబింబింపజేయగలదు. అలా ఏర్పడిన ప్రతిబింబాన్ని చిదాభాస అంటారు. ఇది బింబచైతన్యంలాగా సర్వవ్యాపకం కాదు. ప్రతిబింబ మాధ్యమాన్ని బట్టే ఈ ప్రతిబింబం ఏర్పడుతుంది. బల్లలో కూడా సత్ ఉన్నా, దానిలో ప్రతిబింబ మాధ్యమం (మనస్సు) లేదు కాబట్టి ప్రతిబింబ చైతన్యం ఏర్పడదు. వ్యవహారం నడిపేది చిత్ కాదు చిదాభాస. అందువల్ల అది జడంగానే ఉంటుంది. వ్యావహారిక మనశ్శరీరాలలో ఉండి, వ్యావహారిక జగత్తుతో జాగ్రదావస్థలో వ్యవహారం నడిపే

చిదాభాస రెండవ జీవుడు, మొదటి ప్రతిబింబచైతన్యం. ఈ మొదటి ప్రతిబింబచైతన్యాన్ని వ్యావహారిక జీవుడు అంటారు. దీన్ని మనసు ప్రతిబింబింప చేస్తుంది కాబట్టి, మనస్సు వ్యవహారం నడుపుతున్నంత సేపూ, వ్యావహారిక జీవుడు కూడా అందుబాటులో ఉంటాడు.

**3. చిదాభాస 2** – మూడవ జీవుడు స్వప్నంలో అందుబాటులో ఉంటాడు. ఒక వ్యక్తి స్వప్నంలో ఉన్నప్పుడు, అతని నిద్రాశక్తి, అతను ఆ స్వప్నాన్ని అనుభవించటానికి స్వప్నమనశ్శరీరం సృష్టిస్తుంది. స్వప్నంలో ఉన్న జీవికి అది స్వప్నమని తెలియదు. స్వప్న మనస్సులో కూడా చిదాభాస ఏర్పడుతుంది. స్వప్న మనశ్శరీరాలలో, జాగ్రద్ పురుషుని మనస్సునుండి ఏర్పడిన చిదాభాసను ప్రాతిభాసిక జీవుడు అంటారు. ఈ ప్రాతిభాసిక జీవుడు స్వప్నప్రపంచాన్ని అనుభవిస్తాడు. స్వాప్నిక మనశ్శరీరాలు ఉన్నంతసేపూ ప్రాతిభాసిక జీవుడు ఉంటాడు. ఆ వ్యక్తి నిద్ర లేవగానే, ప్రాతిభాసిక మనశ్శరీరాలు, ప్రాతిభాసిక జీవుడు, స్వప్నప్రపంచం అన్నీ జాగ్రద్ పురుషునిలో లయమయిపోతాయి. అలాగే వ్యావహారిక మనస్సు సుషుప్తిలో లయమయినప్పుడు, వ్యావహారిక జీవుడు, వ్యావహారిక ప్రపంచం లయమయిపోతాయి.

కాని పారమార్థిక జీవుడు ఎన్నడూ లయమవడు. ఈ పారమార్థిక జీవుడే అద్వైతబ్రహ్మ. వేదాంతబోధ ఏమిటంటే నేను వ్యావహారిక జీవుడిని కాను, నేను ప్రాతిభాసిక జీవుడిని కాను, నేను పారమార్థిక జీవుడిని అని చెప్పగలగాలి. నేను పారమార్థిక జీవుడిని అని తెలుసుకున్నాక, తక్కిన రెండు జీవులను వదులుకోనవసరలేదు. ఆ రెండు జీవులు నేను వేసే పాత్రలు అని తెలుసుకుంటే చాలు. మనం ప్రాతిభాసిక జీవుడినుంచి వ్యావహారిక జీవుడికి తేలికగానే మారుతున్నాము. స్వప్నంలో ఉన్నంతవరకూ అందులోని సుఖదుఃఖాలను అనుభవించినా కూడా, ఒకసారి స్వప్నంనుంచి లేచాక, అది నిజం కాదు మిథ్య అని తెలుసుకోగలుగుతున్నాము. అలాగే వ్యావహారిక సత్యం కూడా ఈశ్వరుని కలే అని తెలుసుకుని, దాన్నుంచి పారమార్థిక సత్యానికి ఎదగాలి. వ్యావహారిక సత్యం అంటే ఒక కాలంలో ఉండి, ఇంకో కాలంలో లేనిది. జగత్తు ఒక కాలంలో

ఉండి, ఇంకో కాలంలో ఉండదు. అలా మూడు కాలాల్లోనూ లేని దాన్ని మిథ్య అనీ, మూడు కాలాల్లోనూ ఉండేదాన్ని సత్యం అనీ అంటారు. మిథ్యకు ఇంకోపేరు వ్యావహారిక సత్యం. వ్యావహారిక సత్యంలో మెదిలే జీవి పేరు వ్యావహారిక జీవుడు. పారమార్థిక సత్యం తెలుసుకున్న జీవి పేరు పారమార్థిక జీవుడు. పారమార్థిక సత్యంతో వ్యవహారం నడిపే జీవుడు అనకూడదు. పారమార్థిక ప్రపంచం ఎప్పుడు లయమవుతుంది అనకూడదు. పారమార్థిక ప్రపంచం లేదు. పారమార్థిక సత్యం అద్వైతబ్రహ్మ. అవ్యవహారి.

ఎవరైతే ఈ పారమార్థిక సత్యాన్ని తెలుసుకుని, తన పాత్రలను సవ్యంగా పోషిస్తాడో అతన్ని సంసారం బాధించదు. నేను వ్యావహారిక జీవిని అని అనుకోకుండా, నేను పారమార్థిక జీవిని అని తెలుసుకునేలా చేయటానికి తాపత్రయ పడుతోంది వేదాంతం. అలా తెలుసుకుంటే, నేను నా పాత్రలను నా శాయశక్తులా పోషిస్తాను కాని వాటితో మమేకం చెందను. ఆ విధంగా పారమార్థిక జీవుడు బింబచైతన్యం; వ్యావహారిక జీవుడు, ప్రాతిభాసిక జీవుడు ప్రతిబింబచైతన్యాలు. ప్రతిజీవిలోనూ ఈ మూడూ ఉంటాయని చూశాము. వీటిలో తానేమిటో తెలుసుకున్న జీవుడు జ్ఞాని.

### శ్లోకం - 32

**అవచ్ఛిన్నశ్చిదాభాసస్తృతీయః స్వప్నకల్పితః।**
**విజ్ఞేయస్త్రివిధో జీవస్తత్రాద్యః పారమార్థికః॥**

**అవచ్ఛిన్న-** సర్వవ్యాపకమైన చిత్ శరీరంలో కూడా ఉంది.

**చిదాభాస-** ఇది పరిచ్ఛిన్న వ్యావహారిక చిదాభాస. మనస్సులో ప్రతిబింబితమైన చిదాభాస-1

**తృతీయః స్వప్నకల్పితః-** మూడవది, ప్రాతిభాసిక జీవుడు లేదా చిదాభాస-2. దీనికి ఈశ్వరుడు అవసరము లేదు. చిదాభాస -1 సంకల్పంచేత సృష్టించబడుతుంది. స్వప్నకల్పిత తర్వాత చిదాభాస -2 కలుపుకోవాలి.

**త్రివిధో జీవః -** ఈ విధంగా ఒక జీవిలో మూడు ఉన్నాయి.

చిత్ (పారమార్థిక జీవి), చిదాభాస -1 (వ్యావహారిక జీవి), చిదాభాస-2

(ప్రాతిభాసిక జీవి). **(ఇతి) విజ్ఞేయ** – ఈ విషయం తెలుసుకోగాక!

**తత్ర** – ఈ మూడింటిలో,

**ఆద్యః పారమార్థికః** – మొదటిది పారమార్థిక జీవి.

**శ్లోకం– 33**

**అవచ్ఛేదః కల్పితః స్యాదవచ్ఛేద్యం తు వాస్తవమ్।**
**తస్మిన్ జీవత్వమారోపాద్బ్రహ్మత్వం తు స్వభావతః॥**

ఇందులో పారమార్థిక జీవుని స్వరూపం చూస్తాము. పారమార్థిక జీవుడు అంటే నా శరీరంలో ఉన్న చైతన్యం– శరీరంలో ఉన్న చైతన్యం అనేసరికి, శరీరం సరిహద్దులకే పరిమితమైనట్టు అనిపించినా, అది సర్వవ్యాపకం. అంతకు ముందు చూసిన వివరణ మళ్ళీ చూద్దాము. ఉదాహరణకు కుండను తీసుకుందాం. మూడు దశల్లో ఆకాశం గురించి తెలుసుకుంటాము.

1. కుండలో ఆకాశం ఉంది.
2. ఆకాశం కుండలోనూ ఉంది, కుండ బయటా ఉంది.
3. నిజానికి ఆకాశంలోనే అన్ని కుండలూ ఉన్నాయి.

ఇదే సూత్రాన్ని చైతన్యానికీ, శరీరానికీ వర్తింపజేద్దాము.

1. చైతన్యం శరీరంలో ఉంది.
2. చైతన్యం శరీరంలోనూ ఉంది, శరీరం బయటా ఉంది.
3. నిజానికి చైతన్యంలోనే అన్ని శరీరాలూ ఉన్నాయి.

**అవచ్ఛేదః కల్పితః స్యాదవచ్ఛేద్యం తు వాస్తవమ్** – ఈ సర్వవ్యాపకమైన చైతన్యాన్ని పారమార్థిక సత్యం అంటారు. ఈ పారమార్థిక సత్యానికి చెందిన జీవిని పారమార్థిక జీవుడు అంటారు. పారమార్థిక జీవుడు అంటే బింబచైతన్యం. పారమార్థిక సత్యం ఉన్నతస్థాయికి చెందింది. శరీరం వ్యావహారిక సత్యానికి చెందింది. అంటే తక్కువ స్థాయికి చెందినది. అంటే అది మిథ్య. మిథ్యాశరీరం, సత్యం బ్రహ్మను ఎన్నటికీ పరిమితం చేయలేదు.

అవచ్ఛేద్యం తు వాస్తవమ్ – శరీరంలో ఉన్న చైతన్యం బ్రహ్మ. అది సత్యం. కాని అదే చైతన్యాన్ని మనస్సు ప్రతిబింబింపజేసేసరికి అది

పరిమితమవుతుంది. ప్రతిబింబచైతన్యాన్ని చిధాభాస అంటారు.

దానికి పరిమితి ఎందుకు ఉంటుందంటే, అది ప్రతిబింబింపజేసే మాధ్యమంలోనే ప్రకటితమవుతుంది.

**తస్మిన్ జీవత్వమారోపాద్బ్రహ్మత్వం తు స్వభావతః –** బింబచైతన్యం, ప్రతిబింబచైతన్యం పక్కపక్కనే ఉండటంవల్ల, మనం ప్రతిబింబచైతన్యపు పరిమితులను బింబచైతన్యానికి పొరపాటుగా ఆరోపిస్తున్నాము. అందువల్ల పారమార్థిక జీవునికి లేని పరిమితిని విధించి, దానికి జీవత్వాన్ని ఇస్తున్నాము. ప్రతిబింబచైతన్యంయొక్క జీవత్వాన్ని పారమార్థిక జీవికి ఇస్తున్నాము. ఈ ప్రతిబింబచైతన్యం, చిదాభాస 1.

అలాగే చిదాభాస 2 ఉంది. జాగ్రదావస్థలో వ్యవహారం నడిపే జీవిని చిదాభాస 1 లేదా వ్యావహారిక జీవుడు అంటారు. ఈ వ్యావహారిక జీవుడు, ఒక స్వప్నాన్ని సృష్టిస్తాడు. అందులో స్వప్నమనశ్శరీరాలు ఉంటాయి. ఆ స్వప్నాన్ని అనుభవించే జీవుడిని ప్రాతిభాసిక జీవుడు లేదా చిదాభాస 2 అంటారు. ఆ విధంగా జీవులు మూడు.

వ్యావహారిక జీవునికి వ్యావహారిక ప్రపంచం, ప్రాతిభాసిక జీవునికి ప్రాతిభాసిక ప్రపంచం ఉన్నాయి. కాని పారమార్థిక జీవునికి పారమార్థిక ప్రపంచం ఉందనకూడదు. దానికి శరీరం లేదు. ప్రపంచం లేదు. ద్వైతం లేదు, ఉన్నది అద్వైతమే. సుషుప్తిలో వ్యావహారిక, ప్రాతిభాసిక జీవులు, వాటికి సంబంధించిన ప్రపంచంలో లయమయిపోతాయి. అప్పుడు, మనం మన స్వస్వరూపంలో ఉంటాము. అంటే పారమార్థిక జీవి అవుతాము. కాని మనకు అది తెలియదు. కాని శాస్త్రం నువ్వు వ్యావహారిక జీవి కాదు. ప్రాతిభాసిక జీవి కాదు, పారమార్థిక జీవివి అంటోంది. అహం బ్రహ్మ అస్మిలో అహం అంటే పారమార్థిక జీవి. జ్ఞాని బ్రహ్మ ఎప్పుడవుతాడు? దానికి జవాబు తరువాత శ్లోకంలో వస్తుంది.

**శ్లోకం – 34**

**అవచ్ఛిన్నస్య జీవస్య పూర్ణేన బ్రహ్మణైకతామ్।**
**తత్త్వమస్యాదివాక్యాని జగుర్నేతరజీవయోః॥**

**అవచ్ఛిన్నస్య జీవస్య పూర్ణేన బ్రహ్మణైకతామ్ –** నేను అపరిచ్ఛిన్న బింబచైతన్యాన్ని. మనస్సు నన్ను ప్రతిబింబింపచేస్తే, ఆ ప్రతిబింబం పరిచ్ఛిన్నం, తాత్కాలికం అవుతుంది. మనస్సనే ప్రతిబింబ మాధ్యమం లేకపోతే, ప్రతిబింబ చైతన్యం ఉండదు, కాని, బింబచైతన్యాన్నయిన నేను కొనసాగుతాను. కాకపోతే, నా మొహాన్ని నేను ఎలా చూసుకోలేనో, అలా బింబచైతన్యాన్ని కూడా చూడలేను. మొహాన్ని చూడలేనంత మాత్రాన మొహంలేదని ఎలా కొట్టిపారేయలేనో, అలా బింబచైతన్యాన్ని చూడలేనంత మాత్రాన అది లేదని కొట్టిపారేయలేను.

**తత్త్వమస్యాది వాక్యాని –** అయితే, బింబచైతన్యం ఉందని నాకెలా తెలుస్తుంది? దీనికి లౌకిక జ్ఞానానికి వాడే ఐదు ప్రమాణాలు పనిచేయవు. ఆరవ ప్రమాణమైన శబ్దప్రమాణమే పనికి వస్తుంది. శబ్దప్రమాణం అంటే శాస్త్రప్రమాణం. అందులో ఉన్న మహావాక్యాలు– తత్త్వమసిలాంటివి– జీవాత్మ పరమాత్మ ఐక్యం గురించి బోధిస్తాయి. ఆ శాస్త్రప్రమాణాన్ని అంత తేలికగా తీసుకోకూడదు. మామూలుగా నేను, 'నేను' అన్నప్పుడల్లా నన్ను ప్రాతిభాసిక జీవుడిగానో, వ్యావహారిక జీవుడిగానో తీసుకుంటాను. కాని శాస్త్రం చెప్పిన మహావాక్యాలను పారమార్థిక జీవుని దృష్టిలో తీసుకుంటే, అప్పుడు ఐక్యం అర్థమవుతుంది.

**జగుర్నేతరజీవయోః –** తక్కిన రెండు జీవాలకూ బ్రహ్మతో ఐక్యం కుదరదు. ఎందుకంటే అవి తక్కువ స్థాయి సత్యాలు, బ్రహ్మ ఉన్నతస్థాయి సత్యం.

## శ్లోకం – 35

**బ్రహ్మణ్యవస్థితా మాయా విక్షేపావృతిరూపిణీ।**
**ఆవృత్యాఖణ్డతాం తస్మిన్ జగజ్జీవౌ ప్రకల్పయేత్॥**

ఇంతకుముందు శ్లోకంలో పారమార్థిక జీవి గురించి వస్తే, ఇక్కడనుంచి వ్యావహారిక జీవుడు, ప్రాతిభాసిక జీవులు బ్రహ్మనుంచి, ఆ తర్వాత నానుంచి ఎలా ఉత్పన్నమవుతాయో వస్తుంది. వ్యావహారిక ప్రపంచం, ప్రాతిభాసిక ప్రపంచం లేకుండా, సత్ మాత్రమే ఉన్న స్థితిని ముందు ఊహించుకోండి.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్ – ఛాందోగ్యమ్**

**బ్రహ్మణ్యవస్థితా మాయా–** ఆ సత్‌ను, వ్యక్తిపరంగా పారమార్థిక జీవుడు అన్నాం. అందువల్ల, బ్రహ్మనైన నేను మాత్రమే ఉన్నాను. నాకు ఒక ప్రత్యేక శక్తి ఉంది. అది మాయాశక్తి.

**విక్షేపావృతిరూపిణీ –** ఈ మాయాశక్తికి రెండు శక్తులు ఉన్నాయి. విక్షేపశక్తి, ఆవరణశక్తి. నా విక్షేపశక్తిని ఉపయోగించి, నేను ఒక స్వప్నాన్ని సృష్టిస్తాను. ఏమిటా స్వప్నం?

**తస్మిన్ జగజ్జీవౌ ప్రకల్పయేత్ –** ఈ స్థూలశరీరం,ఈ స్థూలప్రపంచం. పారమార్థిక జీవినైన నేను నా స్వప్నంగా స్థూలశరీరాన్ని, ఈ స్థూలప్రపంచాన్ని సృష్టిస్తాను. ఆ స్వప్నాన్ని అనుభవించటానికి, నేను వ్యావహారిక శరీరంతోనూ, వ్యావహారిక చిదాభాసతోనూ మమేకం చెంది, వ్యావహారిక జీవినవుతాను. ఎప్పుడైతే స్వప్నంలోకి అడుగుపెడతానో, అప్పుడు ఆవరణశక్తి మొదలవుతుంది. అందువల్ల స్వప్నం, స్వప్నం అని మర్చిపోతాను– కలలో ఉన్నంతసేపూ కల నిజంగా అనిపిస్తుంది. స్వప్నంలో ఉండగా ఎవరైనా అది స్వప్నం అంటే స్వప్నపురుషుడు నమ్మడు. తనను సృష్టించిన జాగ్రద్ పురుషుడే, తన ఉన్నత స్వరూపం అని కూడా తెలీదు. నేనుకలలో ఉండగా, స్వప్నప్రపంచంలో ఒక చిన్న జీవిని. అదే ఆ కలనుంచి లేస్తే, మొత్తం ఆ స్వప్నప్రపంచానికి సృష్టికర్తను.

**ఆవృత్యాఖణ్డతాం –** వ్యావహారిక ప్రపంచం కూడా అంతే. నేను వ్యావహారిక ప్రపంచంలో ఉన్నంతసేపూ అది సత్యం. నా ఆవరణశక్తి మొదలవుతుంది. నేను పారమార్థిక జీవిని, నేను వ్యవహారంకోసం ఈ వ్యావహారిక ప్రపంచాన్ని సృష్టించాను అన్న విషయాన్ని మర్చిపోతాను. జాగ్రద్ ప్రపంచమనే స్వప్నాన్ని అనుభవించు కాని అది స్వప్నం మాత్రమే అని తెలుసుకో అంటోంది శాస్త్రం. మనం జాగ్రద్ ప్రపంచంనుంచి మేలుకోవటానికి యిష్టపడకపోవటంవల్ల, అది స్వప్నం అని తెలుసుకోలేకపోతున్నాము. స్వప్నంనుంచి లేస్తేనే ఈ స్వప్నం, వ్యావహారిక స్వప్నం అని తెలుస్తుంది.

**శ్లోకం–36**

**జీవో ధీస్థచిదాభాసో భవేద్భోక్తా హి కర్మకృత్।**
**భోగ్యరూపమిదం సర్వం జగత్ స్యాద్భూతభౌతికమ్॥**

**జీవో ధీస్థచిదాభాసః –** పారమార్థిక జీవినైన నేను, నా స్వరూపాన్ని మర్చిపోయి, ఈ ప్రపంచానికి వ్యావహారిక జీవిగా వచ్చాను. ఈ ప్రపంచం నేను సృష్టించిందే. అది నా స్వంత పెద్ద కల, వ్యావహారిక కల. ఈ వ్యావహారిక జీవుడు వేరే ఎవరో కాదు. చిత్‌యొక్క ప్రతిబింబమే. అంటే పారమార్థిక జీవినైన నేనే. మనస్సనే ప్రతిబింబమాధ్యమం నన్ను ప్రతిబింబింపజేసింది.

**భవేద్భోక్తా హి కర్మకృత్ –** నేనే ఈ మనశ్శరీరాలలో కర్త. నేను చేసే అనేక కర్మలవల్ల పుణ్యపాపాలను పోగేసుకుంటున్నాను. కర్తా జీవి అవటంవల్ల భోక్తా జీవి అవుతున్నాను. ఈ కల అనుభవం కొనసాగకుండా ఉండాలంటే, దానికి నిద్రనుంచి లేవటమొక్కటే మార్గం. నేను ఆ కలనుంచి లేవటానికి ఇష్టపడకుండా అలా అనేక కర్మలు చేసుకుంటూ పోతే, కర్తా, భోక్తలుగా కొనసాగక తప్పదు.

**భోగ్యరూపమిదం సర్వం జగత్ స్యాత్ –** జీవిగా నేను సుఖదుఃఖాలు అనుభవించటానికి ఈ జగత్తు ఉంది.

**భూతభౌతికమ్ –** పంచభూతాలతోనూ, పాంచభౌతిక వస్తువులతోనూ నిండి ఉంది.

ఈ జగత్తు, జీవుని శరీరం, చిదాభాస అన్నీ పారమార్థిక జీవుని స్వప్నంలో ఉన్నాయి. కాని నేను పారమార్థిక జీవునితో కాకుండా, చిదాభాసతో, దానికన్నా తక్కువ జీవితో మమేకం చెందుతున్నాను.

**శ్లోకం – 37**

**అనాదికాలమారభ్య మోక్షాత్ పూర్వమిదం ద్వయమ్।**
**వ్యవహారే స్థితం తస్మాదుభయం వ్యావహారికమ్॥**

జాగ్రద్ జీవిని ఎందుకు వ్యావహారిక జీవుడు అంటారు? దానికి జవాబు యిక్కడ వస్తుంది.

**వ్యవహారే స్థితమ్ –** వ్యావహారిక జీవి, చిదాభాస 1, అన్ని వ్యవహారాలూ చేస్తాడు. పారమార్థిక జీవికి వ్యవహారాలేం ఉండవు. స్వప్నప్రపంచంలో జాగ్రద్ పురుషుడు ఏమీ వ్యవహారం ఎలా నడపడో, అలాగే పారమార్థిక జీవుడు, వ్యావహారిక ప్రపంచంలో ఏమీ వ్యవహారం నడపడు.

**అనాదికాలమారభ్య–** కల ఎప్పుడు మొదలయిందో ఎలా చెప్పలేమో, అలాగే జాగ్రదావస్థ ఎప్పుడు మొదలైందో కూడా చెప్పలేము. కల ఎప్పుడు మొదలైందో చెప్పాలంటే, స్వప్న పురుషునికి జాగ్రద్ పురుషుని గురించి తెలియాలి. కాని అతనికి తెలియదు కాబట్టి అది చెప్పలేడు. పోనీ జాగ్రద్ పురుషుడిని స్వప్నం ఎప్పుడు మొదలైందని అడుగుదామా అంటే జాగ్రద్ పురుషునికి స్వప్నం లేదు.

**ఇదం ద్వయమ్ –** అనాది కాలంనుంచి వ్యావహారిక జీవుడు, వ్యావహారిక ప్రపంచం ఉంటూనే ఉన్నాయి. ఈ వ్యావహారిక కల ముగుస్తుందా?

**మోక్షాత్ పూర్వమ్ –** ఆధ్యాత్మిక మెలకువ వచ్చేదాకా, వ్యావహారిక జీవుడు వ్యవహారం నడుపుతూనే ఉంటాడు.

**తస్మాదుభయం వ్యావహారికమ్ –** అందుకే ఈ జీవుడిని వ్యావహారిక జీవుడు అనీ, ప్రపంచాన్ని వ్యావహారిక ప్రపంచం అనీ అంటారు.

దీనికి చక్కటి దృష్టాంతం స్వప్నవృత్తాంతమే. జాగ్రద్ పురుషుడు, స్వప్నప్రపంచాన్ని సృష్టించి, స్వప్నశరీరంతో తానే అందులోకి ప్రవేశిస్తాడు. తను జాగ్రద్ పురుషుడు, ఉన్నతస్థాయికి చెందినవాడు అని మరిచిపోయి, స్వప్నప్రపంచంలో అడుగిడి, అందులోని సుఖదుఃఖాలను అనుభవిస్తాడు. దీన్ని బట్టి చూస్తే, ఇప్పుడు మన జాగ్రద్ అవస్థలో ఉన్నామనుకుంటున్న అవస్థ కూడా ఒక విధమైన కలే. ఈ విషయాన్నే రాబోయే శ్లోకాల్లో వివరంగా చూస్తాము.

**శ్లోకం – 38**

**చిదాభాసస్థితా నిద్రా విక్షేపావృతిరూపిణీ।**
**ఆవృత్య జీవజగతీ పూర్వే నూత్నే తు కల్పయేత్॥**

పారమార్థిక జీవుడినైన నేను వ్యావహారిక జీవుడిని, జగత్తును, ఆకాశాన్ని, కాలాన్ని సృష్టిస్తున్నాను. రెండూ నానుంచి వచ్చినవే కాబట్టి, అవి కూడా కలలాంటివే. వ్యావహారిక జీవుడినీ, వ్యావహారిక జగత్తునీ నేను మాయాశక్తివల్ల సృష్టిస్తున్నాను. నేను ఇప్పుడు వ్యావహారిక జీవుడితో మమేకం చెంది పారమార్థిక జీవుడి స్వరూపం మర్చిపోతున్నాను. ఇది పొరపాటు 1.

పొరపాటు 2 ఈ క్రింది విధంగా వస్తుంది. ఈ వ్యావహారిక జీవుడినైన నేను, ప్రాతిభాసిక జీవుడిని, జగత్తును (స్వప్నప్రపంచాన్ని) నా నిద్రాశక్తివల్ల సృష్టించి, స్వప్నంలోని ప్రాతిభాసిక జీవుడితో మమేకం చెందుతున్నాను. ప్రాతిభాసిక జీవుడిగా నేను నిద్రాశక్తియొక్క ఆవరణశక్తివల్ల నా ఉన్నతస్థితి గురించి మర్చిపోయి, నేను సృష్టించిన స్వప్నం సత్యం అని నమ్మి, అందులో వచ్చే కష్టసుఖాలను అనుభవిస్తున్నాను. స్వప్నంలోని కష్టసుఖాలను పరిష్కరించాలంటే కలలోంచి లేవాలి. జాగ్రద్ ప్రపంచం కూడా ఒక కలే. జాగ్రద్ ప్రపంచం, జాగ్రద్ పురుషుడిని కష్టాలకు లోను చేస్తే, జాగ్రత్ పురుషుడు ఈ కలనుంచి లేవాలి. మొదటి లేవటం స్వప్నసంసారంనుంచి లేవటం. రెండో లేవటం, జాగ్రద్ సంసారంనుంచి లేవటం.

అనాదిగా ఉన్న మాయవల్ల తురీయం గురించిన అజ్ఞానంతో ఉన్న జీవుడు మేలుకుంటే, అప్పుడు అతను అద్వైతతురీయం గురించి తెలుసుకుంటాడు. ఆ తురీయానికి పుట్టుక లేదు, స్వప్నం లేదు, నిద్రలేదు. తురీయం అంటే ఆత్మ.

32–34 శ్లోకాల్లో పారమార్థిక జీవుడి గురించి, 35–37లో వ్యావహారిక జీవుడి గురించీ చూశాము. ఇప్పుడు 38లో ప్రాతిభాసిక జీవుడి గురించి చూస్తాము. పారమార్థిక జీవుడు వ్యావహారిక జీవుడిని సృష్టిస్తే, వ్యావహారిక జీవుడు ప్రాతిభాసిక జీవుడిని సృష్టిస్తాడు.

**చిదాభాస –** వ్యావహారిక జీవుడు అంటే జాగ్రద్ పురుషునిలో ప్రతిబింబిస్తున్న చిదాభాస.

**స్థితా నిద్రా** – ఈ వ్యావహారిక జీవుడిలో ఒక శక్తి ఉంది. దాన్ని నిద్రాశక్తి అంటారు.

**విక్షేపావృతిరూపిణీ –** ఆ శక్తికి కూడా మాయాశక్తిలాగే విక్షేపశక్తి,

ఆవరణశక్తి ఉంటాయి. విక్షేపశక్తిద్వారా నిద్రాశక్తి కొత్త స్వాప్నిక జీవుడిని, స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తుంది.

**ఆవృత్యజీవజగతీ పూర్వే –** అదే సమయంలో ఆవరణశక్తివల్ల జాగ్రద్ పురుషుడిని, జాగ్రద్ ప్రపంచాన్ని మర్చిపోతుంది.

**నూత్నే తు కల్పయేత్ –** స్వాప్నిక జీవుడిని ఈ శ్లోకం కొత్త జీవిగా వర్ణిస్తోంది. ఎందుకంటే స్వాప్నిక జీవుడికి తను పూర్వం జాగ్రద్ పురుషుడినని తెలియదు. ఆ విధంగా జాగ్రద్ జీవుడు – ప్రపంచం; స్వప్నజీవుడు– ప్రపంచం రెండూ రెండుపొరలుగా ఉన్న నా సృష్టే.

**శ్లోకం – 39**

**ప్రతీతికాల ఏవైతే స్థితత్వాత్ ప్రాతిభాసికే।**
**న హి స్వప్నప్రబుద్ధస్య పునః స్వప్నే స్థితిస్తయోః॥**

జాగ్రద్ పురుషుడు, జాగ్రద్ ప్రపంచం కూడా స్వప్నపురుషుడు, స్వప్నప్రపంచంలాగా నిజం కాదు. అవి మిథ్య. కాకపోతే జాగ్రద్ ప్రపంచం, స్వప్నప్రపంచం రెండూ అసత్యమే అయినా, ఆ అసత్యంలో స్థాయీ భేదాలున్నాయి. ఆ స్థాయీ భేదాలవల్లే వాటికి వేరే పేర్లు ఉన్నాయి. జాగ్రద్ ప్రపంచాన్ని వ్యావహారికం అని స్వప్నప్రపంచాన్ని ప్రాతిభాసికం అనీ అంటారు.

స్వప్నప్రపంచాన్ని ప్రాతిభాసికం అని ఎందుకంటారు?

**ప్రతిభాస కాలే సత్యం –** అంటే కనబడినంతకాలమే అది సత్యం. అది నాకు మాత్రమే కనబడే సత్యం.

**ప్రతీతికాల ఏవ –** స్వప్నం కాలంలో మాత్రమే;

**ఏతే –** స్వప్నజీవి, జగత్తు;

**స్థితత్వాత్ –** ఉన్నాయి. ఒక స్వప్నం కాలం 90 క్షణాలు మాత్రమే అంటారు.

**ప్రాతిభాసికే –** స్వప్నపు ప్రపంచాన్ని, జీవిని అసత్యం అంటారు.

**స్వప్న ప్రబుద్ధస్య –** స్వప్నంనుంచి లేచాక;

**న హి పునః స్వప్నే స్థితిస్తయోః –** స్వప్నజగత్తు; జీవి మళ్ళీ ఉండవు.

పునః స్వప్నే అంటే రెండో కలలో మొదటి స్థితి ఉండరు.

వ్యావహారిక జగత్తు కూడా స్వప్నం అన్నా, అది దీర్ఘకాలం సాగుతుంది.

ఇవాళ దాచుకున్న డబ్బు, కొన్నాళ్ళ తర్వాత వాడుకోవచ్చు. ఇవాళ చేసిన పని కొన్నాళ్ళ తర్వాత కూడా సాగుతుంది. అదే స్వప్నంలో అయితే, స్వప్నంలో వేసిన ఆకలి, స్వప్నంలోనే తీరాలి. లేచాక తీర్చుకోలేము.

జాగ్రద్ ప్రపంచం కూడా మిథ్యే అయినా, జాగ్రద్ ప్రపంచం కొంత ఎక్కువకాలం సాగుతుంది. అందుకని దాన్ని వ్యావహారిక సత్యం అంటారు. అది కూడా స్వప్నం కాబట్టి పారమార్థిక సత్యం కాదు, కాని వ్యవహారాలు నడుపుతాము కాబట్టి వ్యావహారిక సత్యం అయింది. అదే స్వప్నం దగ్గరకి వచ్చేసరికి, అది ఎక్కువ కాలం సాగదు. ఒక కలకూ ఇంకో కలకూ సంబంధం ఉండదు. ఆ స్వప్నం ఉన్నంతసేపే దానికి సంబంధించిన స్వప్నప్రపంచం ఉంటుంది. తర్వాత మళ్ళీ తిరిగిరాదు. స్వప్నప్రపంచంలో వ్యవహారం నడపలేము. అది అలా కొన్నాళ్ళు సాగదు. అందువల్ల దాన్ని వ్యావహారిక సత్యం అనలేము. కల అనుభవిస్తున్నంతసేపూ, అది స్వప్నజీవునికే సత్యం, అందుకే దాన్ని ప్రాతిభాసికం అన్నారు. ఏదైనా కాసేపు కనపడి, తర్వాత మాయమయితే, దాన్ని ప్రాతిభాసికం అంటారు. ఒకసారి ఒక కలనుంచి లేచాక, మళ్ళీ ఇంకోసారి పడుకుని కలకన్నా కూడా, మళ్ళీ అదే కల రెండోసారి రాదు. ఆ విధంగా ఒక కలను తీసుకుంటే, దానికి ఉనికి చాలా తక్కువ. క్షణంలో మాయమవుతుంది.

**శ్లోకం - 40**

**ప్రాతిభాసికజీవో యస్తజ్జగత్ ప్రాతిభాసికమ్।**
**వాస్తవం మన్యతేఽన్యస్తు మిథ్యేతి వ్యావహారికః॥**

**ప్రాతిభాసికజీవో యస్తజ్జగత్ ప్రాతిభాసికం వాస్తవం మన్యతే –** ప్రాతిభాసిక జీవుడు ప్రాతిభాసిక జగత్తును మిథ్యాసృష్టిగా ఒప్పుకోవటానికి సిద్ధపడడు. అది మిథ్యాసృష్టి అని తెలుసుకోవాలంటే, జీవుడు నిద్రనుంచి లేవాలి. నిద్రనుంచిలేచి, తాను వ్యావహారిక జీవుడిని అనే జ్ఞానం పొందాలి.

**అన్యస్తు మిథ్యేతి వ్యావహారిక –** వ్యావహారిక జీవుడికి అది మిథ్య అని తేలిగ్గా అర్థమవుతుంది. అదే సూత్రం వ్యావహారిక జీవుడికి కూడా వర్తిస్తుంది. వ్యావహారిక జీవుడు వ్యావహారిక ప్రపంచంలో ఉన్నంతసేపూ అది మిథ్య అని

ఒప్పుకోడు. స్వప్నంనుంచి లేచినట్టుగా, అతను వ్యావహారిక జీవుడి స్థాయినుంచి తన పారమార్థిక స్థాయికి లేవాలి. అదే తరువాత శ్లోకంలో వస్తుంది.

**శ్లోకం- 41**

**వ్యావహారికజీవో యస్తజ్జగద్వ్యావహారికమ్।**
**సత్యం ప్రత్యేతి మిథ్యేతి మన్యతే పారమార్థికః॥**

**వ్యావహారికజీవో యస్తజ్జగద్వ్యావహారికమ్ సత్యం ప్రత్యేతి –** వ్యావహారిక జీవుడు, తన ఉన్నతస్థాయి గురించి తెలియనంతవరకూ, జాగ్రద్ ప్రపంచాన్ని మిథ్యగా ఎన్నడూ అంగీకరించడు. ఈ జీవుడు జాగ్రద్ ప్రపంచాన్నే పారమార్థిక సత్యం అనుకుంటాడు కాని, ఇది కేవలం నామరూపాలున్న, విడిగా ఉనికి లేని ప్రపంచం అనుకోడు.

**మిథ్యేతి మన్యతే పారమార్థికః –** కాని ఒక జ్ఞాని ఎప్పుడైతే తాను ప్రాతిభాసిక చిదాభాస కాదు, వ్యావహారిక చిదాభాస కాదు, పారమార్థిక జీవుడు అని తెలుసుకుంటాడో, అప్పుడు అతను ఈ మొత్తం వ్యావహారిక జగత్తును మిథ్యగా అర్థం చేసుకుంటాడు.

ఇక్కడ ఒక ముఖ్య భేదం మనం గమనించాలి. నేను నిద్రనుంచి లేచి,నేను స్వప్నజీవుడిని కాను, వ్యావహారిక జీవుడిని అని ఎప్పుడైతే అర్థం చేసుకుంటానో, అప్పుడే ఆ కల అక్షరాలా కరిగిపోతుంది. కాని అదే వ్యావహారిక విషయానికి వచ్చేసరికి పరిస్థితి వేరు. ఆత్మజ్ఞానం పొంది, నేను వ్యావహారిక జీవిని కాదు, పారమార్థిక జీవిని, అది కల అని తెలుసుకున్నాక కూడా, నా కంటిముందు నుంచి వ్యావహారిక ప్రపంచం మాయమవదు. ప్రారబ్ధకర్మ ఉన్నంత వరకూ వ్యావహారిక జీవుడు, వ్యావహారిక జగత్తూ కొనసాగుతూనే ఉంటాయి. దానికి ఉదాహరణలు – ఆకాశం నీలంగా ఉండదని తెలిసాక కూడా, ఆకాశం నీలంగానే ఉంటుంది. సూర్యోదయం, సూర్యాస్తమయం లేవని తెలిశాక కూడా, వాటి ప్రకారం పనులు చేస్తూనే ఉంటాము.

అందువల్ల రెండు రకాల మిథ్యలు ఉన్నాయి. ఒకటి మనం జ్ఞానం పొందగానే మన కళ్ళ ముందునుంచి మాయమవుతుంది. రెండోది జ్ఞానం పొందాక కూడా మన ఎదుటే ఉంటుంది. ప్రపంచం మిథ్య అని తెలిశాక కూడా,

ఇంద్రియాలు వాటి పని అవి చేసుకుపోతూనే ఉంటాయి. కాకపోతే మనం అర్థం చేసుకోవటంలో మార్పు వస్తుంది. జ్ఞాని జీవుడు, వ్యావహారిక జగత్తు కూడా మిథ్యే అని తెలుసుకుంటాడు.

| **ప్రాతిభాసిక జీవుడు** | **వ్యావహారిక జీవుడు** |
|---|---|
| 1. ఇతను చిదాభాస 2 | ఇతను చిదాభాస 1 |
| 2. ఇతను స్వప్నం 1లో ఉన్నాడు | ఇతను స్వప్నం 2లో ఉన్నాడు. |
| 3. ఇతను లేస్తే వ్యావహారిక జీవుడు అవుతాడు. | ఇతను లేస్తే పారమార్థిక జీవుడు అవుతాడు. |
| 4. ఇతను స్వప్నప్రపంచం సత్యం అనుకుంటాడు | ఇతను జాగ్రద్‌ప్రపంచం మిథ్య అని తెలుసుకుంటాడు. |
| 5. ఇతను నిద్రలేస్తే చాలు | ఇతను జ్ఞానం పొందాలి |
| 6. ఇతను నిద్ర లేస్తే స్వప్నప్రపంచం మాయమవుతుంది | ఇతను జ్ఞానం పొందాక కూడా, జాగ్రద్ ప్రపంచం కళ్ళముందే ఉంటుంది. అనుభవం కొనసాగుతుంది. |

## శ్లోకం – 42

**పారమార్థికజీవస్తు బ్రహ్మైక్యం పారమార్థికమ్।**
**ప్రత్యేతి వీక్షతే నాన్యద్వీక్షతే త్వనృతాత్మనా॥**

**పారమార్థిక జీవస్తు బ్రహ్మైక్యం పారమార్థికమ్ –** ప్రాతిభాసిక జీవుడు స్వప్నప్రపంచాన్ని సత్యంగా భావిస్తాడు. నిద్రనుంచి లేచాక వ్యావహారిక జీవుడు అవుతాడు. అప్పుడు స్వప్నప్రపంచం అసత్యం, జాగ్రద్ ప్రపంచం సత్యం అవుతాయి. అలాగే వ్యావహారిక జీవుడు లేచాక, తాను పారమార్థిక జీవుడు అవుతాడు. అప్పుడు జాగ్రద్ ప్రపంచం మిథ్య అయి, బ్రహ్మతో ఐక్యాన్ని పొందుతాడు. **'అహం బ్రహ్మ అస్మి,'** సత్యం అవుతుంది ఆ జీవుడికి. శ్రవణ, మనన, నిదిధ్యాసనలు పదే పదే చేయటంవల్ల అతను సత్యంలోనే రమిస్తాడు.

జ్ఞానం పొందటం తేలికే కాని, వచ్చిన చిక్కేమిటంటే శ్రవణంలో పొందిన జ్ఞానం జీవితంలో సమస్యలను ఎదుర్కొనటానికి తోడ్పడదు. ఎందుకంటే జీవుడిగా నేను వేసే పాత్రలు ఇంకా ప్రముఖపాత్రను వహిస్తాయి. అందుకే జ్ఞానం పొందితే

చాలదు, జ్ఞాననిష్ఠలో ఉండాలి. నేను పారమార్థిక జీవుడిని అనే సత్యం నా మనస్సులో మొట్టమొదటి స్థానాన్ని ఆక్రమించాలి. ఎంత తెలివైన వాడైనా, వ్యావహారిక జీవుడిలోకి వెళ్ళిపోతూ ఉంటాడు. అందుకే దీర్ఘకాల శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేస్తూ ఉండాలి.

**ప్రత్యేతి వీక్షతే నాన్యద్వీక్షతే త్వనృతాత్మనా –** ఎవరైతే పారమార్థిక జీవుడిలో నెలకొని ఉంటారో, వారు వ్యావహారిక జీవుడితోనూ, ప్రాతిభాసిక జీవుడితోనూ అవసరం మించి మమేకం చెందరు. అతని పాత్ర వ్యవహారంలో ఎంతవరకూ పోషించాలో అంతవరకూ సమర్థవంతంగా పోషించి, ఏమాత్రం శ్రమ లేకుండా, రెండో పరిస్థితిలోకి జారుకుంటాడు. తన పాత్రలను చక్కగా పోషిస్తున్నా కూడా, అవి మిథ్య అనే విషయాన్ని మర్చిపోడు. ఎప్పుడైతే అవి మిథ్య అని మర్చిపోతాడో, అప్పుడే ఈ ప్రపంచం సత్యం అయి కూర్చుంటుంది. జీవుడిని బంధించే శక్తి ప్రపంచానికి బాగా ఉంది. ప్రపంచం సత్యం అనుకుంటే, జీవుడు అందులో తేలికగా బందీ అయిపోతాడు. ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే దాన్ని మిథ్యగానే చూడాలి. పారమార్థిక జీవుడు చేసే పని అదే. అతను జీవన్ముక్త జ్ఞాని. అది ఎలాగుండాలంటే స్వప్నంలో వ్యక్తికి స్వప్నం, స్వప్నం అని తెలిసినట్టు ఉండాలి.

## శ్లోకం– 43

**మాధుర్యద్రవశైత్యాని నీరధర్మాస్తరఙ్గకే।**
**అనుగమ్యాథ తన్నిష్ఠే ఫేనేఽ ప్యనుగతా యథా॥**

వ్యావహారిక జీవుడిని, ప్రాతిభాసిక జీవుడిని మిథ్య అనీ, పారమార్థిక జీవుడు మాత్రమే సత్యం అనీ ఎందుకంటున్నారు? ప్రాతిభాసిక జీవుడు మిథ్య అని ఒప్పుకోవటం తేలికే కాని, జాగ్రద్ పురుషుడిని కూడా మిథ్య అని కొట్టిపారేయటం చాలా కష్టం. పారమార్థిక జీవుడొక్కడే సత్ చిత్ ఆనంద స్వరూపం. వ్యావహారిక జీవుడికి విడిగా ఉనికి లేదు. పారమార్థిక జీవుడు వీటిని చిదాభాస అయిన వ్యావహారిక జీవుడికి అరువుగా ఇస్తున్నాడు. అరువు తెచ్చుకున్నదేదీ శాశ్వతం కాదు. ముఖ్యంగా అరువు తెచ్చుకున్న ఆనందం.

అందువల్ల వ్యావహారిక జీవుడు సంసారంలో పడిపోతున్నాడు. వ్యావహారిక జీవుడు తను అరువు తెచ్చుకున్న సత్ చిత్ ఆనందాన్ని ప్రాతిభాసిక జీవుడికి అప్పుగా ఇస్తున్నాడు. సత్ చిత్ ఆనందాన్ని ఇలా ఒక దాన్నించి ఇంకొకటి అప్పు తెచ్చుకునే ఈ వరుసక్రమాన్ని ఒక అద్భుతమైన ఉదాహరణద్వారా ఇందులో చూస్తాము.

ఒక కొలనుమీద అల ఉంది. అలమీద బుడగ ఉంది. ఇప్పుడు, కొలనులోని నీరు పారమార్థిక జీవుడు, అల వ్యావహారిక జీవుడు. బుడగ ప్రాతిభాసిక జీవుడు. నీటికి మూడు లక్షణాలు ఉన్నాయి.

**మాధుర్యద్రవశైత్యాని –** మధురమైన రుచి, ద్రవాకారం, శీతలత్వం.

**నీరధర్మాస్తరఙ్గకే –** నీటికి ఉన్న ఈ మూడు లక్షణాలు అలకు వెళతాయి. అలపైన ఉన్న బుడగలో కూడా ఈ మూడు లక్షణాలూ ఉంటాయి. నీరు, బుడగకు ఈ లక్షణాలను ప్రత్యక్షంగా ఇవ్వలేదు.

**అనుగమ్యాథ తన్నిష్ఠే ఫేనేఽ ప్యనుగతా యథా –** వీటిని అలకు అప్పిస్తే, అల తిరిగి బుడగకు అప్పు ఇచ్చింది. అక్షరాలా ఈ ఉదాహరణలాగే, పారమార్థిక జీవి యొక్క మూడు లక్షణాలనూ నేను కూడా అనుభవిస్తున్నాను. నేను పారమార్థిక జీవిని– నీటిలాగా; వ్యావహారిక జీవిని– అశాశ్వతమైన అలలాగా; ప్రాతిభాసిక జీవిని– మరింత అశాశ్వతమైన బుడగలాగా. ఈ శ్లోకంలో దృష్టాంతం, తరువాత శ్లోకంలో ద్రాష్టాంతం.

## శ్లోకం – 44

**సాక్షిస్థాః సచ్చిదానన్దాః సమ్బన్ధాద్వ్యావహారికే।**
**తద్ద్వారేణానుగచ్ఛన్తి తథైవ ప్రాతిభాసికే॥**

ఉదాహరణలో లాగే నేను, అసలు 'నీరు'ను అంటే సాక్షి లేదా పారమార్థిక జీవుడిని. నా అసలు స్వరూపం సత్–చిత్–ఆనందం. నేను ఎప్పుడూ ఉంటాను. నాకు చావు పుట్టుకలు లేవు. నేను 'నీరు' అనుకుంటే శాశ్వతం. నేను 'అల' లాంటి వ్యావహారిక జీవుడిని అనుకుంటే నాకు సమస్యలు ఉన్నాయి. అల జీవితకాలం గాలిమీద ఆధారపడి ఉంటుంది. అలాగే వ్యావహారిక జీవి జీవితం కర్మమీద

ఆధారపడి ఉంటుంది. నేను 'బుడగ'లాంటి ప్రాతిభాసిక జీవిని అంటే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. దాని జీవితం మరీ అశాశ్వతం. అందువల్ల నేను 'బుడగను' లేదా 'అల'ను అనుకోవటం తెలివితక్కువ పని. నేను 'నీరు'ను అని అర్థం చేసుకోవటం తెలివైన పని. ఎందుకంటే గాలి తాకిడికి నీరేం అవదు. అందువల్ల నేను వ్యావహారిక జీవుడిని కాదు, నేను ప్రాతిభాసిక జీవుడిని కాదు, నేను పారమార్థిక జీవుడిని అని తెలుసుకోవాలి. ఈ పారమార్థిక జీవుడినే ఈ శ్లోకంలో 'సాక్షి'గా చూస్తాము.

**సాక్షిస్థాః సచ్చిదానన్దాః సమ్బన్ధాద్వ్యావహారికే –** సాక్షిని అయిన నేను సత్ చిత్ ఆనందాన్ని వ్యావహారిక జీవుడికి అప్పుగా ఇస్తాను. అది అశాశ్వతమైన శరీరంలో ఉన్న అశాశ్వతమైన చిదాభాస.

**తద్వారేణానుగచ్ఛన్తి తథైవ ప్రాతిభాసికే –** ఈ వ్యావహారిక జీవుడి ద్వారా, ఇదే సత్ చిత్ ఆనందాన్ని ప్రాతిభాసిక జీవుడికి ఇస్తాను. జాగ్రద్ పురుషుని మనస్సే స్వప్నశరీరానికి చైతన్యాన్ని ఇస్తుంది.

## శ్లోకం – 45

**లయే ఫేనస్య తద్ధర్మా ద్రవాద్యాః స్యుస్తరఙ్గకే।**
**తస్యాపి నిలయే నీరే తిష్ఠన్త్యేతే యథా పురా॥**

ఇదే భావాన్ని ఇప్పుడు వెనకనుంచీ చూస్తాము. ముందేమో నీటినుంచి అలకూ, అల నుంచీ బుడగకూ, నీటి మూడు లక్షణాలు ఎలా వెళతాయో చూశాము. ఇప్పుడు బుడగ నుంచీ చూస్తాము.

**లయే ఫేనస్య తద్ధర్మా ద్రవాద్యాః స్యుస్తరఙ్గకే –** ఒకవేళ బుడగ పేలిపోయిందో లేక కరిగిపోయిందో అనుకోండి. అప్పుడు నీటికున్న మూడు లక్షణాలు– మధురమైన రుచి, ద్రవాకారం, శీతలత్వం. ఆ లక్షణాలు ఏమవుతాయి? బుడగతో పాటు మాయమవవు. ఎందుకంటే అవి బుడగ లక్షణాలు కాదు. ఆ లక్షణాలు అలలో మిగులుతాయి.

**తస్యాపి నిలయే నీరే తిష్టన్త్యేతే యథా పురా –** అలాగే అల కరిగిపోయినా, ఆ లక్షణాలు కరిగిపోవు. నీటిలో మిగులుతాయి. అలలో ఉన్న నీరు, బుడగలో ఉన్న నీరూ, అవి ఉన్నా లేకపోయినా ఉంటుంది. అలాగే స్వప్నజీవుడు

కరిగిపోయినా, సత్‌చిత్‌ఆనందం నాశనమవదు, జాగ్రద్ జీవునిలో లయమవుతుంది. ప్రళయకాలంలో జాగ్రద్ జీవులందరూ లయమయిపోయినా, సత్‌చిత్ ఆనందం నాశనమవదు. అది పారమార్థిక జీవునిలో ఉంటుంది.

**శ్లోకం - 46**

**ప్రాతిభాసికజీవస్య లయే స్యుర్వ్యావహారికే।**
**తల్లయే సచ్చిదానన్దాః పర్యవస్యన్తి సాక్షిణి॥**

**ప్రాతిభాసికజీవస్య లయే స్యుర్వ్యావహారికే** –స్వప్నజీవుడు నిద్రలోంచి లేస్తే కరిగిపోయినప్పుడు, స్వప్నజీవుడిలో ఉన్న సత్ చిత్ ఆనందం జాగ్రద్ జీవుడికి వస్తుంది. 'నేను ఉన్నాను' అనే పదం అన్ని జీవులకూ వర్తిస్తుంది. నేను అంటే చైతన్యం, ఉన్నాను అంటే ఉనికి. అంటే ఇవి చిత్,సత్. నేను ఉన్నాను అనేది సత్యం, దాని తర్వాత ఏది కలిపినా అది మిథ్య.

**తల్లయే సచ్చిదానన్దాః పర్యవస్యన్తి సాక్షిణి** - జాగ్రద్ జీవుడు లయం చెందేది - సుషుప్తిలో, మరణంలో, ప్రళయంలో, విదేహముక్తిలో– సుషుప్తి,మరణం, లేదా ప్రళయం తాత్కాలికం. అందుకని జాగ్రద్ జీవుడు కూడా తాత్కాలికంగా లయం చెందుతాడు. విదేహముక్తి కలిగినప్పుడే, జాగ్రద్ జీవుడు శాశ్వతంగా లయం చెంది, సాక్షిచైతన్యంలో లేదా బ్రహ్మలో ఐక్యం అవుతాడు. సాక్షి లయం అవదు. అవలేదు. సాక్షినైన నేను ఎప్పుడూ ఉంటాను. నాలోనే అల, బుడగల సృష్టి జరుగుతుంది. నాలోనే లయమవుతాయి. నేను సాక్షిని. నాలో అనేక పాత్రలు వస్తుంటాయి, పోతుంటాయి. జీవితమనే నాటకం సాక్షినైన నాలో సాగుతుంది. జీవుడుగా నేను వేయాల్సిన అనేకమైన మిథ్యాపాత్రలు సంపూర్ణంగా,సరియైన సమయంలో వేయాలి. కాని నేను సాక్షిని, నేను సత్యాన్ని, ఇదే నా అసలు స్వరూపం అనేది మర్చిపోకూడదు.

నేను దృక్ 3ను. దృక్ 2, దృక్ 1 మిథ్య.

**ఇదీ దృగ్దృశ్య వివేకము**

# దృగ్ద్రృశ్య వివేకము - సారాంశము

**దృగ్ద్రృశ్య వివేకము** రాసింది విద్యారణ్యస్వామి అని కొందరు, భారతీ తీర్థస్వామి అని కొందరు అంటారు. ఆదిశంకరులని మరి కొందరు అంటారు. ఎవరురాసినా అద్భుతమైన వేదాంతబోధ ఉంది ఇందులో. 46 శ్లోకాలు ఉన్నాయి. వాటిని ఐదు అంశాలుగా విభజించవచ్చు.

| | | |
|---|---|---|
| **1. మూడు రకాల దృక్కులు** | **-** | **1-5** |
| **2. మూడు దృక్కుల పనితీరు** | **-** | **6-12** |
| **3. సంసారం కారణం, దాని పరిష్కారం** | **-** | **13-21** |
| **4. నిదిధ్యాసనం, దాని ఫలం** | **-** | **22-31** |
| **5. వేదాంత బోధ సారాంశం** | **-** | **32-46** |

**1. మూడు రకాల దృక్కులు -1-5**

ఒక వ్యక్తిలో మూడు దృక్కులు ఉన్నాయి.

సాక్షి - దృక్ 3, మనస్సు - దృక్ 2, ఇంద్రియాలు - దృక్ 1

సాక్షి సత్యం; మనస్సు, ఇంద్రియాలు మాయికం.

**2. మూడు దృక్కుల పనితీరు - 6-12**

మనస్సు సాక్షినుంచి చైతన్యాన్ని అరువు తెచ్చుకుని ఇంద్రియాలకు ఇస్తుంది. మనస్సు లేనిదే ఇంద్రియాలు ఉన్నా లేనట్టే. మనస్సు లేనిదే సాక్షి ఉన్నట్టే తెలియదు.

మనస్సుకు చిత్‌తో, చిదాభాసతో, శరీరంతో ఉన్న అనుబంధం -

సహజం - మనస్సుకూ, చిదాభాసకూ మధ్య ఉన్న అనుబంధం సహజం. జన్మజన్మలకూ ఉంటుంది. ఇది మనస్సు రాలితేనే రాలిపోతుంది.

కర్మజం - మనస్సుకూ, శరీరానికీ మధ్య ఉన్న అనుబంధం కర్మ సంబంధం. ఇది శరీరం రాలితే రాలిపోతుంది.

భ్రాంతిజం - మనస్సుకూ, సాక్షికీ మధ్య నిజంగా అనుబంధం లేదు. ఇది భ్రాంతి. మనమే మనస్సే సాక్షి అనే భ్రాంతిలో పడి సంసారంలో పడిపోతున్నాము.

మనస్సుకు రెండు అంశాలు ఉన్నాయి.

ద్రవ్యంశం – మూడు అవస్థల్లో పనిచేస్తుంది.

వృత్త్యంశం – స్వప్నప్రపంచాన్ని, జాగ్రద్ ప్రపంచాన్ని సృష్టిస్తుంది.

**3. సంసారం కారణం, దాని పరిష్కారం –13–21**

మాయకు రెండు శక్తులు ఉన్నాయి.

విక్షేపశక్తి – దీనిద్వారా సృష్టి చేస్తుంది.

ఆవరణశక్తి – దీనివల్ల సంసారం ఏర్పడుతోంది.

సంసారం రెండు స్థాయిల్లో ఏర్పడుతోంది.

ఆధ్యాత్మికం – ఆత్మానాత్మ వివేకం చేయకపోవటంవల్ల.

బాహ్యం – జగత్తును, బ్రహ్మను విడిగా చూడలేకపోవటంవల్ల.

పరిష్కారం కూడా రెండు స్థాయిల్లో చేయాలి.

వ్యష్టిపరంగా నేను మనస్సు కాదు, సాక్షిని అని తెలుసుకోవాలి.

సమష్టిపరంగా బ్రహ్మ సత్యం, జగత్తు మిథ్య అని తెలుసుకోవాలి.

ఒక వస్తువులో ఐదు అంశాలు ఉంటాయి. అస్తి, భాతి, ప్రియం, నామం, రూపం

అస్తి, భాతి, ప్రియం బ్రహ్మలక్షణాలు; నామం, రూపం, వస్తులక్షణాలు.

వాటిని బుద్ధితో విడదీసి చూడటం నేర్చుకోవాలి.

**4. నిదిధ్యాసనం, దాని ఫలం– 22–31**

దానికి 6 రకాల నిదిధ్యాసనం తోడ్పడుతుంది, రెండు స్థాయిల్లో

**ఆంతరంగా –** దృశ్య అనువిద్ధ– ముందు ఒక వృత్తిని తీసుకుని, దాన్నుంచి సాక్షికి రావాలి.

శబ్ద అనువిద్ధ – తర్వాత ఉపనిషత్తుల్లో చెప్పిన సాక్షిలక్షణాలమీద ఏకాగ్రత చూపాలి.

ఆ సాక్షిని నేనే అని చేయాలి.

నిర్వికల్ప సమాధి – అలా కొంతసేపు చేసాక, మీ ప్రమేయం లేకుండానే ఆ ఆలోచన మీ మనస్సులో మెదులుతూ ఉంటుంది.

ఇదంతా కళ్ళు మూసుకుని చేయాలి.

**బాహ్యంగా –** దృశ్య అనువిద్ధ – ఒక వస్తువును తీసుకుని, బ్రహ్మతో

పోల్చాలి.

శబ్ద అనువిద్ధ – ఉపనిషత్తులో చెప్పిన బ్రహ్మ లక్షణాలమీద ఏకాగ్రత చూపాలి.

నేనే ఆ బ్రహ్మను అని చేయాలి.

నిర్వికల్ప సమాధి – అలా కొంతసేపు చేసాక, మీ ప్రమేయం లేకుండానే ఆ ఆలోచన మీ మనస్సులో మెదులుతూ ఉంటుంది.

ఇదంతా కళ్ళు తెరుచుకుని చేయాలి.

**5. వేదాంత బోధ సారాంశం– 32–46**

వ్యక్తిలో మూడు జీవులు ఉంటాయి.

పారమార్థిక జీవి, వ్యావహారిక జీవి, ప్రాతిభాసిక జీవి.

పారమార్థిక జీవినైన నేను వ్యావహారిక జీవిని, జాగ్రద్ ప్రపంచాన్ని నా మాయాశక్తి, విక్షేపశక్తివల్ల సృష్టించి, అందులోకి ప్రవేశించాను.

నా ఆవరణశక్తివల్ల నేను పారమార్థిక జీవినని ఇప్పుడు మర్చిపోయాను. ఇది స్వప్నం –1.

వ్యావహారిక జీవినైన నేను, ప్రాతిభాసిక జీవిని, స్వప్నప్రపంచాన్ని నా నిద్రాశక్తియొక్క విక్షేపశక్తివల్ల సృష్టించి, అందులోకి ప్రవేశించాను.

నా ఆవరణశక్తివల్ల నేను వ్యావహారిక జీవినని అక్కడ మర్చిపోయాను. ఇది స్వప్నం – 2.

దీనికి ఉదాహరణ – నీటికి మూడు లక్షణాలు – మాధుర్యం, ద్రవ్యం, శీతలం.

ఇవి నీటినుంచి, దానిపైకి లేచిన అలకు వెళ్ళి, దానిపైన లేచిన బుడగకు అలనుంచి వెళతాయి. బుడగ కరిగి అలలో, అల కరిగి నీటిలో లయమయి పోయినప్పుడు నీటి లక్షణాలు యథాతథంగా ఉంటాయి.

అలాగే పారమార్థిక జీవికి మూడు లక్షణాలు – సత్ చిత్ ఆనందం.

ఇవి పారమార్థిక జీవినుంచి వ్యావహారిక జీవికీ, అతనినుంచి ప్రాతిభాసిక జీవికీ వెళతాయి. ప్రాతిభాసిక జీవి స్వప్నంనుంచి లేచి వ్యావహారిక జీవిలో కలిసినట్టుగా, వ్యావహారిక జీవి లేచి పారమార్థిక జీవిలో కలవాలి. అంటే సత్, చిత్, ఆనందాలు తన స్వభావం అని తెలుసుకోవాలి.

**ఇదీ దృగ్ దృశ్య వివేకము**

## శ్రీ సద్గురుచరణారవిందాభ్యాం నమః

అధునా సర్వత్ర జగతి ప్రసరతః జనానాం ప్రాణాపాయకరస్య కొరోనా-నామకస్య రోగవిశేషస్య నివారణార్థం, శృంగేరి జగద్గురు విరచిత శ్రీదుర్గా పరమేశ్వరీ స్తోత్రపారాయణం కరిష్యే॥

**శృంగేరీజగద్గురువిరచితమ్**

**॥శ్రీదుర్గాపరమేశ్వరీస్తోత్రమ్॥**

**ఏతావంతం సమయం సర్వాపద్భ్యోఽపి రక్షణం కృత్వా।**
**దేశస్య పరమిదానీం తాటస్థ్యం కేన వహసి దుర్గాంబ॥ ॥ 1 ॥**

**అపరాధా బహుశః ఖలు పుత్రాణాం ప్రతిపదం భవంత్యేవ ॥**
**కో వా సహతే లోకే సర్వాంస్తాన్మాతరం విహాయైకాం ॥ ॥ 2 ॥**

**మా భజ మా భజ దుర్గే తాటస్థ్యం పుత్రకేషు దీనేషు।**
**కే వా గృహ్ణంతి సుతాన్ మాత్రా త్యక్తాన్వదాంబికే లోకే॥ ॥ 3 ॥**

**ఇతః పరం వా జగదంబ జాతు దేశస్య రోగప్రముఖాపదోఽస్య ॥**
**న స్యుస్తథాః కుర్వచలాం కృపామ్ ఇత్యభ్యర్థనాం మే సఫలీకురుష్వ॥॥ 4 ॥**

**పాపహీనజనతావనదక్షాః సంతి నిర్జరవరా న కియంతః॥**
**పాపపూర్ణజనరక్షణదక్షాం త్వాం వినా భువి పరాం న విలోకే॥ ॥ 5 ॥**

**సర్వే భవంతు సుఖినః। సర్వే సంతు నిరామయాః।**
**సర్వే భద్రాణి పశ్యంతు। మా కశ్చిత్ దుఃఖభాగ్భవేత్॥**